SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume: 54, Issue: 12
MAY - 2024 Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

మే 2024
వెల రూ. 20/-
పుటలు-56



తిరుపతి

## శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం

2024 మే 16 నుండి 24 వరకు

**శ్రీ క్రోధి నామసంవత్సర ఉగాది పర్వదినాన్ని (09-04-2024) పురస్కరించుకుని తిరుమల శ్రీవారిఆలయంలోనూ, ఇతర తి.తి.దే. అనుబంధ ఆలయాల్లోనూ నిర్వహించిన ఉగాది ఆస్థాన వేడుకల దృశ్యాలు**























**తిరుమల తిరుపతి దేవస్థానం విద్య & వైద్య శాఖలకు నూతన సంయుక్త కార్యనిర్వహణాధికారిణిగా శ్రీమతి ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్. గారు నియమితులయ్యారు.**

**వీరు 09-04-2024 (తెలుగు నూతన సంవత్సరాది)న పదవీ బాధ్యతలు స్వీకరించారు.**





# గీతాశ్లోకార్థసారం

**శ్లో : నాసతో విద్యతే భావో నా భావో విద్యతే సతః।**
**ఉభయోరపి దృష్టోఽ న్తస్త్వనయో స్తత్త్వదర్శిభిః॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-16వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అసతః= లేనిదానికి; భావః= ఉనికి; న విద్యతే= లేదు; సతః= ఉన్నదానికి; అభావః= లేమి; న విద్యతే= లేదు; అనయో= ఈ; ఉభయోరపి= రెండింటియొక్క; అన్తః తు= నిశ్చయమన్ననో; తత్త్వదర్శిభిః= జ్ఞానులచేత; దృష్టః=చూడబడింది.

**భావం:** అసత్యాలై (నామరూపాత్మకాలై, నశించే స్వభావంగలవియై) నట్టి దేహాదులకు ఉనికిలేదు, సత్యమైన ఆత్మకు లేమి లేదు. తత్త్వజ్ఞానులగువారీ రెండింటి యొక్క నిశ్చయాన్ని బాగా తెలిసికొనియున్నారు.

---

## వదలక కొలిచితే వరములిచ్చీని

పెద ఔబళపు కొండ పెరిగీనిఆదే
వదలక కొలిచితే వరములిచ్చీని

పదివేల శిరసుల బలునరసింహము
గుదిగొన్నచేతుల గురుతైనది

ఎదుట పాదాలు కన్నులెన్నైన కలిగినది
యిది బ్రహ్మండపు గుహ నిరవైనది

ఘనశంఖ చక్రాదుల కైదువలతో నున్నది
మొనసి రాకాసి మెకముల గొట్టేది
కనకపు దైత్యుని కడుపు చించినది
తను నమ్మిన ప్రహ్లాదు దాపును దండైనది.

శ్రీవనిత తొడమీద చేకొని నిలిపినది
దేవతలు కొలువ గద్దెపై నున్నది
శ్రీవేంకటాద్రియందు చెలగి భోగించేది
భావించి చూచితేను పరబ్రహ్మమైనది

(ఆధ్యాత్మ సంకీర్తన; సంపుటం 4 - సంఖ్య 309)

*ఈ సంకీర్తనలో ఎంతగానో పెరిగిన అహోబలాన్ని, నారసింహుణ్ణి ఉద్విగ్నభరితంగా అన్నమయ్య కీర్తిస్తున్నాడు.*

*"ఆహా... ఎంత గొప్పగా ఈ పెద్ద అహోబిలపు కొండ పెరిగిందో కదా... మనం తదేకచిత్తంతో, భక్తితో వదలకుండా కొలిస్తే కొండలంత వరాలను అనుగ్రహిస్తుంది కదా...*

*పదివేల శిరసులతో కొలువైన, బలవంతుడైన దైవం ఆ నరసింహుడు. ఎంతో ప్రేమతో విశాలమైన తన చేతులను చాచి కొలువై ఉన్నాడు. ఎంతో గొప్పగా పాదాలు, విశాలమైన కన్నులు ఎన్నో కలిగి కాంతులీనుతున్నాడు. ఈ బలమైన దైవం బ్రహ్మండమనే గుహను స్థిరమైన నివాసంగా ఏర్పరుచుకుని భాసిస్తోంది.*





*ఈ దైవం ఘనమైన శంఖచక్రాలను ఆయుధాలుగా చేతిలో ధరించి ఉంది. ఒక రకమైన పూనికతో దుష్ట రాకాసిమూకలను తుదముట్టించేది. ఎంతో విభ్రాజమైన రీతిలో హిరణ్యకశిపుని కడుపును చీల్చి పేగులను మెడలో జందెంగా వేసుకుంది. అంతేకాదు, తన భక్తులలోనే అగ్రగణ్యుడు, శిష్టుడు అయిన ప్రహ్లాదుని రక్షించడానికి అతనికి తోడుగా ఉండి కుటిలత్వంపై దండెత్తింది. ఈ దైవమే.*

*ఎంతో ప్రేమతో శ్రీమహాలక్ష్మిని తన తొడమీద కూర్చోబెట్టుకుని తన అనురాగాన్ని చాటుతూ, దేవతలంతా భక్తితో కొలుస్తూ ఉండగా ఘనమైన సింహాసనం మీద కూర్చొని భక్తులను కటాక్షిస్తూ ఈ దైవం కొలువై ఉంది. సరియైన భావనతో చూస్తే ఈ బ్రహ్మండాన్ని సింహపరాక్రమంతో రక్షించే పరబ్రహ్మ స్వరూపం ఈ దైవమే కదా"- అంటూ తన ఉద్వేగాన్ని అద్వితీయమైన ఈ సంకీర్తనలో ప్రకటించాడు అన్నమయ్య.*

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు

## (ఒక్కరోజు విరాళపథకం)

అన్నం పరబ్రహ్మస్వరూపం. ఆకలిగా ఉన్నవారికి అన్నం పెట్టడంకంటే పుణ్యం మరొకటి లేదు. ఈ సదాశయంతోనే తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల, తిరుచానూరు, శ్రీగోవిందరాజస్వామి ఆలయం, తిరుపతిలలో నిత్యం అన్నప్రసాద వితరణ చేస్తోంది. దీనికి ఎంతోమంది దాతలు విరివిగా విరాళాలు ఇస్తున్నారు. ఇవ్వడమూ తెలిసిన విషయమే! అయితే, భూరివిరాళాలు ఇచ్చే సౌకర్యం అందరికీ ఉండకపోవచ్చు. దీన్ని గమనించి తి.తి.దే. ఒక్కరోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చును కూడా భక్తులనుండి విరాళంగా స్వీకరించేందుకు సంసిద్ధమైంది. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. తోటివారి ఆకలి తీర్చవచ్చు!! మాధవుని అనుగ్రహాన్ని పొందవచ్చు!!!

### ఒకరోజు ఖర్చు..

| | | |
|---|---|---|
| 1) అల్పాహారం (టిఫిన్) | - | 08 లక్షలు |
| 2) మధ్యాహ్నభోజనం | - | 15 లక్షలు |
| 3) రాత్రిభోజనం | - | 15 లక్షలు |
| మొత్తం | - | 38 లక్షలు |

ఈ మొత్తాన్ని దాతలు తి.తి.దే. అన్నప్రసాదం ట్రస్టుకు అందజేయవచ్చు

ఈ విరాళాలను కేవలం వ్యక్తిగతంగానే కాక, కంపెనీలు, సంస్థలు, ట్రస్టులు సంయుక్తంగా కూడా అందజేయవచ్చు.

దాతలు రోజువారి మొత్తం(రూ.38 లక్షలు) గానీ, అల్పాహారం (రూ.8 లక్షలు) గానీ, మధ్యాహ్నభోజనం (రూ.15 లక్షలు) గానీ, రాత్రి భోజనం- (రూ.15 లక్షలు) గానీ ఎంపిక చేసుకుని వితరణ చేయవచ్చు. దాతలకు తి.తి.దేవస్థానం కల్పించే సౌకర్యాలు ఒకే విధంగానే ఉంటాయి.

**మరిన్ని వివరాలకు -** ఉపకార్యనిర్వహణాధికారి, (డోనార్‌సెల్) ఎఫ్.ఏ.సి., తి.తి.దే., తిరుమల. ఫోన్ - 0877-2263001, 2263472. మెయిల్ ఐడి- cdmc.ttd@tirumala.org.

విరాళాలు ఇచ్చేదాతలు భక్తులకు తామే స్వయంగా వడ్డించే అవకాశం కలదు. ఈ దాతల పేరు మాతృశ్రీ తరిగొండవెంగమాంబ అన్న ప్రసాదవితరణకేంద్రం తిరుమలలో ప్రదర్శించబడుతుంది.









తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54 మే, 2024 సంచిక : 12


వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ఎంత బాధ భరించి ఉంటాడో స్వామి? | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 07 |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| శ్రీకృష్ణామృతం | 'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు | 12 |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 13 |
| కోరిన కోర్కెలు తీర్చే స్వామి! | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 14 |
| పుష్కర నర్మద | శ్రీ ఎన్.జి.టి.అంతర్వేది కృష్ణమాచార్యులు | 18 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 21 |
| నమో నారసింహా! నమో భక్తపాలా! | డా॥ ముంజులూరి నరసింహారావు | 22 |
| అక్షయ ఫలాలనిచ్చే అక్షయతృతీయ | శ్రీమతి పూర్ణిమాస్వాతి గోపరాజు | 24 |
| 108 దివ్యదేశాలు-తిరు అరిమేయవిణ్ణగరమ్ | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 26 |
| కనకధారాస్తవం | | 27 |
| శ్రీగోవిందరాజస్వామివారి ఆలయం | శ్రీ వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు | 31 |
| వెలుగును ప్రసాదించే వ్రతం | శ్రీ భక్తికా దేవిదాసి | 35 |
| దండాలు పెడితే గండాలు కాచే తల్లి | డా॥ ఆకెళ్ల విభీషణశర్మ | 36 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు- శ్రీదేవీ మురళీధర్ | 39 |
| నీ లీల నెన్న తరమా? భక్త పారిజాతమా.. | డా॥ గంగిశెట్టి శివకుమార్ | 41 |
| ఎవరికైనా అవసరమే! ఎప్పటికైనా అవసరమే! | ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు | 42 |
| నీటిని గౌరవించాలి | శ్రీమతి నల్లాని రాజేశ్వరి | 44 |
| స్వరమాధుర్యానికి సులభమార్గాలెన్నో | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| ఆధ్యాత్మిక కీర్తిపతాకం... | డా॥ కప్పగంతు రామకృష్ణ | 47 |
| భక్తులను బాధిస్తే (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| బాలవినోదం | | 50 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 51 |
| చదువు-సంస్కారం | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 52 |
| ధర్మాధర్మాలు | డా॥ వద్దేపల్లి శ్రీనివాసరావు | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : ఉభయదేవేరీ సమేత శ్రీగోవిందరాజస్వామివారు (ఉత్సవమూర్తులు), తిరుపతి
వెనుకచిత్రం : శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు, నారాయణవనం



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# అన్నదానం

**'అన్నం పరబ్రహ్మస్వరూపం'** అన్నారు– పెద్దలు. అన్నిదానాలలోకి అన్నదానం చాలాగొప్పది. అన్నదానం చేసేవారు దేవలోకపూజ లందుకుంటారు. పురుషార్థాలసాధనకు అవసరమైన దేహాన్ని నిలిపేది అన్నం ఒక్కటే. ఆహారం లేకపోతే ప్రాణులు నశిస్తాయి. అంచేత అన్నదానం చేసినవారు ప్రాణదానం చేసినవారే అవుతారు. ప్రాణాల నివ్వడమంటే సర్వస్వాన్నీ ఇచ్చినట్లే. కాబట్టి వారికి సర్వవస్తువులనూ దానంచేసినఫలం దక్కుతుంది. అన్నాన్ని తిని ఆ శక్తితో ఎవరు ఏ పుణ్యకార్యాలు చేసినా, అందులో సగంపుణ్యం అన్నదాతకు, మిగిలినసగం ఆ కార్యం చేసినవారికీ లభిస్తుంది అని పెద్దలమాట.

'మానవసేవే మాధవసేవ' అన్నారు. ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడమనే సేవ ఒక యజ్ఞం చేసినఫలితాన్నిస్తుందంటారు. మనుషులను భోజనంద్వారానే తృప్తిపరచగలం. ఎంత బంగారం, వస్త్రాలు ఇంకా ఏమి ఇచ్చినా ఆశతీరదు. ఇంకా ఇంకా కావాలంటారు. కానీ, ఒక్క 'అన్నదానం' లోనే 'చాలు' అనే పదం వారినుండి మనఃస్ఫూర్తిగా మనం వినగలం. అన్నదానంవల్ల త్రిలోకాల్లో యశస్సు, తేజస్సు, బలం ప్రాప్తిస్తా యని చెప్పబడింది. స్వర్గంలో ప్రథమప్రవేశం అన్నదానం చేసిన వారికే అని కూడా వేదోక్తి. ఈ సూక్తిని తిరుమల తిరుపతి దేవస్థానం అక్షరాలా ఆచరణలో పెట్టింది.

ఆలయాలలో 'ప్రసాదాల వినియోగం'లో ఇహమూ, పరమూ ఉంది. పూజాదికాలు నిర్వర్తించేవారికీ, ఆలయాలకు విచ్చేసే భక్తులకూ ప్రసాదవితరణం సనాతన సంప్రదాయం. ఉత్సవాల్లో కొన్ని పూర్తిగా అన్నదానానికే సంబంధించినవి. తిరుమలలో 'తిరుప్పావడ' ఇలాంటిదే. తిరుమల క్షేత్రంలో భక్తుల ఆకలి తీర్చడానికే సాళువ నరసింహరాయలు అన్నదానసత్రాలు నిర్మించాడు. శ్రీకందాడైరామానుజఅయ్యంగార్ పర్యవేక్షణలో 'రామానుజకూటములు' ఏర్పాటయ్యాయి. ఇలా ప్రపంచంలోనే అతిపెద్దధార్మికక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానములు ఎంతోకాలంగా స్వామివారి భక్తులకు అన్నదానం చేస్తూ మానవసేవలో తరిస్తూంది.

ఈ సనాతనసంప్రదాయాన్నే కొనసాగిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానములు ఈ పవిత్రపుణ్యకార్యాన్ని 06-04-1985లో ప్రారంభించింది. రెండువేలమంది భక్తులతో ఆరంభమైన ఈ పథకం క్రమేణా విస్తరించింది. గతంలో శ్రీవారిఆలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు మాత్రమే ఈ అన్నప్రసాదం వర్తించేది. అయితే 2006వ సంవత్సరంలో అప్పటి పాలకమండలి అధ్యక్షులు శ్రీవారి దర్శనంతో సంబంధం లేకుండా తిరుమలకు వచ్చిన భక్తులందరికీ శ్రీవారిప్రసాద భోజనసౌకర్యాన్ని కల్పించడం జరిగింది.

ఆ తర్వాత తి.తి.దే. సాధికారమండలి నిత్యాన్నదాననూతనభవనసముదాయాన్ని ప్రారంభించింది. అప్పట్లో తిరుమలకు వచ్చినభక్తులకు వేళలతో నిమిత్తం లేకుండా అన్నదానం చేసిన భక్తయోగిని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబపేరును ఈ అన్నదానభవనసముదాయానికి ఉంచి సదాచార సంస్కృతిని కొనసాగించింది. ఈ అన్నదాన సంస్కృతిని విస్తరించి తిరుచానూరు, శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో కూడా గతంలో నిత్యాన్నదానాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం 29-02-2024 నుండి తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో కూడా ప్రతిరోజూ ఉదయం 11 గం॥ నుండి సాయంత్రం 4 గం॥వరకు ఈ నిత్యాన్నదానాన్ని ప్రారంభించింది తి.తి.దే. భక్తులందరూ తి.తి.దే. కల్పించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్ష!

# ఎంత బాధ భరించి ఉంటాడో స్వామి?

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

శ్రీమహావిష్ణువు ధర్మసంస్థాపనార్థం కూర్మావతారం ధరించాడు. కూర్మం కఠినమైన డిప్ప కలిగి ఉంటుంది. పరమాత్మ అలాంటి తాబేటి రూపం పొందాడు. కేవలం దయ కారణంగా ఆ ఉపాధి వచ్చింది.

మహాభాగవతుల దర్శనమే అదృష్టహేతువు. పరమేశ్వరుణ్ణి నమ్మి బతికే వ్యక్తి మన కంటికి కనపడ్డాడు అంటే భాగ్యహేతువు, అదృష్టం. అలాంటివారు కనపడ్డప్పుడు నమస్కరించడం సంస్కారం. వారి చేతితో ప్రసాదమిచ్చినప్పుడు భగవంతుని అనుగ్రహంగా భావన చేసి స్వీకరించాలి. ఒకప్పుడు ఇంద్రుడు ఐరావతం మీద వెళుతుండగా ఎదురుగా దుర్వాస మహర్షి వచ్చాడు. ఆయన ఎక్కడనుండో భగవత్ ప్రసాదమైన పుష్పమాల తెచ్చాడు. ఈశ్వర నిర్మాల్యం. అమ్మవారి మెళ్లో వేసి తీసిన మాల. అది పట్టుకుని వస్తుంటే ఇంద్రుడు కనపడ్డాడు. ఆయన కనపడ్డాడని ఈ ప్రసాదాన్ని ఆయనకు అనుగ్రహించి ఆయన చేతిలో పెట్టాడు. ఎప్పుడూ లేనిది స్వతంత్రంగా ఒక రాక్షసుణ్ణి సంహరించి వెడుతున్నాడు. అందువల్ల నా అంతవాడిని నేను అని గర్వంతో, అతిశయంతో ఉన్నాడు ఇంద్రుడు. ఆ పుష్పమాల అందుకుని ఒకసారి కన్నులకు అద్దుకుని ఐరావతం కుంభ స్థలం మీద పడేశాడు. సుగంధం వెదజల్లుతూ చైతన్యపుష్పాలతో కూర్చబడ్డ హారం కనుక అనేకమైన తుమ్మెదలు దాన్ని ఆశ్రయించి ఉన్నాయి. అవి ఏనుగు కుంభస్థలం మీద, చెవులలోనూ ఎగురుతూ రొద చేశాయి. ఏనుగుకి చీకాకు కలిగి తొండాన్ని పైకి ఎత్తి ఆ మాలతీసి నేలకువేసి కొట్టింది. అది ముక్కలుగా తెగిపోయింది. తుమ్మెదలు రొద చేస్తున్నాయని కాళ్లతో ఆ మాలను తొక్కేసింది.

దేవేంద్రుడు ఎప్పుడైతే ఐశ్వర్యమదంతో ఇచ్చిన భగవత్ ప్రసాదాన్ని దుర్వినియోగం చేశాడో దుర్వాసమహర్షికి కోపం వచ్చింది. "ఐశ్వర్యం ఉండబట్టే కదా నీవు ఇంత అహంకారంతో ప్రవర్తించావు! నీ సమస్తభోగాలకు కారణమైన ఐశ్వర్యలక్ష్మి తొలగిపోవుగాక!" అని అన్నాడు. తపశ్శక్తి చేత మహాత్ముల నోటిమాటే బ్రహ్మాస్త్రం. దేవేంద్రుణ్ణి ఆశ్రయించి ఉన్న రాజ్యలక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి అన్నీ వెళ్లి సముద్రంలో కలసిపోయాయి. ఇంద్రుడు రాజ్యహీనుడైపోయాడు. ఇంద్రుని భోగం పోయింది. దేవేంద్రుని ఆవరించిన మదమూ తొలగిపోయింది.

దేవతలందరూ బ్రహ్మను, పరమశివుణ్ణి తీసుకుని, శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్లి ఆయనని స్తోత్రంచేసి రక్షణ కోరారు. "ఇంతకు పూర్వం నేను ఏది పొంది ఉన్నానో అది నా ప్రవర్తన చేతనే పోగొట్టుకున్నా, ఇప్పుడు మారాను కనుక మళ్లీ నన్ను అనుగ్రహించు. మీరే జోక్యం చేసుకుని కాపాడగలరు. అనుగ్రహమే రక్షణ. రక్షించవలసింది" అని ఇంద్రుడు ప్రార్థన చేశాడు. శ్రీమహావిష్ణువు విని "కాలం అని ఒకటి ఉంది. అది కలసి రానప్పుడు నేర్చుకోవాల్సింది ఒకటి ఉంది సహనం" అని చాలా గొప్ప మాట చెప్పాడు.

"సహనం అంటే కనపడితే చంపేస్తాడేమో అని కాకుండా మీకు కాలం కలసి వచ్చేవరకు రాక్షసులతో ప్రయత్న పూర్వకంగా స్నేహం చెయ్యండి. ఇవ్వాళ వినయంతో ప్రార్థన చేశారని వెంటనే అనుగ్రహించడం ఉండదు. బుద్ధి బాగా స్థిరీకరింపబడింది అన్న నిర్ణయానికి రావాలి. అందుకని రాక్షసులతో చెలిమి



చేసి తిరగండి. యుద్ధం చేస్తే రాక్షసుల చేతిలో మరణిస్తారని బెంగపెట్టుకుని ఉన్నారు. మీ బెంగ తొలగడానికి ఒక మార్గం చెపుతాను. అందరూ వెళ్లి పాలసముద్రాన్ని చిలకండి అమృతోత్పాదనం అవుతుంది. ఆ అమృతం తాగితే దేవతలకు జర అనగా వార్ధక్యంకానీ, మృత్యువుకానీ, భయంకానీ ఉండవు. మీరు రాక్షసులను గెలవగలుగుతారు. అమృతోత్పాదన యత్నం చెయ్యండి. ఓ దేవతలారా! నేను చెప్పే ఈ మాటని నమ్మి మీరందరూ అమృతోత్పాదనం చేసే ప్రయత్నమన్న పూనిక వహించడం మీకు తగిన కార్యం. అది త్రాగితే దాని వల్ల ఆయువు పెరుగుతుంటుంది.

స్వర్గలక్ష్మి అంతా వెళ్లి సముద్రంలో పడిపోయి ఉంది. ఆ లక్ష్మి పైకి రావాలంటే పాలసముద్రాన్ని చిలకాలి. అందు కోసం కవ్వంగా మందరపర్వతం పదార్థంగా ఉపయోగ పడుతుంది. దాన్ని తవ్వి పైకి ఎత్తి పట్టుకోవాలి. అందుకోసం కావాల్సిన సాధన సంపత్తులు మీదగ్గర ఉన్నవి పనికి రావు. దేవశిల్పి అయిన త్వష్టని ఆశ్రయించండి.

ఆ త్వష్ట పదునైన తవ్వుగోళ్లను సిద్ధం చేసి ఇస్తాడు. వాటితో భూమిని తవ్వి రోకళ్లు భూమిలోకి దింపి పైకి ఎత్తితే దాని మూలం కదులుతుంది. దేవతలు, రాక్షసులు తమతమ బలాలను చెప్పుకుని ఆ పర్వతం కింద పడకుండా జాగ్రత్తగా ఎత్తి పట్టుకుని, పాలసముద్రం దగ్గరకు తీసుకుని వెళ్లి సముద్రంలో దింపి చిలికితే, అందులోనుండి అమృతం ఉత్పాదనమౌతుంది. ముందు హాలాహలం వస్తుంది. జాగ్రత్తగా ఉండండి. అందులోనుండి లక్ష్మి, కామధేనువు, కల్పవృక్షం, ఇంతకు పూర్వం దుర్వాసమహర్షి శాపకారణంచేత స్వర్గంలో అంతర్ధానమైన దేవేంద్రుని సమస్తభోగాలకూ కారణమైన సాధన సంపత్తులన్నీ వచ్చి, ఇంద్రుడికి ఐశ్వర్యం కలుగుతుంది. పాల సముద్రాన్ని చిలకండి. అమృతోత్పాదనం అవుతుంది"– అని చెప్పాడు. వెంటనే వెళ్లి దేవతలు రాక్షసులతో స్నేహం చేశారు. అందరూ వెళ్లి రోకళ్లు, గునపాలు విప్పి పర్వతాన్ని చేతులతో ఊపారు. అది కదిలితే దాని కిందకి చేతులు దింపి తమ తమ బలాలు చెప్పుకుని మందరపర్వతాన్ని పైకి ఎత్తారు. జాగ్రత్తగా ఆ పర్వతాన్ని పట్టుకుని అడుగులో అడుగేసుకుంటూ సముద్రం దగ్గరకు తీసుకుని వస్తున్నారు. ఎంత జాగ్రత్తగా తెస్తున్నా చాలా పెద్దదైన పర్వతం ఒక పక్కకు ఒరిగితే ఆపలేక పోయారు.

**మే 23**
**కూర్మ జయంతి**
**సందర్భంగా...**

పర్వతం పడిపోవటంలో దేవదానవులు కొన్ని కోట్ల మంది దాని కిందపడి శరీరాలను వదలి పెట్టేశారు. అప్పుడు వారు "మనం బుద్ధిహీనులమై విష్ణువు మాటవిని మందర పర్వతం తవ్వమంటే తవ్వడమేమిటి?" అన్నారు. ఇది కృతఘ్నత. ఈ విషయంలో నిలబడగలరా? అని ఈశ్వరుడు చూస్తాడు. మందర పర్వతాన్ని తీసుకెళ్లి సముద్రంలో దింపేసి ఉంటే విష్ణువు చెప్పిన మాట మంచిది. ఆ పర్వతాన్ని మేము ఎత్తగలమా అని ఒక మాట అని ఉంటే ఆయన ఏమి చెప్పేవాడో! పర్వతాన్ని ఎత్తండి అంటే ఎత్తేం అని వెళ్లిపోయారు. ఆ తప్పు ఆయనదా? వీళ్లదా? పర్వతం పడిపోయి అంతమంది దానికింద పడి చచ్చిపోయిన తర్వాత తమ బలాలను స్మరించి, ఇంత పెద్ద మందరపర్వతాన్ని ఎత్తి సముద్రంలో ఎలా దింపి చిలుకుతాం? ఆయన చెపితే మాత్రం మనకు బుర్ర ఉండవద్దా? అని ఏడుపు మొదలు పెట్టారు. తన మాట మీద ప్రయత్నం మొదలుపెట్టారు. అది వమ్మయిపోతోందని ఆధారం లేక ఏడుస్తున్నారు. కాబట్టి నింద వేసినా స్వామి వచ్చాడు. అది ఆయన దయ. వాళ్లు నన్ను తిడుతుంటే నేను ఎందుకు వెళ్లాలి అని అనుకోకుండా నా మాట నమ్మి పర్వతం ఎత్తారు కనక వెళతాను అనుకుని, ఆయన గరుత్మంతుని అధిరోహించి వచ్చాడు. ఈ పర్వతమేనా పడి పోయింది అని ఏడుస్తున్నారని అడిగి ఆయన దాన్ని ఒక హేలగా పైకి ఎత్తి, బొంగరాన్ని తిప్పినట్లుగా చేత్తో తిప్పి, ఎత్తి పట్టుకుని గరుత్మంతుని మూపున పెట్టి, "ఓ గరుత్మంతా! దీన్ని తీసుకుని వెళ్లి కవ్వంగా క్షీరసాగరంలో దింప"మని చెప్పాడు. "నేను చెపితే మీరు చేసే పని కాదు. నేనూ మీదగ్గర ఉంటాను. మనమందరం క్షీరసాగరమథనం చేద్దాం" అని శ్రీమహావిష్ణువు దేవతలందరికీ అధ్యక్షత వహించాడు.


క్షీరసాగరమథనం చెయ్యడానికి మందరపర్వతాన్ని పాల సముద్రంలో దింపినప్పుడు, పట్టుకుని తిప్పడానికి ఒక తాడు కావాలి. లౌకికమైన తాడు పనికి రాదు. మీ దగ్గర ఉన్న తవుగోలలు పట్టుకుని పర్వతం చుట్టూ గాడి చెక్కండి.

అమృతంలో వాటా ఇస్తామని చాలా గొప్ప సర్పమైన వాసుకిని పిలిచి పర్వతానికి చుట్టి పట్టుకుని, మనం క్షీరసాగరమథనం చేద్దాం” అని చెప్పారు. రాక్షసులు, దేవతలు తవుగోలలతో పర్వతం చుట్టూ చెక్కారు. ఆ గాడిలోకి ఒరుసుకోకుండా వాసుకి సర్పాన్ని చుట్టవచ్చు. శ్రీమహావిష్ణువు ఆజ్ఞప్రకారం, వాసుకి వచ్చాడు. వాసుకిని చుట్టి తలవైపు దేవతలు, తోకవైపు రాక్షసులు పట్టుకున్నారు. చిలకడం మొదలుపెట్టాలి. మధ్యలో ఎవరో ఒకరు ఉంటారు. అహంకారం అంత తొందరగా పోదు. చిలకడం కొరకు దింపుతుండగా, “తలవైపు దేవతలు పట్టుకోవడం ఏమిటి, తోక మేము పట్టుకోవడం ఏమిటి? తోక అంటే కింద భాగం కదా. మా మర్యాద ఏమైపోయినట్లు? మేము తల భాగమే పట్టుకుంటాం” అన్నారు. అహంకారం చేత అసలు కార్యం మొదలు పెట్టింది. లేదు, అల్లరి ప్రారంభం! మనిషి దాన్ని గెలవగలిగితే ప్రశాంతంగా ఉంటాడు. అది గెలవ లేకపోతే ఎక్కడకు వెళ్లినా ప్రశాంతత ఉండదు.

శ్రీమహావిష్ణువు “దాందేముంది? ఎక్కడ పట్టుకున్నా త్రిప్పడం ప్రధానం పట్టుకోండి” అన్నారు. పాముతల వైపు పట్టుకుంటే ప్రమాదం. దానికి బాధ కలిగితే విషం చిమ్ముతుంది. వాళ్లు కావాలని తల పట్టుకున్నారు. మందరపర్వతాన్ని పాలసముద్రంలో దింపి పూర్తిగా దిగకుండా తేల్చి పట్టుకుని, తిప్పుతున్నారు. పర్వతం వాసుకి శరీరంమీద ఆధారపడి ఉంది. తిప్పేముందు కొన్ని ఓషధులు, లతలు తెచ్చి పాలసముద్రంలో వేశారు. బరువుకీ, ఒరిపిడికీ తట్టుకోలేక, వాసుకి వదలండి అని పెద్దపెద్ద కేకలు వేశాడు. తిప్పుతుంటే ఆయన బాధకి గిలగిలా కొట్టుకోవడంలో పట్టు తప్పి మందరపర్వతం పాలసముద్రంలో ఒరిగిపోయింది. వాసుకి చేతిలో ఉన్నాడు. అప్పుడు అందరూ ఆలోచించారు. “మనం చేసిన పని చాలా బుద్ధి పొరపాటు. విష్ణువు చెప్పినవన్నీ చేసేస్తుంటాం. కవ్వం నిలబడాలి. అంటే కింద ఏదో ఉండాలి కదా! పాలసముద్రంలో పర్వతాన్ని పట్టుకుని ఏ ఆధారం లేకుండా ఎలా తిప్పగలం? అటూ ఇటూ గట్టిగా పట్టుకుంటే పర్వతం నించుంటుంది. అలా నించుంటే అమృతం ఎలా వస్తుంది? చిలకాలి. చిలకడానికి దగ్గరకు వదులుతుండాలి, దూరం వదులుతుండాలి. అలా చెయ్యడంలో జారిపోతుంది. ఆధారం లేకుండా చిలకడానికి సిద్ధపడటం ఏమిటి?” అన్నారు. ఆధారం ఏది అని విమర్శించే వారే కానీ, పరిష్కారం చెప్పేవారు లేరు.

మందరపర్వతాన్ని నిలబడడానికి కింద ఆధారమేది? ఆధారం ఎక్కడ నుండి వస్తుంది అన్నారు. ఎన్ని అన్నా తన మాట నమ్మి దేవతల మనసు మారి, పశ్చాత్తాపంతో సిద్ధపడ్డారు కాబట్టి వాళ్లని రక్షించడానికి దయాగుణంగల ఆయన ఎంత కిందకి అయినా వచ్చేస్తాడు. ఎన్ని తప్పులు చేసినా క్షమిస్తున్నాడు. “ఇకపైన తప్పులు చెయ్యను. చేసినవి ఏమో చేశాను ఈశ్వరా! నన్ను మన్నించు” అని త్రికరణశుద్ధిగా అనగలిగితే, పరిగెత్తుకు రావడానికి ఆయన ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాడు.

దేవతల పశ్చాత్తాపం గమనించి, దేవతల వినయం గ్రహించాడు కనుక తల అయితే ఏమి, తోక అయితే ఏమి? అన్నాడు. ఆయన చెప్పినట్లు చేద్దాం, ఆ పైన ప్రమాదం వస్తే ఆయనే ఉన్నాడు. మనం ఆయనకు సలహా



## 2024, జూన్ నెల
## ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | శ్రీహనుమజ్జయంతి |
| 17-21 | తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి తెప్పోత్సవం |
| 19-21 | తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం |
| 17-25 | అప్పలాయగుంట, శ్రీప్రసన్నవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవం |
| 21 | ఏరువాకపూర్ణిమ |
| 27-29 | తిరుచానూరు, శ్రీసుందరరాజస్వామివారి అవతారోత్సవాలు |

చెప్పేవాళ్లమా? అన్నారు. రాక్షసులు అలా విమర్శించలేదు. ఆయనపై విశ్వాసం లేనివారు తర్వాతి కాలంలో భోగాలను పోగొట్టుకుంటారు. అమృతం రాక్షసులకు దక్కలేదు. భగవంతుని యందు విధేయతతో, భక్తితో ఉన్నవారిని తానే కాపాడి అమృతాన్ని అందిస్తాడు.

సుందరుడైన శ్రీమహావిష్ణువు దేవతలను రక్షించడం కోసం అత్యంతప్రేమ, దయ కలిగినవాడై, లక్షయోజనాలు కలిగిన పెద్దతాబేలుగా మారిపోయాడు. దాని మీద డిప్ప చాలా కఠినంగా ఉంది. దాన్ని బద్దలుకొట్టడం ఎవరికీ సాధ్యం కాదు. బ్రహ్మాండమంతటినీ పట్టి మింగేస్తుందేమో అన్నంత పెద్దనోరు తెరుస్తూ ప్రపంచంలోని సమస్తజంతురాశినంతటినీ మింగి లోపల పెట్టుకోగలిగిన పెద్ద కడుపుతోటి ఈ ప్రపంచం మీద ఇంకో ప్రపంచం వచ్చి పడినా మెల్లిగా కదిలే కాళ్లు. మెల్లగా నడవడానికి పేరు పొందిన ప్రాణులలో తాబేలు ఒకటి. తామరపువ్వులవంటి కన్నులతో సుందరమైన విష్ణువు పెద్ద కూర్మమై సముద్రంలో పడుకుని నా మీద మందరపర్వతం

### శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి తెప్పోత్సవం
### దేవునికడప

| | | |
|---|---|---|
| 21-05-2024 | మంగళవారం | శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారికి |
| 22-05-2024 | బుధవారం | |
| 23-05-2024 | గురువారం | |

ఉంచండి అన్నాడు. ఆయన వీపు మీద పర్వతం పెట్టి తిప్పు తున్నప్పుడు ఆయనకు ఉన్న డిప్ప ఎంత ఒరుసుకుని పోయి ఉంటుంది! ఎంత ఖేదాన్ని పొంది ఉంటాడు. క్షీరసాగర మథనంలో శ్రీమహావిష్ణువు పొందినంత ఖేదం, ఏ ఇతర అవతారాలలో ఆయన పొందలేదు. మనసుకి దిగులు కలిగించే రెండు విషయాలు కూర్మావతారంలో జరిగాయి. అయినా ఆయన దయకు ప్రతీక. తాబేటి రూపం విడిచి పెట్టిన తరవాత, క్షీరసాగరమథనం జరిగినప్పుడు ఏ రూపంలో పడుకున్నారో, మందరపర్వతాన్ని ఆయన డిప్పమీద పెట్టి తిప్పుతున్నప్పుడు, ఆయన తోక, ముఖం కదుపుతుంటే చిన్నది కాదు కనుక సముద్రంలో ఉండే ఎన్నో ప్రాణులు చనిపోయాయి.

శ్రీమహావిష్ణువు అన్ని ప్రాణులు చనిపోవటానికి తాను తాబేటిరూపంలో మందరపర్వతాన్ని వహించడమే కారణమని, నేను చేసిన పాపమెలా పోతుందని పరమశివుణ్ణి ప్రార్థన చేసి అడిగాడు. శివుడు ప్రత్యక్షమై బెంగ పెట్టుకోవద్దు. కాంచీ పురంలో నేను పరమశివస్వరూపంగా వెలసి ఉన్నాను. అక్కడకు వచ్చి నన్ను ఆరాధన చేసి పూజిస్తే, నువ్వు తాబేలుగా పడుకుని మందరపర్వతం తిప్పినప్పుడు ప్రాణి సమూహానికి కలిగిన ఇబ్బంది వల్ల నీకు కలిగిన పాపం నుండి ఉపశమనం కలుగు తుంది అని చెప్పాడు. కచ్ఛపేశ్వర దేవాలయం ఇప్పటికీ ఉంది. ఆ ఆలయంలోకి వెళ్లి చూస్తే లోపల పెద్ద రాగిరేకుమీద తాబేలు పూజ చేస్తున్నట్లుగా శివలింగం ఉంటుంది. శ్రీమహావిష్ణువు ఆ రూపంలోనే వచ్చి అక్కడ శివలింగార్చన చేశాడు.

ఇంట్లో తప్పకుండా కూర్మాన్ని ఉంచుతారు. కూర్మాసనం వేసుకుని కూర్చుంటారు. అలా కూర్చుంటే ప్రత్యేకమైన లక్షణం ఏర్పడుతుంది. పెద్ద దేవాలయాలలో నీటి సరస్సు ఏర్పాటు చేసి తాబేళ్లని ఉంచుతారు. తాబేటి దర్శనం చాలా గొప్పది. ఎక్కడైనా కనపడితే నమస్కరిస్తారు. కూర్మయంత్రం అని ఒక ప్రత్యేకమైన యంత్రం వేస్తారు. కూర్మాసనం వేసుకుంటారు. ఎందుకు అనగా ఆ ఆదికూర్మం మీద కూర్చోకూడదు కనుక కూర్మాసనం పీట మీద చెక్కించి కూర్చుని ధ్యానం చేస్తే, దాని వల్ల మనసు ఏకాగ్రతని పొంది పరమేశ్వరుని చేరడానికి కావలసిన స్థిరీకరణ శక్తిని పొందుతాడు. ఇన్ని లక్షణాలను ప్రకటింపచేసిన మహో త్కృష్టమైన అవతారం కూర్మావతారం.


మోసము విడుచుటే మోక్షం

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక విశేషార్థం..

దశరథుని దైన్యాన్ని గుర్తించిన విష్ణువు "దశరథా! జన్మాంతరంలో చేసిన పాపం కారణంగా నీకు ఈ జన్మలో ఇంత వరకు సంతానం లేకపోయింది" అని చెప్పగానే ఆ రాజేంద్రుడు- "స్వామీ! నేను జన్మంతరాలలో ఏవో పాపాలు చేసి ఉండ వచ్చు. అయినా సూర్యు డుదయించగానే చీకటి మటుమాయమైనట్లు మిమ్మల్ని దర్శించగానే అన్నీ పటాపంచలయ్యాయి. నాకు పాపమన్నది అసలులేదు. అయినా గతాన్ని పక్కన పెట్టి నా తప్పుల్ని క్షమిం చండి. నాకు పుత్రసంతానం ప్రసాదించి నా జన్మ చరితార్థమయ్యేలా అనుగ్రహిం చండి" అన్నాడు.

అప్పుడా హరి- "దశరథేశ్వర! నీకా తాపత్రయమెందుకు? నీ పాపాలను హరించాను. నీకు సంతానం తథ్యం. నీకు జనించే పుత్రులు సామాన్యులు కారు. వారందరు నా సమానులు. బాహుబలా ఢ్యులు. నలుగురిని ప్రసాదిస్తున్నాను. నీవు వెంటనే అయోధ్యకు మరలి 'పుత్రకామేష్టి యాగం' సంకల్పించు. ఈ వేళ స్తుతికి సంతుష్టుడనయ్యాను" అన్నాడు.

స్వామి ఆదేశించినట్లుగా దశరథుడు అయోధ్యకు మరలినాడు. పుత్రకామేష్టికి సన్నాహాలు మొదలుపెట్టాడు.

దశరథాదులు వెళ్ళిపోయాక శ్రీని వాసుడు బ్రహ్మతో "చతుర్ముఖా! సత్యలోక వాసం వదలిపెట్టి ఇక్కడే ఉండడం సబబు కాదు. నేను మరికొంతకాలం ఈ కొండ లోనే ఉండదలచుకున్నాను. నీవు వెళ్లిరా!" అని ఆదేశించాడు.

స్వామి ఆదేశించినా బ్రహ్మ కదల లేదు. మాట్లాడలేదు. తలమాత్రం వంచాడు. ఇవన్నీ చూచిన హరి-

"కమలజా! నీవు మనసులో ఏమను కుంటున్నావో స్పష్టంగా చెప్పు. నీకోరికను మన్నిస్తాను. తల పైకెత్తి నిర్భయంగా అడగ"మన్నాడు.

బ్రహ్మ తమాయించుకుని "స్వామీ! మీరు ఈ శైలాగ్రంలో నిలిచినట్లే కల కాలం కల్పాంతపర్యంతం నిలవాలని నా విన్నపం. మీరు ఈ శైలాగ్రంలో లేకపోతే మానవులు సత్యశౌచదూరులౌతారు. అన్ని విధాల భ్రష్టులౌతారు. నరకాలలో పడరాని బాధలు పడతారు. జననమరణా దులతో పతనావస్థకు చేరుకుంటారు. ఇలాంటి వారిని కడతేర్చేవారెవరూ లేరు మీరు తప్ప.

స్వామీ! కలియుగ ప్రభావం మీకు తెలియంది కాదు. కలియుగంలోని వారు అల్పాయుష్కులు, అలసులు, దురా గ్రహులు, గర్విష్టులు, లోభులు, కాము కులు, వంచకులు, క్రోధులు, జడమతులు, కుత్సితులు, పరధనాసక్తులు. పరసతీ రతులు, నిర్భాగ్యులు, పాపులు, సాధు దూషితులు. మాత్సర్యపూర్ణులు, జారులు, చోరులు, చేయరానిపాపాలు చేస్తూ పాప కర్మల కారణంగా నానారకాలైన కష్టాలు అనుభవిస్తారు. అంచేత తమరు ఈ వేంకటగిరిలోనే కల్పాంతం దాకా ఉండి అలాంటి వారిని రక్షించాలని నా మనవి" అన్నాడు.

బ్రహ్మ విన్నపం ఆలకించిన స్వామి "కుమార! నేను దేనినైతే తలచుకుంటు న్నానో ఆ అంశాలనే నీవూ స్పష్టం చేశావు. నీవు భూతదయకలవాడివని తెలుసుకో గలిగాను. నీ కోరిక మేరకు శేషాద్రిపైనే నివసిస్తాను.

పద్మజా! వైకుంఠంలో ఉండే పుష్క రిణి శేషాద్రి మీద స్వామి పుష్కరిణిగా ఉండగా ప్రజలకు పాపాలు ఎలా అంటు తాయి? ఆ పుష్కరిణి గంగానది తీర్థాలకు నెలవు. ఎవరైతే పుష్కరిణిలో భక్తితో స్నానమాచరిస్తారో వారి సకలపాపాలు,

రోగాలు సమసిపోతాయి. వారే కోరికలు కోరుతారో అవన్నీ నేను ప్రసాదిస్తాను" అన్నాడు.

అపుడు బ్రహ్మ సవినయంగా "స్వామీ! అన్నీ నిజమే కానీ రాక్షసులు భూలోకంలోని వనదుర్గాలన్నిటిని ఆక్రమించుకుని మానవులను సదా బాధిస్తున్నారు. మానవుల వ్యథను తీర్చడం కర్తవ్యం కదా" అన్నాడు.

హరి బ్రహ్మదేవుని విన్నపం ఆలించి తన పంచాయుధాలలో ఒకటైన చక్రాయుధాన్ని చూచి– "సుదర్శనా! నీవు కుముదాదులతో తక్షణం కదలు. పరివారబలంతో శస్త్రాస్త్రాలతో ముందుకు నడు, రాక్షసులను నిర్మూలించు" అని ఆదేశించాడు. చక్రరాజు వెను వెంటనే కదిలాడు. సకల దుర్గాలలోని చోరులను, రాక్షసులను సంహరించాడు. భూలోకాన్ని నిష్కంటకం చేసి మరలస్వామి దగ్గరికి వెళ్లి–

"స్వామీ! మీ ఆనతో రాక్షసుడి బలాన్ని సంహరించాను." అని సాగిలపడ్డాడు. స్వామి సంతోషం వ్యక్తం చేశాడు. ఆపై చక్రరాజు యథాతథంగా స్వామి ఆయుధరూపధారి అయ్యాడు.

తదనంతరం హరి బ్రహ్మను చూచి "నీవు చెప్పినట్లు శత్రుసంహారమైంది. లోక కంటకులు మరణించారు. నీ కోరిక తీరింది కదా? నీవు చింతారహితుడవై సత్యలోకానికి వెళ్ల మన్నాడు. బ్రహ్మ ఏమి మాట్లాడక తచ్చాడుతుంటే స్వామి బ్రహ్మతో "చతుర్ముఖా! నేను పొమ్మన్నా వెళ్లకున్నావేమిటి? ఇంకా ఏవైనా కోరిక లున్నాయా! జంకుగొంకులు లేక అడుగు అన్నాడు.

బ్రహ్మ నిబాళించుకుని– "నా విన్నపం ఆలకించండి. వేంకటగిరి మీద విఖ్యాతులైన మీకు రథోత్సవం చేయాలని కోరిక. దయతో, సమ్మతితో అనుజ్ఞ తెలపండి" అనగానే హరి సిరితో చర్చించి సరేనన్నాడు.

హరి సమ్మతించడంతో మునులు, సురలు, రథోత్సవ సన్నాహంలో మునిగిపోయారు. బ్రహ్మ విశ్వకర్మను రమ్మని ఆదేశించి "విశ్వకర్మా! వివిధ చిత్రపురాన్ని ఈ కొండమీద నిర్మించు" అన్నాడు. విశ్వకర్మ అలాగే అద్భుత చిత్రవిచిత్ర రీతుల నగరాన్ని నిర్మించాడు. అలాగే మేరుపర్వతంలాంటి రథాన్ని తీర్చాడు.

*(ఇంకా ఉంది)*



## శ్రీకృష్ణామృతం..

వైరమాయే కన్నయ్య నీదు మురళితో నాకూ
విడ్డూరమే దాని విరుపు కరమునుంటి తాననీ
వేకువఝాము మొదలు నిశీథి రేయివరకు
వాసుదేవు చెంత నుండు భాగ్యమొందినానని
ఏ పాటి దానవనీ (నన్ను) వెక్కిరించెనే...
వెక్కిరించెనే నన్ను వేధింపుగ చూసెనే

జగడమాయే కన్నయ్యా ముత్యాలసరులతోడ
అతిశయమే వాటి మెఱపు(నీ) భూషణమ్ములనీ
కురులజటలు మొదలుకునీ కంటిపేరు వరుసలలో
ఆపాదమస్తకమూ నిన్నుచుట్టినామనీ
నీవెక్కడ మేమెక్కడయనీ మేలమాడెనే....
మేలమాడెనే నా మెడలువంచ చూసెనే

తగవులాయే కన్నయ్య నీ కాలి అందెలతో
నీ పదములు పట్టి నిలిచి దెప్పిపొడిచేనే
ముక్కోటిదేవతలు ఒక్కసారి తాక కోరు
శ్రీచరణసన్నిధే (తన) సొంతమాయే ననీ
పరమపదమె (నా) నెలవుయనీ టెక్కు చూపెనే...
చేరగలవా నీవుయనీ ప్రశ్న వేసేనే

ఏలనయ్య కన్నయ్య వీటి తోని ఇచ్చకములు
తెలుపవయ్య కన్నయ్య(నీ) కృపకు నోచినాననీ
మెలకువనూ, నిద్దురనూ నిన్ను తలచు నా మనసు
కావవయ్య కరుణతోడనాదు కోర్కె తీర్చవే
నలుదిక్కుల కడుశోభగ నీ పాట పాడగా
అనంతను కడుప్రీతితో ఆదరించవే
హరిగానమే చేయగాను శక్తి నీయవే....
హరి కీర్తనే ఆలపింతు చిత్తగించవే

బ్రోవవయ్య కన్నయ్య నీ కృపను కోరితీ
కావవయ్య కన్నయ్య కోరు వరము నీయవే

–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు,
99103 10594

# సందేహాలు



# సమాధానాలు

**-బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ**

**ప్ర) ఆదిశంకరులు అద్వైతమతస్థులు కదా! మరి ఆయన శైవమత చిహ్నాలైన విభూతి ధరించారు. ఎందుకు?**

**జ)** అద్వైతానికి శివకేశవుల మధ్య భేదం ఉండదు. భస్మధారణం సనాతన వైదిక సంప్రదాయం. సనాతన వేదమతంలో శివకేశవభేదాలు లేవు. మనది యజ్ఞ సంస్కృతి. నిత్యం అగ్నిహోత్రారాధన, యజ్ఞం, సమస్తదేవతలనూ అగ్నిద్వారా ఉపాసించడం వేదపద్ధతి. ఆ విధంగా అగ్ని ఆరాధనాదులు చేశాక, మిగిలేది- భస్మం. దాన్ని యజ్ఞప్రసాదంగా నిత్యం ధరిస్తారు. త్రిపుండ్రాలు (భస్మంతో ధరించే) త్రేతాగ్నులకు (గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులు), ఓంకారంలోని మూడువర్ణాలకు, త్రిమూర్తులకు, త్రిశక్తులకు సంకేతం. వేదంలో భస్మధారణ మంత్రాలున్నాయి. 'అగ్నిరితిభస్మ జలమితి భస్మ'-మొదలైన మంత్రాలు చెప్పబడ్డాయి.

**జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం**
**తమాహుః పండితం బుధాః**

- అని 'గీత'లో శ్రీకృష్ణపరమాత్మ వచనం, జ్ఞానాగ్నిలో కర్మసంచయం దగ్ధమవడం- అనే సంకేతమే భస్మధారణలో ఉంది. 'అగ్నిసారం భస్మం' అని శాస్త్రోక్తి. శివుడు మహాగ్ని, పరంజ్యోతి, సాకారంగా జ్ఞానమూర్తి. ఆ జ్ఞాన, యోగలక్షణాలను తెలియజేసేది భస్మధారణ. అందుకే శివుడు భస్మాన్ని ధరిస్తాడు. భస్మానికి 'విభూతి' అని కూడా పేరుంది. విభూతి- అంటే ఐశ్వర్యం. అగ్ని కూడా ఐశ్వర్యకారకుడు. అందుకే అగ్నిసారమైన భస్మం వర్చస్సునీ, ఐశ్వర్యాన్నీ ప్రసాదిస్తుంది.

విభూతిలో మంత్రశక్తిని నిక్షిప్తం చేయవచ్చు. అందుకే విభూతి ద్వారా రక్షణని కల్పిస్తారు. దుష్టశక్తుల దృష్టిపడకుండా విభూతి రక్షిస్తుంది. ఇది హిందూమత చిహ్నం. విభూతితోపాటు చందనం, కుంకుమ ధరించడం మన సంప్రదాయం. మన శరీరంలోని యోగకేంద్రాలలో లలాటం(నుదురు), భ్రూమధ్యం (కనుబొమల నడుమ) చాలా ప్రధానమైనవి. దేవతాశక్తులను ధ్యానించడానికి, కేంద్రీకరణకి ప్రధానకేంద్రాలవి. అందుకే వాటికి భస్మధారణ. అగ్నిసారమైన భస్మం వల్ల శరీరం శుద్ధమౌతుంది. ఇది ఏదో ఒక శాఖకి చెందింది కాదు. మన భారతీయ సనాతనధర్మం.

**ప్ర) నిర్గుణ నిరాకారుడైన పరమాత్మ గురించి బోధించిన అద్వైత మతస్థాపకులు శ్రీఆదిశంకరాచార్యులు 'శ్రీమత్ పయోనిధినికేతన చక్రపాణే' అంటూ సాకారలక్ష్మీనృసింహస్వామిని స్తుతించడంలో గల రహస్యం ఏమిటి?**

**జ)** పరమాత్మ నిర్గుణ నిరాకారుడైనప్పటికీ భక్తానుగ్రహార్థం సగుణసాకారుడు అవుతాడు. అందుకే ఆయన వివిధరూపాలు ధరించాడు. ఆ రూపాలన్నీ ఉపాసించాల్సినవేనని ఆదిశంకరుల బోధ. ఆ సాకారాలన్నీ నిరాకార నిర్గుణ పరమాత్మకు భిన్నం కావు. పంచదారతో అనేకబొమ్మలు చేసినా వాటినిండా ఉన్నది పంచదారే. పరమాత్మ సగుణసాకార రూపాలన్నీ నిర్గుణతత్త్వాన్ని తెలియజేసేవే. వాటిద్వారా లభించేది అద్వైతమే. అనేక గ్రంథాలలో ఆచార్యులు సగుణనిర్గుణాలకు ఐక్యతను ప్రతిపాదించారు. అందువల్ల శ్రీలక్ష్మీనృసింహస్వామిని స్తుతించడంలో తన హృదయానికి విరుద్ధం ఏమీలేదు. నిర్గుణతత్త్వంతో సకలసుగుణాలనీ సమన్వయించిన వేదస్వరూపులు శంకరులు.

**ప్ర) శ్రీఆదిశంకరుల విరచిత 'సౌందర్యలహరి'లో శక్తిలేనిచో శివుడు ఒక్క అడుగు కూడా వెయ్యలేడనే అర్థంతో శ్లోకముంది. మరి శక్తి శివుడు అంటే ద్వైతభావం వచ్చేటట్లుంది కదా! దీనికి అద్వైత సమన్వయం ఎలా?**

**జ)** అది రెండు కాదు, రెండుగా కనబడుతోంది ద్వైతదృష్టికి. అందుకే 'ఏకం' అనకుండా 'అద్వైతం' (రెండుకాదు) అన్నారు. పరబ్రహ్మయొక్క స్పందనమే శక్తి. అగ్ని దాని వేడిమి, సూర్యుడూ, అతడి కాంతి, నీరూ, చలువదనమూ వేరు కానట్లే అవి వేరు కావు. రెండు కావు. దీపజ్యోతినుండి అంతా ప్రసరించే వెలుగే మనకు ముందు కనబడుతుంది. ఆ తరువాత జ్యోతి, వెలుగు ద్వారానే జ్యోతిని పోల్చుకుంటున్నాం. శక్తి ద్వారానే శివుడు వ్యక్త మౌతున్నాడు. ఇదే రెండుగా కనబడే ఒక తత్త్వం. ఇదే శివశక్తుల సమన్వయం.

# కోరిన కోర్కెలు తీర్చే.. స్వామి!

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

కాలసాగరంలో ఎడతెరపిలేకుండా సంస్కృతీ తరంగాలు లేస్తూనే ఉంటాయి. ఎన్నో సంస్కృతులు తక్కినవాటి ధాటికి ఆగలేక కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ ఎన్ని తరంగాలు తాకినా చెక్కుచెదరకుండా శాశ్వతంగా నిలచింది మన సనాతన సంస్కృతి. అలాంటి సనాతన భారతీయ సంస్కృతి భావనా బావుటాలే మన దేవాలయాలు! సత్యానికి దారి చూపే వెలుగు కంబాలు మన గుళ్లు! దీనికొక ఉదాహరణ– వై.ఎస్.ఆర్. కడప జిల్లా, జమ్మలమడుగు సమీపంలో వెలసి ఉన్న శ్రీభూసమేత శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయం.

రాయలసీమలో వైయస్సార్ కడపజిల్లాకొక ప్రత్యేకత ఉంది. ఈ జిల్లా రాయలసీమ మధ్యలో ఉండడం, ఇక్కడి ప్రజలకు ఇరుగుపొరుగుభాషల సంసర్గం లేకపోవడం, ప్రజలందరూ నిసర్గమైన నుడికారపు తెలుగుభాషలోనే మాట్లాడటం, ఇక్కడే మొట్టమొదటి తెలుగుశాసనం వెలువడడం, ఆంధ్ర కవితా పితామహుడు, పదకవితా పితామహుడు ఇద్దరూ ఇక్కడివారే కావడం వంటి విశేషాలతోపాటు ఆధ్యాత్మికంగా కూడా వై.యస్.ఆర్. కడపజిల్లా ప్రత్యేకతను సంతరించుకుంది.

ఈ ప్రాంతంలో నదీతీరంలో వెలసిన క్షేత్రాలు అనేకం. వాటిలో పెన్నానదితీరంలో వెలసిన శ్రీనారాపుర వేంకటేశ్వర స్వామివారి కోవెల ప్రసిద్ధమైంది.

**ఈ నెల 21వ తేదీన శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం....**

## ఆలయ చరిత్ర

జమ్మలమడుగు, కడప నగరానికి సుమారు 75 కి.మీ దూరంలో ఉంది. పూర్వం ఈ ప్రాంతంలోని నీటిమడుగులో జంబుగడ్డి ఎక్కువగా పెరుగుతూ ఉండడంవల్ల ఈ పట్టణానికి 'జంబులమడుగు' అనే పేరువచ్చి అది కాలక్రమంలో 'జమ్మలమడుగు'గా మారింది.

జమ్మలమడుగులో శ్రీవేంకటేశ్వరస్వామి కొలువుదీరడానికి, ఆ స్వామికి శ్రీనారాపుర వేంకటేశ్వరుడు అని పేరు రావడానికి సంబంధించిన స్థల పురాణ ఐతిహ్యం, ఆలయచరిత్ర కూడా చాలా ఆసక్తిదాయకంగా ఉంటాయి.

చారిత్రకంగా పరిశీలిస్తే– విజయనగర సామ్రాజ్యం కంటే ముందే ఈ ఆలయం నిర్మించినట్లు తెలుస్తోంది.

విజయనగరసామ్రాజ్యాన్ని పాలించిన సంగమ వంశీయుల్లో ప్రౌఢదేవరాయలు ఒకరు. ఆయన కుమారుడు విజయదేవరాయలు విజయనగరసామ్రాజ్యంలోని ఉదయగిరి ప్రాంతాన్ని పాలించాడు. ఆ కాలంలో జమ్మలమడుగు ప్రాంతం ఉదయగిరి పాలకుల ఆధీనంలో ఉండేది.

విజయదేవరాయల భార్య నారాయణమ్మ, ఈ ప్రాంతంలో ఒక గ్రామం, ఆలయం నిర్మించాలని అనుకుంది. అలా ఆమె తన పేరుమీద గ్రామం నిర్మింపజేసింది. ఆమె పేరుమీదే ఆ ఊరు నారాయణపురం అని పిలువబడింది. ఆ గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించింది. అది నారాయణపురం శ్రీవేంకటేశ్వరస్వామిఆలయం అయింది. క్రమంగా జనబాహుళ్యంలో అక్కడ వెలసిన స్వామి శ్రీనారాపురం వేంకటేశ్వరస్వామి అయ్యాడు.

ఆ రాజకుటుంబం అక్కడ పన్నెండు బ్రాహ్మణ కుటుంబాలతో అగ్రహారాన్ని ఏర్పాటు చేసింది. ఆ అగ్రహారాన్ని నారాయణపురం అగ్రహారంగా పిలిచేవారు. ఆ అగ్రహారీకులు నిత్యం శ్రీవేంకటేశ్వరస్వామిని, సేవిస్తూ దైవభక్తి పరాయణులై జీవనం సాగిస్తూ ఉండేవారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో కాలం గడిపేవారు. అయితే విధి వక్రించి, కాలక్రమంలో ఈ అగ్రహారం కాలగర్భంలో కలిసిపోయింది. కాలాంతరంలో ఈ ఆలయం కూడా పెన్నానది ఇసుకతాకిడికి లోనైనా, అప్పుడప్పుడు ఉద్ధరింపబడింది. మళ్లీ మళ్లీ జమ్మలమడుగు గ్రామస్థులు ఉత్సవాలు నిర్వహించేవారు.



హరిదాసులతోడ అల్లులు సరి ఎనరాదు

మహమ్మదీయులు గండికోటను ఆక్రమించుకున్నాక ఈ ప్రాంతం గోల్కొండ మహమ్మదీయుల వశమైంది. గోల్కొండ తానీషా దగ్గర అప్పట్లో అక్కన్న, మాదన్నలు మంత్రులుగా ఉండేవారు. వారి పర్యవేక్షణలో పొదిలి లింగప్ప దక్షిణదేశ వ్యవహారాలు చూస్తూ ఉండేవాడు. కంచనపల్లె రంగోరఘునాథ పంతులు జంబులమడుగు పరగణా వ్యవహారం చూస్తూ ఉండేవాడు. ఈయన 1682 సం॥లో శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయించి, రథం నిర్మించి ఉత్సవాలు జరిపించాడు.

ఆ తర్వాతికాలంలో జంబులమడుగు గ్రామ పరిపాలనను పర్యవేక్షిస్తున్న ఆకునూరు నరసన్న పంతులు 1709 ప్రాంతంలో శ్రీనారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయప్రాకారాన్ని నిర్మించాడు. తిరుపతి నుంచి లోహవిగ్రహాలు తయారు చేయించి రథోత్సవంతో ఇతర ఉత్సవాలు జరిపించాడు. ఈ ప్రాంతంలో మహమ్మదీయుల పాలన కొనసాగుతున్నా స్థానికులు చేపట్టిన హిందూధార్మికకార్యక్రమాలకు ఆనాటి ప్రభువులు అడ్డు చెప్పలేదు.

అయితే ఆనాటి ఆ అగ్రహారం తరచూ పినాకినీనది సృష్టించే వరద భీభత్సానికి బలయ్యేది. వీచేగాలులతోనూ, ఇసుక చేసే దాడులతోనూ నారాయణపురం ప్రజలు విసిగిపోయి, ఆ అగ్రహారాన్ని వదిలేశారు. దీంతో శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుల ఆలనాపాలనలకు దూరమయ్యారు.

నారాయణపురం వదిలిపెట్టి జమ్మలమడుగులో నివాసం ఏర్పాటుచేసుకున్న అగ్రహారీకుడు నారాపురయ్య దైవభక్తిపరాయణుడు, ధార్మికసంపన్నుడు. నిరంతరం పారమార్థిక చింతనలో ఉంటూ, ఊరివారందరి తలలో నాలుకలా మెలిగేవాడు. ఒకరోజు రాత్రి, శ్రీవేంకటేశ్వరస్వామి, అతనికి స్వప్నంలో సాక్షాత్కరించి- "నేను నారాయణపురంలో ఇసుక తిన్నెలలో ఉన్నాను. నన్ను వెలికితీయించి, ఈ ప్రాంతానికి తీసుకువచ్చి ఆలయం నిర్మించి, అందులో నన్ను ప్రతిష్ఠింపజేయి, నీకు మంచి జరుగుతుంది. నేను నీ పేరుతోనే పిలువబడుతూ పూజలందుకుంటాను" అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

మరుసటిరోజే నారాపురయ్య తన స్వప్నవృత్తాంతం ఇరుగుపొరుగు వారికి తెలియజేసి, వారందరినీ వెంటబెట్టుకుని నారాయణపురం చేరుకున్నాడు. అక్కడ ఇసుకలో పూడిపోయిన స్వామిని కనుగొని, స్వామిని ప్రతిష్ఠ చేయించి, ఆలయాన్ని పునరుద్ధరించాడు. అప్పటినుండి అనాథరక్షకుడుగా, ఆర్తత్రాణ పరాయణుడుగా జమ్మలమడుగులోని శ్రీభూసమేత శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి విశాలమైన ఆలయప్రాంగణంలో, పూజలందుకుంటూ భక్తుల మనస్సులకు ప్రశాంతతను, ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తున్నాడు.



1918లో ఈ ఆలయ జీర్ణోద్ధరణ జరిగింది. 1970 సం॥లో ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖవారు ఈ ఆలయనిర్వహణా బాధ్యతలను చేపట్టారు. ఆ తర్వాత 23-10-2008 సం॥ నుండి ఈ ఆలయ బాధ్యతలు తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకుంది. ఆనాటినుండి ఈ ఆలయం పూర్వవైభవాన్ని సంతరించుకుని,

దిన దినాభివృద్ధి చెందుతూ ఉత్సవాలతో, భక్తులసందడితో కోలాహలంగా అలరారుతోంది.

## ఆలయ విశేషాలు

ఈ ఆలయం ఉత్తరాభిముఖంగా ఉంది. ఆలయ ప్రధాన ప్రవేశద్వారంపై గల గాలిగోపురం మూడు అంతస్తులను కలిగి శిల్పకళాశోభితమై అలరారుతోంది. ఈ ప్రధాన గోపుర ద్వారంగుండా లోనికి ప్రవేశిస్తే విశాలమైన ఆలయం దర్శనమిస్తుంది. ముందుగా బలిపీఠం, ధ్వజస్తంభం దర్శనమిస్తాయి. ధ్వజస్తంభానికి ఇరువైపులా ఎత్తైన, రెండు భారీవిగ్రహాలు భక్తుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంటాయి. అందులో ఒకటి గరుత్మంతుల వారిది కాగా, మరొకటి శ్రీ ఆంజనేయస్వామి వారిది. ఇద్దరూ నిలుచుని, నమస్కార భంగిమలో దర్శనమిస్తుంటారు. ధ్వజస్తంభం పక్కన ఒక చిన్న మండపం ఉంది. దీనికి 'శ్రీవేంకటేశ్వర కోటిలేఖనమండపం' అని పేరు. భక్తులు రాసిన శ్రీవేంకటేశ్వర కోటినామపుస్తకాలను ఆలయ జీర్ణోద్ధరణ సమయంలో శాస్త్రోక్తంగా నిక్షిప్తం చేసి మండపాన్ని నిర్మించారు.

ధ్వజస్తంభానికి ముందున్న చిన్నమండపంలో గరుడాళ్వారు కొలువుదీరి ఉన్నాడు. ఇవి దాటుతూనే ప్రధాన ఆలయం ఉంది. రంగమండపం, ముఖమండపం, అంతరాళమండపం, గర్భాలయాలు ఉన్నాయి. రంగమండపంలోని స్తంభాలు భక్తుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి.

ప్రధాన గర్భాలయంలో శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి కొలువుదీరి ఉన్నాడు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి రూపురేఖావిలాసాలను కలిగి ఉంటాడు స్వామి. చతుర్భుజుడైన స్వామి శంఖు, చక్ర, వరద, కటి హస్తాలతో, తిరునామాలతో, గడ్డంపై దెబ్బతగిలిన మచ్చతో దర్శనమిస్తాడు. స్వామివారి మూల విరాట్టుకు ముందువైపు శ్రీభూ సమేత స్వామివారి ఉత్సవ మూర్తులు దర్శనమిస్తాయి.

శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామివారి ఆలయ ముఖ మండపంలో ప్రధానద్వారానికి ఇరువైపులా ఉన్న రెండు గర్భాలయాల్లో స్వామివారి దేవేరులు కొలువుదీరి ఉన్నారు. అందులో ఒకరు శ్రీమహాలక్ష్మి కాగా మరొకరు శ్రీ ఆండాళ్ అమ్మవారు. శ్రీమహాలక్ష్మీ అమ్మవారు చతుర్భుజి. రెండుచేతులలో కలువ పువ్వులను ధరించడంతో పాటూ మరో రెండు చేతులలో అభయ వరదముద్రలతో దర్శనమిస్తుంటారు. ఆండాళ్ అమ్మవారు ద్విభుజి. ఒక చేతిలో కలువపువ్వును ధరించి, మరొకచేతిని వయ్యారంగా పెట్టుకుని నయన మనోహరమైన రూపంలో దర్శనమిస్తుంటారు.

ప్రధాన ఆలయానికి పక్కనే ఉన్న చిన్న ఆలయంలో శ్రీ ఆంజనేయస్వామివారు ప్రతిష్ఠింపబడి ఆరాధన లందుకుంటూ ఉన్నాడు. ఆంజనేయస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న మండపం ఆళ్వారులమండపం. ఇందులో వైష్ణవాచార్యులైన పన్నెండుమంది ఆళ్వారులు కొలువుదీరి ఉన్నారు.

ఈ ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు నిర్మించిన "శ్రీ పద్మావతీ కల్యాణమంటపం" ఉంది. ఇందులో ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, వివాహాలు, కవితా గోష్ఠులు జరుగుతూ ఉంటాయి.



## ఉత్సవాలు - వేడుకలు

తిరుమల శ్రీవారికి జరిగే విధంగానే, జమ్మలమడుగు శ్రీభూ సమేత శ్రీనారాపురవేంకటేశ్వర స్వామివారికి కూడా బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ ఏకాదశి నుంచి వైశాఖ

బహుళషష్ఠివరకు ఈ క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో వివిధ వాహనాలను అధిరోహించి, ఉత్సవమూర్తి ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. ఈ వరుసలో వైశాఖ బహుళవిదియనాడు కల్యాణోత్సవం, తదియనాడు రథోత్సవం కన్నులపండువుగా, అంగరంగ వైభవంగా సాగుతాయి. జమ్మలమడుగు పరిసరాల ప్రాంతాల నుంచి మాత్రమే గాక ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు ఈ ఉత్సవాల్లో విరివిగా పాల్గొంటారు.

ఈ బ్రహ్మోత్సవాలు మాత్రమే గాక రథసప్తమి, వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరుగుతాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారు. ప్రతి సంవత్సరం వైశాఖ బహుళసప్తమిరోజు స్వామివారికి పుష్పయాగమహోత్సవం అత్యంతవైభవంగా జరుగుతుంది.

## రవాణా సౌకర్యాలు

తిరుపతి నుండి జమ్మలమడుగుకు వెళ్లడానికి నేరుగా బస్సు సౌకర్యాలున్నాయి. తిరుపతి నుండి ఈ క్షేత్రానికి ప్రయాణ సమయం ఐదున్నర గంటలు. రైలులో వెళ్లు భక్తులు తిరుపతి నుండి వెళ్లి, ఎర్రగుంట్లలో దిగి అక్కడి నుండి ఈ క్షేత్రాన్ని చేరుకోవచ్చు. కడపజిల్లాలో ప్రధానపట్టణమైన ప్రొద్దుటూరు నుండి ఈ క్షేత్రం ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి నుంచి ప్రతి పదిహేను నిముషాలకు జమ్మలమడుగుకు బస్సు సౌకర్యం ఉంది. హైదరాబాదు, కర్నూలు, నంద్యాల, చెన్నై, అనంతపురం, విజయవాడ, గుంటూరు మొదలైన నగరాల నుంచి జమ్మలమడుగుకు బస్సులు ఉన్నాయి. జమ్మలమడుగులో ఉన్న ప్రైవేట్ లాడ్జిలలో భక్తులకు వసతి సౌకర్యాలు లభిస్తాయి.



అనాథరక్షకుడని పేరుగాంచిన శ్రీభూసమేత శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి భక్తుల కోర్కెలు తీరుస్తాడని ఇక్కడి భక్తుల ప్రగాఢవిశ్వాసం!



### శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయ మహోత్సవం, తిరుమల

| | | |
|---|---|---|
| 17-05-2024 | శుక్రవారం | గజవాహనోత్సవం |
| 18-05-2024 | శనివారం | అశ్వవాహనోత్సవం |
| 19-05-2024 | ఆదివారం | గరుడవాహనోత్సవం |

### శ్రీ పద్మావతీతాయార్ల వసంతోత్సవాలు, తిరుచానూరు



| | | |
|---|---|---|
| 21-05-2024 | మంగళవారం | వసంతోత్సవారంభం |
| 22-05-2024 | బుధవారం | స్వర్ణరథోత్సవం |
| 23-05-2024 | గురువారం | వసంతోత్సవ సమాప్తి |

# పుష్కర నర్మద

- శ్రీ ఎస్.జి.టి. అంతర్వేది కృష్ణమాచార్యులు,
99123 53423



మధ్యభారతదేశంలో ప్రవహించే నదులలో ముఖ్య మైంది నర్మదానది. నర్మదను 'మహానద'మని అంటారు. తూర్పున పుట్టి పడమరగా ప్రవహించడమే దీనికి కారణం.

## నర్మద జననం

పరమశివుడు పార్వతితో కలిసి ఋక్షపర్వతంపై తపస్సు చేశాడు. ఆ సమయంలో శివుని దేహం నుండి ఒక జల ప్రవాహం వెలువడింది. ఆ నది స్త్రీగా మారి శివుణ్ణి మెప్పించి, **"తరుగుదల లేని జలంతో వర్ధిల్లుతావు"** అని ఆశీస్సులందు కుంది. శివుని దేహం నుండి పుట్టడం వల్ల "రుద్రకన్యక" అని, "అయోనిజ" అని నర్మదానదికి పేర్లు. నర్మద ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ఆమెను చూచి దేవతలు, రాక్షసులు మోహపరవశులై ఆమె వెంటపడసాగారు. దాంతో, **"మీ అందరిలోకి బలవంతుడు, సౌందర్యవంతుడు అయిన వ్యక్తికి నర్మద లభిస్తుంది"** అని ఈశ్వరుడు చెప్పాడు. దేవతలు, రాక్షసులు ఆమెను పట్టుకోవడానికి అనేకవిధాలుగా ప్రయత్నించారు. కాని నర్మద ఎవరికీ దొరకక శివుణ్ణి ఆశ్రయించింది. తరువాత శివుడు ఆమెను సముద్రునికిచ్చి వివాహం చేశాడు.

శివునికి ఆనందాన్ని చేకూర్చడం వల్ల ఆమెకు "నర్మదా" అనే పేరు వచ్చింది. ఈ నది తన భర్త సముద్రుణ్ణి చేరుకోవాలని ఉత్తుంగతరంగాలతో దూకుతూ, పెద్ద ధ్వనులను చేస్తూ ప్రవహించింది. అందుకని నర్మదని "రేవా" అని కూడా అంటారు. ఇంకా నర్మదకి 'సోమోద్భవ', 'మేఖల కన్యక' అనే పేర్లు కూడా ఉన్నాయి.

హరివంశంలో నర్మద చంద్రుని కుమార్తెగా చెప్ప బడింది. పాతాళలోకంలో మోనేయులు అనే గంధర్వులు ఆరు కోట్లమంది ఉన్నారు. వీరు పాతాళలోకంలో కల నాగుల రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓడిపోయిన నాగులు విష్ణువును శరణు వేడారు. అంతట శ్రీహరి **"మాంధాత చక్రవర్తి కుమారుడైన పురుకుత్సుడు నా అంశతో పుట్టినవాడు, మీ కార్యం చేయగల సమర్థుడు, కాబట్టి మీరు అతణ్ణి ప్రసన్నం చేసుకోండి"** అని చెప్పాడు. తర్వాత నాగులు పురుకుత్సుని తమలోకానికి తీసుకొని రావడానికి నర్మదను ప్రేరేపించారు. ఆమె అందచందాలకు మోహితుడైన పురుకుత్సుడు, ఆమెపై గల అనురాగంతో పాతాళలోకానికి వచ్చి గంధర్వులను ఓడించి నాగులరాజ్యాన్ని తిరిగి వారికి ఇప్పించాడు. ఇంతటి సహాయం చేసినందుకు ప్రతిఫలంగా నాగులు, "నర్మదా, పురుకుత్సులారా! మీ పేర్లను తలుచుకునే వారికి పాముల విషభయం కలగదని", వరాన్ని ఇచ్చారు. పరస్పర అనురాగం కల నర్మద, పురుకుత్సులు వివాహం చేసుకుని త్రసదస్యుడు అనే కుమారునికి జన్మనిచ్చారు.

## జన్మస్థానం

నర్మదానది పొడవు సుమారు ఎనిమిది వందల మైళ్ళు. నర్మద మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అమర కంటక్ పర్వత మధ్య భాగంలో జన్మించింది. వింధ్యపర్వత పంక్తుల తూర్పుభాగంలో అమరకంటక్ పర్వతం ఉంది. అమరకంటక్ పర్వతం సముద్ర మట్టానికి వేయి అరవై మీటర్ల ఎత్తులో ఉంది. ఈ అమరకంటక్ నుండి నర్మదానది కొంతదూరం ప్రవహించి "కపిధార" జల పాతం వద్ద ఎనభై అడుగుల ఎత్తునుండి క్రిందకి దూకుతోంది. క్రమంగా, మందర పర్వతాల గుండా ప్రవహించి పడమరగా

సాగి వింధ్య, సాత్పుర పర్వత వరుసల నడుమ కల లోయల గుండా పారుతోంది. ఈ ప్రదేశాన్నే నర్మదానదీ లోయ అని అంటారు. ఇక్కడ నుండి నర్మదానది మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల గుండా సాగి 'బరుకచ్చం' వద్ద లోతైన కాంటే సింధు శాఖలో కలిసి పశ్చిమ సముద్రాన్ని చేరుతోంది.

## పరీవాహకప్రాంతం

నర్మదా పరీవాహకప్రాంతం చాలా సారవంతమైంది. జన్మస్థలం నుంచి సాగరసంగమస్థలం వరకు నర్మద పొడవు 1300 కిలోమీటర్లు. 1070 కిలోమీటర్ల మేర మధ్యప్రదేశ్ లోను, 166కిలోమీటర్ల మేర గుజరాత్‌లోను ప్రవహిస్తోంది. 35 కిలోమీటర్ల మేర మధ్యప్రదేశ్, మహారాష్ట్రల సరిహద్దుగాను, 39కిలోమీటర్ల మేర మహారాష్ట్ర, గుజరాత్‌ల సరిహద్దుగాను నర్మద ప్రవహిస్తోంది.

నర్మద మధ్యప్రదేశ్‌లో నిటారుగా ఉండే కొండల, బండల మధ్య నుంచి జలపాతాలుగా, సుడిగుండాలుగా మారి దట్టమైన ఉష్ణదేశవనాలు, బూరుగచెట్లుండే మెట్టప్రాంతపు అడవుల మధ్య నుంచి ప్రవహిస్తుంది. మధ్య, దిగువ భాగాలకు చేరేసరికి టేకుచెట్లు, వెదురు గుబుర్లు ఎక్కువగా కనిపిస్తాయి. కపిధార జలపాతం వద్ద క్రిందకిపడ్డ నర్మదానది మాండ్య కొండ ల్లోంచి ప్రవహిస్తూ, ధువాధార్ జలపాతం నుండి వంకరగా తిరిగి జబల్పూర్ దగ్గర అనేకరకాలైన బలపనరాళ్లను, చలువ రాతి (పాలరాయి) బండలను చీల్చుకుంటూ వస్తుంది. ఇక్కడి నుంచి ఒక 320 కిలోమీటర్లు పొడవునా జబల్పూర్, హింది యాలకి దక్షిణంగా ఉండే లోయ అత్యంత సారవంతమైంది. ఈ లోయ వింధ్య-సాత్పుర శ్రేణులమధ్య ఉంది. నర్మదాలోయగా పేరుపొందిన ఈ ప్రదేశం అత్యంత ప్రకృతి రామణీయకంగా ఉంటుంది. సాత్పురశ్రేణుల్లో మహదేవ్ కొండలు ఉన్నాయి. ఇక్కడే సియోని, ఛింద్వారా, బటరాయి అడవులు ఉన్నాయి. ఎత్తుగా ఉండే నదీమూలం దగ్గర "పులి సామ్రాజ్యం" ఉంది. భారతదేశంలో ఉన్న పులుల్లో దాదాపు రెండువేల పులులు ఈ ప్రాంతాలలోనే ఉన్నాయి.

నర్మదానది ఇక్కడి నుండి మరిన్ని కొండలను, దట్టమైన, అడవులను దాటి గుజరాత్ మైదానప్రాంతంలోకి చేరుతుంది. ఇక్కడి నుండి నర్మదలో నౌకాయానం సాధ్యపడుతుంది. నర్మదానదీ ముఖద్వారంవద్ద కల బరుకచ్చం(బ్రోచ్) ప్రాచీన కాలంలో ఆంధ్ర, చాళుక్య, రాష్ట్రకూట సామ్రాజ్యాల ప్రధానరేవు



స్థలం. నర్మదానదీ పరీవాహకప్రదేశంలో ఎక్కువశాతం వన వాసులు నివసించే పర్వతప్రాంతాల్లో ఉంది. నర్మదానది తన ముఖ్య ఉపనదులైన, బంగర్, షేర్, షక్కర్, తవా, ఛోటాతవా, కంజల్, హిరన్‌లను తనలో కలుపుకుని, సుమారు తొంభైవేల చదరపు కిలోమీటర్ల భూమికి సేద్యపునీరును అందిస్తోంది.

## నర్మదానదీ తీర పుణ్యక్షేత్రాలు

నర్మదానదీ జన్మస్థానమైన అమరకంటక్ పర్వతం ఎంతో పుణ్యప్రదమైన ప్రదేశం. నర్మదానది పుట్టినచోట నర్మదానది గుడి ఉంది. దీన్ని కర్ణదేవుడనే చేదిరాజు చేత నిర్మించాడు. ఇక్కడ మాఘశుక్లసప్తమినాడు నర్మదాజయంతి అని గొప్ప ఉత్సవం జరుపుతారు. ఈ మందిరం నుండి కొద్దిపాటి దూరంలో మార్కండేయ ఆశ్రమం, శోణభద్ర ఉద్గమ స్థలం, భృగుకమలం, జ్వాలేశ్వరం, మొదలైన దర్శనీయ ప్రదేశా లున్నాయి. దేవగావ్ అనే ప్రాంతం నర్మదానది దక్షిణతటంలో ఉంది. ఇక్కడ జమదగ్ని ఆశ్రమం, జమదగ్నీశ్వర, పాతాళేశ్వర మందిరాలున్నాయి.

మెరటక్ అనే ప్రాంతంలో నర్మదానది రెండుగా చీలుతుంది. ఈ రెండుపాయల నడుమ ఒక ద్వీపముంది. దీన్నే మాంధాత ద్వీపం అంటారు. షట్చక్రవర్తులలో ఒకరైన మాంధాత చక్రవర్తి ఇక్కడ శివుని గురించి తపస్సు చేయడం వల్ల ఈ ద్వీపానికా పేరు వచ్చింది.



ఈ ద్వీపానికే శివపురం అని మరో పేరు. ఇక్కడ అనేక శివాలయాలు ఉన్నాయి. వీటిలో 'ఓంకారాలయం' ప్రసిద్ధి చెందింది. మహాశివుని జ్యోతిర్లింగాలలో ఇదొకటి. 1650–1820 సంవత్సరపు మధ్యకాలంలో, మహారాష్ట్ర పీష్వాల కాలంలో ఈ ఓంకారేశ్వర ఆలయం పునరుద్ధరింపబడింది. ఈ ఆలయానికి కొద్దిదూరంలో భృగుమహర్షి సిద్ధిపొందిన కొండ ప్రదేశముంది. దీనికే భృగుపతనం అని పేరు.

ఇక్కడే చాండోద్ అనే మరొక యాత్రాస్థలముంది. ఇది వ్యాసుని ఆశ్రమస్థలంగా చెప్పబడుతోంది. దీనికి ఎనిమిది మైళ్లదూరంలో వ్యాసుని గుడి ఉంది. తన కుమారుడైన శుకుడిని తనను వదిలివెళ్లద్దని వారిస్తూ వచ్చి వ్యాసమహర్షి ఇక్కడ తపస్సు చేశాడు. ఈ వ్యాసగుడి ఎదురుగా (నది ఆవలితీరంలో) శుకుని గుడి ఉంది. దీన్ని ఆనుకొని మహాదేవుని ఆలయమొకటి ఉంది. ఇక్కడ నుండి కొంతదూరంలో కర్నాలీ అనే ప్రాంతం ఉంది. ఇక్కడ కుంభేశ్వరాలయం, శనైశ్వరాలయం కలవు. నర్మదానది ఉత్తరతీరంలో శుక్లతీర్థం ఉంది, ఇది గొప్ప పుణ్యక్షేత్రం. దీనికి 10 మైళ్లదూరంలో బ్రోచ్ అనే పట్టణముంది. ఇది చాలా ప్రాచీనకాలం నుండి ఉంది. భృగుమహర్షి ఇక్కడే తపస్సు చేశాడని అందువల్ల దీన్ని భృగుక్షేత్రంగా పిలుస్తారు. రాను రాను ఇది భృగుకచ్ఛంగా తరువాత ప్రస్తుత బ్రోచ్‌గా రూపాంతరం చెందింది. బలిచక్రవర్తి ఇక్కడే అశ్వమేధయాగం చేశాడు. గౌతమీపుత్రశాతకర్ణి శాతవాహనుని కాలంలోను తర్వాత కూడా గొప్ప రేవుపట్టణంగా పేరుపడి ఇక్కడ విదేశ వర్తకం సాగింది. ఈ బ్రోచ్ వద్దనే నర్మదానది సముద్రంలో కలుస్తుంది. పురాణ ఆధారంగా చూస్తే నర్మదా జన్మస్థానం నుండి సాగరసంగమం వరకు 10కోట్ల తీర్థాలున్నాయి. ఈ నర్మదానదిలోనే దేవతార్చనలో పూజించే స్వయంభూ 'బాణలింగాలు' లభ్యమౌతాయి. నర్మదా సంగమస్థానాన్ని చూస్తే చాలు సమస్త తీర్థాలను చూచిన ఫలితం కలుగుతుంది. పుష్కరాలు వచ్చే నదులలో ఇది రెండవది, గురుగ్రహం వృషభరాశిలోకి ప్రవేశిస్తే ఈ నదికి పుష్కరాలు వస్తాయి.

## నర్మదా మాహాత్మ్యం

మత్స్య, స్కంద, కూర్మపురాణాలలో నర్మదానదీ మాహాత్మ్యం గురించి చాలా గొప్పగా చెప్పబడింది. నర్మదానది అన్ని నదులలో శ్రేష్ఠమైంది. కనఖల క్షేత్రంలో గంగ, కురు క్షేత్రంలో సరస్వతి పవిత్రమని చెపుతారు. కానీ నర్మదానది అంతటా పవిత్రమైంది. గంగానది జలాన్ని తాకినంతనే పవిత్రత చేకూరుతుంది. కానీ నర్మదానదిని చూడటంతోనే పవిత్రత చేకూరుతుందని స్మృతివచనం. పరమశివుని దేహం నుండి పుట్టిన ఈ నర్మదానదిలో స్నానం కాని, తీరంలో దానం కాని, యజ్ఞయాగాదిశుభకార్యాలు కాని విశేషఫలితాల్ని ఇస్తాయి.

### వైకుంఠపాళి

### :: 100 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మ | ధు | చ్ఛం | 2 దు | డు | | 3 ప్ర | ఘు | 4 సు | డు | |
| ధు | | | ష్ట | | | | | ధ | | 5 స్వా |
| 6 మం | కి | | 7 చ | ర్మ | ణ్వ | తి | | | | త్వ |
| త | | | తు | | | | 8 ము | దా | వ | తి |
| ము | | 9 అ | ష్ట | కు | డు | | ద్గ | | | |
| | 10 అ | | య | | | | లు | | 11 న | |
| | చ్ఛో | | 12 ము | చి | 13 కుం | దు | డు | | ల్ల | |
| 14 గ | ద | | | | భీ | | | | 15 వే | ట |
| | ము | | 16 ము | మ్మె | న | వా | లు | 17 దా | ల్పు | |
| | | | త్తా | | స | | | ని | | 18 నీ |
| 19 ము | క్తా | ల | త | | | | 20 అ | మ్మ | వా | రు |

*గత సంచిక తరువాయి భాగం....*


మొదట గరుత్మంతునకు 'దాసస్సఖా' అనే శ్లోకాన్ని, ఆదిశేషునకు 'శెన్ఱాల్ కుడైయామ్, 'నివాసశయ్యాసన' అనే గీతా శ్లోకాలను అనుసంధించాలి. పొయ్‌గైఆళ్వారు, భూతత్తాళ్వారు, పేయాళ్వారులకు కైతైశేర్, వైయంతగళియా, ఎన్‌పిరవితీర్, అన్బేతగళియా, శీరారుమ్ మాడమ్, తిరుక్కండేన్- అనేవి, తిరుమళిశైఆళ్వారుకు నారాయణన్, నాన్ముగనై-అనేవి, నమ్మాళ్వారుకు కరువిరుత్తక్కుళిపొయ్‌న్దనిన్ద-అనేవి, శ్రీకుల శేఖరాళ్వారుకు ఇన్నముదమ్, ఇరుళిరియ అనేవి, పెరియా ళ్వారుకు పాండియన్ కొండాడ, పల్లాండు పల్లాండుఅనేమి, శ్రీగోదాదేవికి అల్లివాళ్ తామరైమేల్, తైయొరుతింగళుమ్- అనేవి అనుసంధించాలి.

అందరికి మొదట ప్రబంధప్రశస్తి పద్యాలను అనుసంధిస్తే, గోదాదేవికి చరమప్రబంధప్రశస్తి పద్యాన్ని అను సంధించడానికి కారణం 'శ్రీవేంకటేశ్వరునకు నన్ను విధింపుము' అని ప్రబంధాదిలో ఉండడమే.

తొండరడిప్పొడియాళ్వారుకు మత్తొన్ఱుమ్, కావలిల్ పులనై- అనేవాటిని, తిరుప్పాణాళ్వారుకు కాట్టవే, అమలనాది పిరాన్- అనేవాటిని, తిరుమంగైయాళ్వారుకు వాళిపరకాలన్, వాడినేన్ వాడి-అనేవాటిని, శ్రీమధురకవియాళ్వారుకు 'వేరొన్ఱుమ్' 'కట్టినుణ్ శిఱుత్తాంబినాల్'- అనేవాటిని, భగవద్రామానుజులకు 'శొల్లిన్‌తొకై' అఖిల భువనజన్మ- అనేవాటిని, విష్వక్సేనులకు త్వదీయభుక్తోజ్ఝిత- అనేవాటిని, శ్రీమన్నాథమునులకు 'నమో- చింత్య'- అనుదానిని, ప్రబంధగాయకులకు 'నమో- చింత్య' అనుదానిని అనుసంధించాలి.

నిత్యసూరులనుగ్రహించిన ప్రబంధమొక్కటీ లేనందు వల్ల వారు చేసే కైంకర్యాలను ప్రతిపాదించే శ్లోకాలు అనుసంధే యాలు. ఆళ్వారులు పదుగురిలో దివ్యావతార క్రమంగా మంగళాశాసనాలు, తర్వాత శ్రీమధురకవులు శ్రీభాష్యకారులు, మహారాజగు వ్యక్తిసర్వాశ్రితులకూ బహుమానం చేసిన తర్వాత సేనాధిపతికి సన్మానం చేసే, లోకన్యాయంలాగా అందరికీ, తర్వాత విష్వక్సేనులకు బహుమానం, ముక్తులైన ఆళ్వారులకు వాచికకైంకర్యంకోసం మంగళాశాసనం ప్రసాదించే ప్రకరణంలో నిత్యసూరులు చేసే కైంకర్యాన్ని గూర్చి ఉపచారార్థక మంగళా శాసనం ప్రసాదించేక్రమం.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యామాల)


తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు


**కట్టియం విన్నవించు శ్లోకాలు :**

"శ్రీ భూమినాయక దయాకర దివ్యమూర్తే
దేవాధిదేవ జగదేశశరణ్య విష్ణో,
గోపాంగనాకుచ సరోరుహ భృంగరాజ
గోవిందరాజ విజయీ భవ కోమలాంగ.

దేవాధిదేవ ఫణిరాజ విహంగరాజ
రాజత్కిరీట మణిరాజివిరాజితాంఘ్రే,
రాజాధిరాజ యదురాజకులాధిరాజ
గోవిందరాజ విజయీ భవ గోపచంద్ర."

*(ఇంకా ఉంది)*

ఈ నెల 22న
**నృసింహజయంతి**
సందర్భంగా...



# నమో నారసింహా! నమో భక్తపాలా!

- డా॥ ముంజులూరి నరసింహారావు

నరసింహుడు స్తంభంనుంచి భీకరమైన ఆకారం తోనూ, పెద్ద జూలుతోనూ, భయంపుట్టించే కోరలతోనూ, అతిక్రోధంతోనూ ఆవిర్భవించడానికి కారణం అసురవంశంలోనే పుట్టిన ఒక అతిసాత్త్విక బాలభక్తుడికి జరిగిన చిత్రహింస నుండి అతడిని కాపాడడం. అతని పేరే ప్రహ్లాదుడు (హ్లాదీ-అవ్యక్తే శబ్దా సుఖే చ) భక్తిపూర్వకంగా భగవన్నామాలను లోలోపల జపిస్తూ మహదానందంలో నిమగ్నమై ఉండే మహాత్ముడు అతను. అలంపటుడు, సుశీలుడు, గుణాకరుడు. ఇతరుల సమృద్ధిని చూసి హర్షించేవాడు; వారికి దుఃఖం వాటిల్లితే చాలా బాధపడే వాడు. అతను అభూతశత్రువు. చంద్రుడు వేసవిపగటితాపాన్ని పోగొట్టినట్టు, జగత్తులోని శోకాన్ని శాంతింపజేయ గలిగే పుణ్య శ్లోకుడు అతను.

అలాంటి ఆ అర్భకుడి తండ్రి హిరణ్యకశిపుడు: హిరణ్య మంటే బంగారం; కశిపమంటే శయ్యా, తిండీ బట్ట. అంటే, లాలసను పుట్టించే భౌతికభోగాలకు అంకితమైన ఆసురీ సంపద్వంతుడు అతను. ఈ భోగభాగ్యాలకు అంతు రాకూడదని గొప్పతపస్సుచేసి, బ్రహ్మ సృష్టించిన నరుడిచేతగానీ, మృగంచేత గానీ, ప్రాణాలున్నదానిచేతగానీ, ప్రాణాలు లేనిదానిచేతగానీ, దేవదైత్య మహోరగాలచేతగానీ, లోపలగానీ, బయటగానీ, పగలుగానీ, రాత్రిగానీ, భూమ్మీదగానీ, ఆకాశంలోగానీ, ఏ రకాల ఆయుధాలతోగానీ చావురాకూడదనీ, తనముందు ఏ ఒక్కడూ యుద్ధంలో నిలిచే సామర్థ్యాన్ని కలిగి ఉండకూడదనీ, తానే సమస్తజీవరాశులకూ ఏకచ్ఛత్రాధిపతి కావాలని అత్యంత దుష్కరమైన వరాలను పొందాడు. ఎన్ని వరాల చాటునున్నా, ఏదో ఒక రంధ్రాన్ని వెదికి పట్టుకుని, భగవంతుడు తనను మట్టుబెట్టగలడన్న రహస్యం అతనికి తెలియదు.

ఎన్నెన్ని వరాలను అడ్డుపెట్టుకున్నా, కాల రూపుడైన భగవంతుడు ఏదో మనం ఊహించని మార్గాన్ని వేస్తూనే ఉంటాడు. అంచేత ఇలాంటి పిచ్చివరాల కవచాన్ని ధరించి దిలాసాగా ఉండటం అతిమూర్ఖత్వం. హిరణ్యకశిపుడికిచ్చిన వరాల ఉచ్చు నుంచి తప్పుకోడానికి, భగవంతుడు, బ్రహ్మ సృష్టించని సగం నరుడూ, సగం సింహమూ అయిన నరసింహ రూపాన్ని తాల్చాడు; భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడనే భక్తుడి మాటను నిజమని నిరూపించడానికి, విడ్డూరమైన మృగమూ, మానుషమూ కాని విచిత్రరూపాన్ని ధరించి, సభలోని స్తంభం లోంచి వికటాట్టహాసం చేస్తూ నిర్గమించాడు; లోపలా బయట గాని, గుమ్మంగడపమీద కూర్చున్నాడు; ఒడిలో తొడల మీద దానవుణ్ణి పడేసుకొన్నాడు; రాత్రీపగలూ గాని సంధ్యా సమయాన్ని ఎంచుకొన్నాడు; ఆయుధాలుగాని గోళ్లను ఆయుధాలుగా మలుచుకొన్నాడు; నఖాలతో గరుడుడు పామును చీల్చినట్టు, హిరణ్యకశిపుణ్ణి చీల్చి, ఏనుగును చంపిన సింహం లాగ, అతని ప్రేవుల్ని మాలగా వేసుకొని అతిభీకరంగా గర్జించాడు.

వరాల్లో ఉన్న షరతులనన్నిటినీ మీరకుండా, హిరణ్య కశిపుడి హృత్సరోరుహాన్ని నఖాంకురాలతో ఉత్పాటించాడు.

దైత్యాక్రాంతమైన భగవద్గృహమనే హృదయకమలం ముడుచుకునిపోగా, దాన్ని తిరిగి ప్రఫుల్లపరిచాడు. తన మాయానృసింహసూర్యరూపంతో. అంచేతనే ఈ నృసింహుణ్ణి యోగనరసింహుడిగా చెబుతారు. నరసింహుడనే పేరులో సింహశబ్దం శ్రేష్ఠత్వాన్ని చెప్పే వాచకం కూడాను. భౌతికసుఖాలనే రాక్షసులు ఆక్రమించి, ఆత్మానందాన్ని మట్టుబెడదామని ప్రయత్నిస్తున్నప్పుడు, నాలుగు సంధ్యాసమయాల్లోనూ యోగాభ్యాసాన్ని తీవ్రంగానూ, తీక్షణంగానూ చేస్తూ యోగనరసింహుడై, యోగనరవరుడై సాధకుడు, ఆ రక్కసుల్ని చీల్చి చెండాడి విజయానందాన్ని పొందాలి. యోగాభ్యాసంలో ముఖ్యమైన ప్రాణాయామంలో, సూర్యనాడినీ (పగటినీ) చంద్రనాడినీ (రాత్రినీ) కాదని, మధ్యలో ఉన్న సుషుమ్నానాడిలో ప్రాణాన్ని ప్రవహింపజేయాలి. సుమ్నమంటే సుఖం; సుషుమ్నమంటే ఆత్యంతికమైన సుఖం, ఆనందం.

లోపలా, బయటా అనే మాటలు కూడా యోగస్ఫురణను గుర్తుకు తెచ్చేవే. లోపలా బయటా గాని గడప నిద్రామెలుకువల మధ్య సంధి. ఈ సంధిగడపమీద కూర్చుని, మెలుకువకూ, నిద్రకూ మధ్యనున్న సంధిలో అనుభవానికి వచ్చే బ్రహ్మాన్ని ఒక్కదాన్నే బాగా తరచి తరచి ఆలోచించాలని ఉపదేశిస్తుంది. నిద్రతో శరీరసంబంధమైన వాటినన్నిటినీ చేష్టల్లేకుండా చేసి, ఆత్మ, తాను నిద్రపోకుండా, నిద్రలో కూరుకుపోయిన వాటినన్నిటినీ ప్రకాశింపజేసి ఉత్తేజపరుస్తూ ఉంటుంది. పండుకొన్నప్పుడు, మెలుకువ నెమ్మదినెమ్మదిగా నిద్రలోకి జారుకుంటుంది. మెలుకువ చివరనీ నిద్ర మొదటినీ, నిద్ర చివరినీ మెలుకువ మొదటినీ పరిశీలిస్తేనే ఈ సంధిగడప అనుభవంలోకి వస్తుంది. మెలుకువలో కళ్లు పూర్తిగా తెరిచి ఉంటాయి; నిద్రలో అవి పూర్తిగా మూసుకొనిపోతాయి. ఈ రెండింటి మధ్య స్థితికి చేరాలంటే, మనం కళ్లను సగం తెరిచీ సగం మూసీ ఉంచుకోవాలి. ఈ సంధిగడపమీద కూర్చున్నప్పుడు, పైసగంలో చీకటీ కిందిసగంలో వెలుగూ ఉంటాయి. అప్పుడు అవచేతనా, మానుషచేతనా అవఖండితాలై ఆత్మను చేర్చే అధిచైతన్యస్థితి కుదురుతుంది. నిద్రలో శరీరాన్ని కదలకుండా చేసి, ఆత్మ స్వయంగా జ్ఞానప్రకాశంగనక, తాను మెలుకువగా ఉంటూ, నిద్రపోయే వాటినన్నిటినీ ప్రకాశింపజేస్తుంది. తిరిగి ఆ ఆత్మజ్యోతే ఇంద్రియాలూ మొదలైన రూపాలను గ్రహించి, మెలుకువలోకి వస్తుంది. మెలుకువ నిద్రల సంధిస్థానంలో అగుపించే ఈ యోగనృసింహ బ్రహ్మాన్నే చింతిస్తూ ఉంటే, ఆ చీకటివెలుగుల్లో వేరువేరుగా అగుపించే రాక్షస కోలాహలం ధ్వంసమైపోతుంది.

కరాళమైన దంష్ట్రలతోనూ, కత్తివాదరను అటూ ఇటూ తిప్పుతూన్నట్టున్న కరకునాలికతోనూ, గిరిగుహల్లాగ తెరుచుకుని ఉన్న ముక్కుసోణాలతోనూ, నోరుతోనూ, చీల్చినట్టుగా తెరిచినట్టున్న భీషణమైన దవడలతోనూ, జూలునిండా రాక్షస రక్తపు చుక్కలతోనూ, అతిభయంకరంగా ఉన్న నృసింహరూపాన్ని చూచి, లక్ష్మీదేవికూడా అతనెవరో అన్నట్టు శంకిస్తూ దగ్గరికి వెళ్లడానికి తటపటాయించిందని చెబుతారు. అప్పుడు ప్రహ్లాదుడు 'ఈ నీ అతిభయానకమైన ఉగ్రరూపానికి నేను భయపడ'నంటూ ముందుకు వచ్చాడు. నేను భయపడేది మింగుదామని మీదకు వస్తూన్న సంసారచక్ర కదనం నుంచి మాత్రమే అని అంటూ, 'నీ పాదమూలాన్ని చేరుకోమని ఎప్పటికి పిలుస్తావోగదా' అని భగవదనుగ్రహభాషణంకోసం ఆరాటపడ్డాడు. ఇలాగ పైకి భయంకరంగా కనిపించే నరసింహరూపాన్ని లోకులు 'విభయాయ', భయాన్నుంచి విముక్తిని కోరుకొంటూ స్మరిస్తారని వివరిస్తూ ప్రహ్లాదుడు, ఈ యోగనారసింహరూపాన్ని ఆవిష్కరించాడు.

ప్రహ్లాదుడు తన ప్రదేశంలోని జనులతో కలిసి, అనన్యభక్తితో చేసే స్తోత్రంలోనూ యోగనరసింహరూపం అగుపిస్తుంది– "తేజస్సులన్నిటికీ తేజస్సైన ఆ భగవానుడు మాలో ప్రకాశించి, తన వజ్రాల్లాంటి నఖాలతోనూ, కోరలతోనూ, మా కర్మబీజాలను చీల్చి ఉడకబెట్టి, తిరిగి మొలవకుండా చేయాలి. మా తెలివిమాలినతనమనే చిమ్మచీకటిని మింగేయాలి. మా హృదయాల్లో అభయాన్ని అధికాధికంగా ప్రతిష్ఠించాలి." అని స్తుతించాడు. ఈ తాత్పర్యాన్ని గమనిస్తే కర్మబీజనాశనాన్నీ అజ్ఞానతిమిరాన్నీ, అపమృత్యుభయాన్నీ కోరుకొంటూ భగవద్యోగాన్ని ప్రసాదించే ప్రార్థనే ఇమిడి ఉందని అర్థమౌతుంది.

## అక్షయ ఫలాలనిచ్చే

# అక్షయతృతీయ

- శ్రీమతి పూర్ణిమాస్వాతి గోపరాజు



వైశాఖశుద్ధతదియనే అక్షయతృతీయగా జరుపుకుంటారు. ఈ రోజునే సింహాచల వరాహనరసింహస్వామివారి చందనోత్సవం కూడా జరుగుతుంది.

అక్షయ తృతీయనాడు, మనం చేపట్టిన ఏ కార్యఫలమైనా అక్షయంగా, నిరంతరం, జన్మలతో సంబంధం లేకుండా, మన వెంట వస్తూనే ఉంటుంది. పుణ్యకర్మలన్నీ విహితమైనవే. అందునా, ఆ రోజు ఓ కొత్తకుండలో గానీ, కూజాలో గానీ, మంచినీరు పోసి, దాహార్తులకు శ్రద్ధతో సమర్పిస్తే, ఎన్ని జన్మలలోనైనా, మన జీవుడికి దాహంతో గొంతు ఎండిపోయే పరిస్థితి రాదు. అతిథులకు, అభ్యాగతులకు, పెరుగన్నంతో కూడిన భోజనం సమర్పిస్తే, ఏ రోజూ ఆకలితో మనం అలమటించాల్సిన రోజు రాదు. వస్త్రదానం వల్ల తదనుగుణ ఫలితం లభిస్తుంది. అర్హులకు స్వయంపాకం, దక్షిణ, తాంబూలాదులు సమర్పించుకుంటే, మన ఉత్తరజన్మలలో వాటికి లోటురాదు. గొడుగులు, చెప్పులు, విసనకర్రల లాంటివి దానం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఆ రోజు నిషిద్ధకర్మల జోలికి వెళ్లకపోవడం ఎంతో శ్రేయస్కరం. అక్షయతృతీయ అదృష్టాన్ని, విజయాన్ని చేకూర్చుతుంది.

### బంగారానికీ అక్షయ తృతీయకీ సంబంధం ఏమిటి ?

మన సంస్కృతిలో ప్రతి పండుగ వెనుకా ఓ కారణం కనిపిస్తుంది. కాకపోతే ఒక్కోసారి ఆ కారణాన్ని మర్చిపోయి, ఆచరణకే ప్రాధాన్యతని ఇస్తూ ఉంటాం. అందుకు ఉదాహరణే అక్షయతృతీయ. అక్షయతృతీయరోజున బంగారం కొనితీరాల్సిందే అన్న స్థాయిలో ఇప్పుడు ఆలోచిస్తున్నారు. నిజంగా అక్షయ తృతీయరోజు బంగారం కొనాల్సిందేనా! అసలు బంగారానికీ అక్షయతృతీయకీ సంబంధం ఏమిటి?

అక్షయతృతీయ రోజున బంగారం కొని తీరాలని ఏ శాస్త్రంలోనూ లేదు. కాకపోతే ఈ రోజున ఏ కార్యాన్ని తల పెట్టినా నిర్విఘ్నంగా సాగుతుందని, ఏ పుణ్యకర్మని ఆచరించినా కూడా దాని ఫలితాలు అక్షయంగా లభిస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకనే అక్షయతృతీయరోజున తప్పకుండా దానధర్మాలు చేయాలని చెబుతారు. ముఖ్యంగా ఎండలు విపరీతంగా ఉండే ఈ కాలంలో ఉదకుంభదానం పేరుతో నీటితో నింపిన కుండను దానం ఇవ్వమని పెద్దలు సూచిస్తూ ఉంటారు.

అక్షయతృతీయనాడు విష్ణుమూర్తిని పూజించాలి. విష్ణుమూర్తి పాదాలను అక్షతలతో అర్చించి, ఆ అక్షతలను దానం చేస్తే విశేషమైన ఫలితం వస్తుంది.



**'అక్షయతృతీయ'**
**ప్రాముఖ్యతలు చాలా ఉన్నాయి.**
**అందులో కొన్ని చూద్దాం...**

01) పరశురాముని జన్మదినం.

02) పవిత్ర గంగానది భూమిని తాకిన పర్వదినం.

03) త్రేతాయుగం మొదలైన దినం.

04) శ్రీకృష్ణుడు తన బాల్యమిత్రుడైన కుచేలుని కలుసుకొన్న దినం.

05) వ్యాసమహర్షిమహాభారతాన్ని, వినాయకుని సహాయంతో, వ్రాయడం మొదలుపెట్టిన దినం.

06) అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులకు సూర్య భగవానుడు "అక్షయపాత్ర" ఇచ్చిన దినం.

07) శివునిప్రార్థించి కుబేరుడు శ్రీమహాలక్ష్మితో సమస్తసంపదలకు సంరక్షకునిగా నియమింప బడ్డ దినం.

08) ఆదిశంకరులు "కనకధారాస్తవం" చెప్పిన దినం.

09) అన్నపూర్ణాదేవి తన అవతారాన్ని స్వీకరించిన దినం.

10) ద్రౌపదిని శ్రీకృష్ణుడు దుశ్శాసనుని బారినుండి కాపాడిన దినం.

జపం, హోమం, వ్రతం, పుణ్యం, దానం... ఇలా అక్షయతృతీయనాడు చేసే ప్రతి పనీ అనంతమైన ఫలితాన్నిస్తుంది. అక్షయ తృతీయనాడు వివాహం చేసుకుంటే ఆ బంధం చిరకాలం నిలుస్తుందనీ, జాతకరీత్యా వివాహబంధంలో ఎలాంటి దోషాలు ఉన్నా తొలగిపోతాయని హిందువులు నమ్ముతారు.

అక్షయతృతీయ రోజున ఏ పని చేసినా అక్షయమైన ఫలితం దక్కుతుంది కాబట్టి, ఈ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే... మన సంపదలు కూడా అక్షయం అవుతాయన్న నమ్మకం మొదలైంది. అయితే కష్టపడో, అప్పుచేసో, తప్పుచేసో సంపదను కొనుగోలు చేస్తే మనకష్టాలు, అప్పులు, పాపాలు కూడా అక్షయంగా మారే ప్రమాదం ఉంది. అక్షయతృతీయ రోజున వర్జ్యం, రాహుకాలంతో పనిలేదు.

మత్స్యపురాణంలో 65వ అధ్యాయం ప్రకారం ఈశ్వరుడు పార్వతీదేవికి అక్షయతృతీయవ్రతం గూర్చి చెప్పాడు. వైశాఖశుద్ధతదియరోజున చేసే ఏ వ్రతమైనా, జపమైనా, దానాలు ఏవైనా సరే అక్షయమౌతుంది.

పుణ్యకార్యాచరణతోవచ్చే ఫలితం అక్షయమైనట్లే, పాప కార్యాచరణతో వచ్చే పాపం అక్షయమే అవుతుంది. అక్షయ తృతీయరోజున ఉపవాసదీక్ష చేసి ఏ పుణ్యకర్మ నాచరించినా అక్షయంగా ఫలం లభిస్తుంది. అక్షయుడైన విష్ణువును పూజిస్తున్నందునే దీనికి అక్షయతృతీయ అని పేరు వచ్చింది. పండితులు పిల్లలను పాఠశాలలో చేర్చడం, పుస్తకావిష్కరణ, పుణ్యస్థలాలను సందర్శించడం మంచికార్యాలను ఈ రోజున చేయవచ్చు.

ఇంకా గృహనిర్మాణం, ఇంటిస్థలం కొనడం, బావి తవ్వడం వంటి పలు శుభకార్యాలను ప్రారంభించడం ద్వారా మంచి ఫలితాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఈ పర్వదినానపుష్పమో, ఫలమో భగవంతుడికి సమర్పించినా, దైవనామస్మరణ చేసినా, చివరికి నమస్కారం చేసినా సంపద, పుణ్యఫలం అక్షయంగా ప్రాప్తిస్తాయని ప్రతీతి.

## మార్చి నెల క్విజ్-20 సమాధానాలు

| | |
|---|---|
| 01) భగవంతునితో | 11) తుంబురుతీర్థం |
| 02) హరి-హర | 12) సేవాధర్మం |
| 03) భగవంతుడు | 13) నరసమాంబ |
| 04) హోమం చేయబడే హవిస్సు | 14) ప్రత్తిమిట్ట |
| 05) ఒకసారి | 15) దేవాధిరాజన్ |
| 06) సువర్ణముఖినది | 16) చలనం లేనివి |
| 07) స్వామి పుష్కరిణీ | 17) వింధ్యపర్వత సమీపంలో |
| 08) శుభలక్షణ లక్షిత | 18) అశ్వహృదయం |
| 09) శాంతిపర్వం | 19) గర్గముని |
| 10) ఆదివరాహక్షేత్రం | 20) గణితసారసంగ్రహం |

వీటికి సరైన సమాధానాలు రాలేదు.

108 దివ్యదేశాలు

# తిరు అరిమేయవిణ్ణగరమ్

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరునాంగూరు దివ్యదేశాలలో కుడమాడుకూత్తన్ దేవాలయం అని పిలవబడే ఈ తిరుఅరిమేయవిణ్ణగరం ఒకటి. మూడు అంతస్థులతో కూడియున్న రాజగోపురంలో గర్భగృహం, అర్ధ మండపం మహామండపాలు ఇక్కడ ఉన్నాయి. శీర్గాళి అనేక్షేత్రం నుండి 8 కి.మీ. దూరంలో ఈ క్షేత్రం వెలసియున్నది. ఈ దేవాలయంలోని మూలమూర్తి తూర్పుదిక్కున కుడిపాదాన్ని అలా కిందకు చాపి, ఎడమపాదాన్ని మడచిపెట్టుకుని కూర్చున్న భంగిమలో శ్రీభూసమేతుడై విరాజిల్లుతున్నాడు.

**స్వామివారు**
- మూలవరులు : కుడమాడుకూత్తన్
- ఉత్తరమూర్తులు : చతుర్భుజ గోపాలన్

**అమ్మవారు**
- మూలవరులు : అమృతఘటవల్లీ తాయార్
- ఉత్సవమూర్తులు : అమృతఘటవల్లీ తాయార్


**స్థలవృక్షము** : పురసమార వృక్షము
**పుష్కరిణి** : కోటి తీర్థము, అమృత తీర్థము
**విమానం** : ఉచ్చశృంగ విమానము
**ప్రత్యక్షం** : ఉదంక మహర్షికి
**ముఖము/స్థితి** : తూర్పు / కూర్చున్న సేవ
**మంగళాశాసనం** : తిరుమంగై ఆళ్వారు (10)

## స్థలపురాణం

వినత, కద్రువ ఇరువురు కశ్యపమహర్షి ధర్మపత్నులు. పెద్దభార్య వినత గరుత్మంతుని తల్లి, చిన్నభార్య కద్రువ నాగమాత. వినతని తన దాసిగా చేసుకోవాలనే దురుద్దేశంలో కద్రువ దేవేంద్రుని అశ్వమైన ఉచ్చైశ్రవం తోక నల్లనివర్ణం అని వినతతో వాదానికి దిగింది. వినత గుర్రంతోక తెల్లని వర్ణమే అని వాదించింది. కద్రువ కాదు నల్లనివర్ణమే అని నేను నిరూపిస్తే నీవు వాళ్లు నాకు దాస్యం చేయాలి. ఒకవేళ తోక తెల్లనివర్ణం కలదైతే నీకు మేమందరమూ దాస్యం చేస్తామని పందెం కట్టింది. ఈ పందెంలో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో కద్రువ తన కుమారుడైన కర్కోటకుణ్ణి పిలిచి ఉచ్చైశ్రవం తోకను బాగా చుట్టుకోమని చెప్పింది. అలా కద్రువ ఉచ్చైశ్రవం తోక నల్లనివర్ణమే ఉందని నిరూపించి వినతను దాసిగా చేసుకుంది. తర్వాత వినత దాస్యవిముక్తి కోసం కద్రువనే ఉపాయం అడిగితే ఆమె దేవలోకం నుండి అమృతాన్ని తీసుకొని వచ్చి తనకు అప్పగిస్తే విముక్తి కలిగిస్తానని చెప్పింది. తమ దాస్యాన్ని పోగొట్టుకోవడానికి గరుడుడు దేవలోకానికి వెళ్లి, అక్కడ అనేక ఆటంకాలను ఎదుర్కొని అమృతకలశాన్ని సాధించి తన తల్లికి, తనవాళ్లకు దాస్యవిముక్తి కలిగించాడు. మాయావి అనే అసురుడు అమృతకలశాన్ని అపహరించి పరిగెత్తడం ప్రారంభించగా భగవంతుడు ఒక బాణాన్ని సంధించగ అది తగిలి ఆ అసురుని చేయి ఖండించబడి ఈ అమృతకలశం అరిమేయవిణ్ణగరమ్ అనే దివ్యదేశంలో పడి అమృతంపారి అదే అమృతపుష్కరిణిగా అయింది.

ఉదంకమహర్షి తన భార్య ప్రభతో కలిసి స్నానం చేస్తుండగా ఆమె కొట్టుకుపోయింది. ఇందుకు బాధపడుతున్న ఉదంకుడికి అరిమేయవిణ్ణగరమ్ ఉత్సవమూర్తి గోపాలకృష్ణుడు నాలుగుభుజాలతో సాక్షాత్కరించి మహర్షి భార్య ప్రభ ముక్తిని పొందింది అని తెలియజేసి మహర్షి బాధను పోగొట్టాడు.

పాంచరాత్రాగమోక్తంగా పూజలందుకునే ఈ దేవదేవుణ్ణి సేవించిన వారికి భగవంతుని శ్రీపాదాలందు తప్ప ఎక్కడా దాస్యముండదు.





తిరుమల తిరుపతి దేవస్థానములు

# కనకధారాస్తవం

'కనకధారాస్తవం' పారాయణ చేయడం ద్వారా లక్ష్మీదేవి కటాక్షం శీఘ్రంగా లభిస్తుంది. దారిద్ర్య బాధల నుంచి విముక్తి కలుగుతుంది. అష్టలక్ష్ముల సమష్టి రూపమైన మహాలక్ష్మీదేవి అనుగ్రహం ద్వారా దైనందిన జీవితంలో భోగభాగ్యాలు కలగటంతో పాటు శాశ్వతమైన విష్ణులోకప్రాప్తి మహాలక్ష్మి అనుగ్రహంద్వారా కలుగుతుంది. అదే నిజమైన సంపద. అదే నిజమైన లక్ష్మీకటాక్షం.

అంగం హరేః పులక భూషణ మాశ్రయన్తీ
భృంగాంగనేవ ముకుళాభరణం తమాలమ్,
అంగీకృతాఖిల విభూతి రపాంగలీలా
మాంగల్యదాస్తు మమ మంగళదేవతాయాః 1

తాత్పర్యం: మొగ్గలతో శోభిల్లే కానుగు చెట్టును ఆడు తుమ్మెద ఆశ్రయించినట్లుగా, కానుగువృక్షం మాదిరి చల్లనివాడూ, నల్లనివాడూ అయిన శ్రీ మహావిష్ణువు యొక్క ఆనందం వల్ల ఏర్పడిన గగుర్పాటుతో కూడిన శరీరాన్ని మంగళదేవత అనే సార్థక నామాన్ని ధరించిన శ్రీమహాలక్ష్మి ఆశ్రయించి ఉంది. ఆమెకు విష్ణు వక్షస్థలమే నివాస భూమి కదా! అట్టి సకలైశ్వర్యాలకూ నిలయములైన ఆ జగజ్జనని కరుణా కటాక్ష వీక్షణాలు నా మీద ప్రసరించి నాకు శుభాలిచ్చు గాక!!

ముగ్ధా ముహుర్విదధతీ వదనే మురారేః
ప్రేమత్రపా ప్రణిహితాని గతాగతాని,
మాలాదృశో ర్మధుకరీవ మహోత్పలే యా
సా మే శ్రియం దిశతు సాగరసంభవాయాః 2

తాత్పర్యం: నల్లకలువ మీద ఆడు తుమ్మెద ప్రీతితో వ్రాలినట్లు శ్రీమహాలక్ష్మి యొక్క సుందరమైన చూపులు ప్రణయంచేత తన నాథుడైన నారాయణుని చూచుటకు ముందుకు సాగుతున్నాయి. ఆయన తన్ను చూచినప్పుడు సిగ్గుతో ఆమె చూపులు వెనుకకు మరలుతున్నాయి. ఈ రీతిగా ప్రణయం చేత, ఆయన తన వైపు చూడనప్పుడు ప్రియుణ్ణి వీక్షిస్తూ, ఆయన చూపులు తన మీదికి వ్రాలినప్పుడు లజ్జతో వెనుకకు మరలుతున్న ఆ కలుముల చెలి కంటి చూపులు నా మీద ప్రసరించి నాకు సిరిసంపదలు అనుగ్రహించుగాక!

విశ్వామరేంద్రపదవిభ్రమ దానదక్షం
ఆనంద హేతు రధికం మురవిద్విషోఽపి,
ఈషన్నిషీదతు మయి క్షణ మీక్షణార్థం
ఇందీవరోదర సహోదర మిందిరాయాః 3

తాత్పర్యం: నల్లకలువ పూవు లోపలి భాగంవలె నల్లని కాంతితో విలసిల్లు శ్రీ మహాలక్ష్మి యొక్క క్రీగంటి చూపు సమస్త స్వర్గ సామ్రాజ్యాధిపత్యాన్ని తన భక్తులకు అనుగ్రహించడానికి శక్తి గలిగి ఉంది. ఆ చూపు మురాంతకుడైన శ్రీ మహావిష్ణువునకు సైతం మిక్కిలి ఆనందాన్ని కలిగిస్తుంది. అట్టి ఇందిరాదేవి యొక్క అరవిరిసిన కనుచూపు నాయందు త్రుటికాలం ఒకింత నిల్చియుండుగాక!

ఆమీలితాక్ష మధిగమ్య ముదా ముకుంద
మానంద కంద మనిమేష మనంగతంత్రమ్,
ఆకేకర స్థిత కనీనిక పక్ష్మనేత్రం
భూత్యై భవే న్మమ భుజంగశయాంగనాయాః 4

తాత్పర్యం: ఇంచుక మూసుకొన్న కన్నులుగల వాడూ, ఆనందానికి ఆధారమైనవాడూ అయిన నారాయణుని ప్రీతితో పొంది, రెప్పపాటు లేనిదీ, మదనపరవశమైందీ, అర మూసిన కనురెప్పలు గలదీ అయిన ఓరగంటితో సిగ్గు బరువున స్వామిని వీక్షిస్తున్న రమాదేవి యొక్క నేత్రదృష్టి నాకు సంపదలు ప్రసాదించుగాక!

కాలాంబుదాళి లలితోరసి కైటభారేః
ధారాధరే స్ఫురతి యా తటిదంగనేవ,
మాతు స్సమస్తజగతాం మహనీయమూర్తిః
భద్రాణి మే దిశతు భార్గవనందనాయాః 5

తాత్పర్యం: మేఘమందు మెరుపుతీగ విలసిల్లిన చందంగా వానాకాలం మబ్బు మాదిరి నల్లని శరీరచ్ఛాయగల శ్రీమహావిష్ణువు యొక్క వక్షస్థ ్సలంలో ఏ జగజ్జనని రూపం వెలిగిపోతోందో ఆ మహాలక్ష్మియొక్క మంగళస్వరూపం నాకు శుభాలను ప్రసాదించుగాక!

బాహ్వాంతరే మురజితః శ్రితకౌస్తుభేయా
హారావళీవ హరినీలమయీ విభాతి,
కామప్రదా భగవతోఽపి కటాక్షమాలా
కల్యాణ మావహతు మే కమలాలయాయాః 6

తాత్పర్యం: ఏ జగజ్జనని యొక్క కడగంటి చూపులు కౌస్తుభమణిని ధరించినవాడూ, ఐదుతలలుగల మురాసురుణ్ణి సంహరించిన వాడూ అయిన శ్రీమహావిష్ణువు యొక్క వక్షస్థ్సలంలో ఇంద్రనీల మణిహారాల శోభను వెలయిస్తున్నవో అట్టి ఆ నారాయణి యొక్క కరుణాకటాక్షవీక్షణాలు నాకు మేలు చేకూర్చు గాక!!

ప్రాప్తం పదం ప్రథమతః ఖలు యత్ప్రభావాత్
మాంగల్యభాజి మధుమాథిని మన్మథేన,
మయ్యాపతే త్త దిహ మంథర మీక్షణార్థం
మందాలసం చ మకరాలయ కన్యకాయాః. 7

తాత్పర్యం: శ్రీమహాలక్ష్మి కటాక్షవీక్షణ మహిమ వల్ల మధువను రాక్షసుణ్ణి నిర్మూలించిన నారాయణమూర్తి సమస్త సన్మంగళాలకూ నిలయుడైనాడు. అనురాగభరితమైన ఆ దేవేరి దృష్టి తన మీద వ్రాలడం వల్లనే కామపరవశుడై జగద్రక్షణ కార్యం ఆయన చక్కగా నిర్వర్తిస్తున్నాడు. వాడివేడిలేని ఆ దేవి యొక్క తిన్నని క్రీగంటి చూపు నా మీద ప్రసరించి నన్ను కృతార్థుని కావించు గాక!

దద్యా ద్దయానుపవనో ద్రవిణాంబుధారాం
అస్మిన్న కించన విహంగశిశౌ విషణ్ణే,
దుష్కర్మఘర్మ మపనీయ చిరాయ దూరం
నారాయణ ప్రణయినీ సయనాంబువాహః. 8

తాత్పర్యం: చాతకపక్షిపిల్ల ఎండవేడిమికి తాళలేక తల్లడిల్లగా వాయుప్రేరితమై మేఘం వర్షించి ఆ పక్షికూన తాపంబాపి, వాన చినుకులచే దప్పికదీర్చి, తృప్తి కల్గించిన విధంగా, శ్రీమన్నారాయణ మూర్తి ప్రియురాలైన ఇందిరాదేవి యొక్క కటాక్షమనే కారుమబ్బు కారుణ్యమనే గాలిచే ప్రేరితమై బహుకాలార్జితమైన దుష్కర్మ అనే తాపాన్ని దవ్వులకు తరిమి, ధనమనే వానగురిసి నేను అనే చాతక శిశువుకు సంతృప్తి కల్గించుగాక!

ఇష్టా విశిష్టమతయోఽపి యయా దయార్ద్ర
దృష్ట్యా త్రివిష్టప పదం సులభం లభన్తే,
దృష్టిః ప్రహృష్ట కమలోదరదీప్తి రిష్టాం
పుష్టిం కృషీష్ట మమ పుష్కరవిష్టరాయాః. 9

తాత్పర్యం: స్వర్గలోకసుఖం కలిగించే యజ్ఞయాగాదులైన శుభకర్మలు ఆచరించడంలో మనసులేని వారైనప్పటికిని శ్రీమహాదేవి దృష్టి తమపై ప్రసరించగానే మానవులు అనాయాసంగా స్వర్గపదవిని పొందగల్గుతున్నారు. అట్టి పద్మ గర్భం యొక్క కాంతివంటి కాంతి గల్గిన శ్రీమహాలక్ష్మి కడగంటి చూపులు నాకు ఐశ్వర్యసమృద్ధిని సమకూర్చుగాక!

గీర్దేవ తేతి గరుడధ్వజ సుందరీతి
శాకంభరీతి శశిశేఖర వల్లభేతి,
సృష్టిస్థితి ప్రళయకేళిషు సంస్థితాయా
తస్యై నమ స్త్రిభువనైకగురో స్తరుణ్యై. 10

తాత్పర్యం: లోకాలను సృష్టించే వేళ బ్రహ్మభార్యభారతి అనీ, రక్షణ సమయాన నారాయణుని పత్నియైన నారాయణి అనీ, మరియు కాలస్వరూపిణియైన శాకంభరి అనీ, ప్రళయకాల మందు శంభు రాణియైన గౌరియనీ పేరొంది, ముజ్జగంబుల నేలు మురహరుని యిల్లాలు శ్రీ మహాలక్ష్మికి నమస్కారాలు సల్పుతున్నాను.

శ్రుత్యై నమోఽస్తు శుభకర్మ ఫల ప్రసూత్యై
రత్యై నమోఽస్తు రమణీయ గుణార్ణవాయై,
శక్త్యై నమోఽస్తు శతపత్ర నికేతనాయై
పుష్ట్యై నమోఽస్తు పురుషోత్తమ వల్లభాయై. 11

తాత్పర్యం: యజ్ఞయాగాది పుణ్యకర్మలన్నింటికి ప్రయోజనం సమకూర్చు వేదస్వరూపిణి అయిన శ్రీమహాలక్ష్మికి నమస్కారం. వాత్సల్య, కారుణ్య, సౌశీల్యాది సద్గుణాలకు సముద్ర మగుచు, ఆనంద స్వరూపిణి అయినట్టి శ్రీమహాలక్ష్మికి చేతులు జోడిస్తున్నాను. తామరలం దుండెడు ముద్దరాలు, శక్తి స్వరూపిణి అయిన ఇందిరా దేవికి అభివందనం. పరమపురుషుడైన శ్రీమహావిష్ణువునకు ప్రియురాలై, సర్వసమృద్ధితో నొప్పు భార్గవికి ప్రణామం.

నమోఽస్తు నాళీక నిభాననాయై
నమోఽస్తు దుగ్ధోదధి జన్మభూమ్యై,
నమోఽస్తు సోమామృత సోదరాయై
నమోఽస్తు నారాయణ వల్లభాయై. 12

తాత్పర్యం: శ్రీమహాలక్ష్మి పద్మంతో సమానమైన ముఖం గలది. ఆమె జన్మించిన చోటు క్షీరసముద్రం. పాలకడలి యందు జన్మించిన చంద్రునితో, అమృతంతో పాటు ఆమె కూడ జన్మించింది. కనుక ఆమె చంద్రసుధాసహోదరి. ఆమె శ్రీమన్నారాయణునకు ప్రియురాలు. అట్టి జగజ్జననికి నమస్కారం.

దారిద్ర్యమోచన స్తోత్రంలో లక్ష్మీదేవి పద్మ అని, పద్మాలయ అని, పద్మప్రియ అని, పద్మహస్త అనీ, పద్మాక్షి అని, పద్మసుందరి అని, పద్మోద్భవ అని, పద్మముఖి అని, పద్మమాలాధర అని, పద్మిని అని, పద్మగంధిని అని కీర్తించబడింది. ఆమె ముఖాదులకు పద్మంతో సామ్యం చెప్పడం వల్ల శైత్యసౌరభ్యాలకు ఆమె స్థాన మని వర్ణించినట్లైంది. చంద్రుని తోబుట్టువు అని చెప్పడం వల్ల

ఆమె పరమాహ్లాదకరురాలనీ, అమృతసహోదరి అని పేర్కొనడం వల్ల, ఆమెనెంత సేవించినా తనివితీరదని, ఆమె పుట్టిన చోటు రత్నాకరమనడం వల్ల ఆమె ఆదిగర్భేశ్వరీత్వత్వాన్ని ప్రశంసించి నట్లయింది.

నమోఽస్తు హేమాంబుజ పీఠికాయై
నమోఽస్తు భూమండల నాయికాయై,
నమోఽస్తు దేవాది దయాపరాయై
నమోఽస్తు శార్ఙ్గాయుధ వల్లభాయై. 13

తాత్పర్యం: బంగారు తామరగద్దెపై కూర్చుండు మహాలక్ష్మికి వందనము. భూవలయానికి నాయకురాలైన మహాదేవికి నమస్సు. దేవతలు మున్నగు సాధువర్గమునందు కారుణ్యము గల్గిన ఆ చల్లని తల్లికి కైమోడ్పు. శార్ఙ్గమను ధనుస్సును ధరించు విష్ణుదేవుని ప్రియురాలగు శ్రీలక్ష్మికి నమస్కృతి.

నమోఽస్తు దేవ్యై భృగునందనాయై
నమోఽస్తు విష్ణోరురసి స్థితాయై,
నమోఽస్తు లక్ష్మ్యై కమలాలయాయై
నమోఽస్తు దామోదర వల్లభాయై. 14


తాత్పర్యం: భృగుమహాముని పుత్రికయు, విష్ణువు యొక్క వక్షఃస్థలంలో నెలకొన్నదియు, పద్మాసనాసీనురాలు, యశోదాదేవి చేతరోటికి కట్టి వేయబడ్డ కేశవుని ప్రియురాలగు లక్ష్మీదేవికి వందనాలాచరిస్తున్నాను.

నమోఽస్తు కాంత్యై కమలేక్షణాయై
నమోఽస్తు భూత్యై భువన ప్రసూత్యై,
నమోఽస్తు దేవాదిభి రర్చితాయై
నమోఽస్తు నందాత్మజ వల్లభాయై. 15

తాత్పర్యం: నళిన దళాలవంటి నయనాలు గలది, తేజస్స్వరూపిణి, లోకాలకు కన్నతల్లి, సంపత్స్వ రూపిణి, దేవతలు మొదలగు వారి చేత పూజింపబడునది, నందగోపుని పుత్రుడైన శ్రీకృష్ణునకు ప్రియురాలు అయిన శ్రీమహాలక్ష్మికి నమోవాకాములర్పిస్తున్నాను.

సంపత్కరాణి సకలేంద్రియ నందనాని
సామ్రాజ్యదాననిరతాని సరోరుహాక్షి
త్వద్వందనాని దురితాహరణోద్యతాని
మామేవ మాత రనిశం కలయంతు మాన్యే. 16

తాత్పర్యం: పద్మపత్రాలవంటి కన్నులు గల తల్లీ! నీకు సలుపు నమస్కారాలు సమస్త సంపదలను సమకూరుస్తాయి. అన్ని యింద్రియాలకు ఆనందం కల్గిస్తాయి. సామ్రాజ్య వైభవాలను అనుగ్రహిస్తాయి. పాపాలను నిశ్శేషంగా రూపుమాపుతాయి. పూజ్యురాలవైన



ఓ మాతా! నీ చరణాలకు వందనాలు సమర్పిస్తున్నాను. నన్ను కృతార్థుణ్ణి కావించు.

యత్కటాక్షసముపాసనావిధిః
సేవకస్య సకలార్థ సంపదః,
సంతనోతి వచనాంగమానసైః
త్వాం మురారి హృదయేశ్వరీం భజే. 17

తాత్పర్యం: అమ్మా! శ్రీమహాలక్ష్మీ! నిన్ను కొలిచేవారికి నీ కృపాకటాక్ష వీక్షణాలు సకలార్థములనూ సంప్రాప్తింపజేస్తాయి. శ్రీహరి ప్రాణ నాయికవైన తల్లీ! నిన్ను మనోవాక్కాయములనే త్రికరణాల చేత సేవిస్తున్నాను. నన్ను అనుగ్రహించు.

సరసిజనయనే సరోజహస్తే
ధవళతమాంశుక గంధమాల్య శోభే,
భగవతి హరివల్లభే మనోజ్ఞే
త్రిభువన భూతికరి ప్రసీద మహ్యమ్. 18

తాత్పర్యం: తామరరేకులవంటి కండ్లుగలదీ, తామరమొగ్గ చేత ధరించినదీ, మిక్కిలి తెల్లని జిలుగు వలువ కట్టినదీ, మేనగంధపు పూతతో, మెడలో పూలదండలతో విరాజిల్లునట్టిదీ, మనస్సునకు ఇంపుగొలుపు అందచందాలు గలదీ, ముజ్జగాలకు సిరిసంపదల నొసంగునట్టిదీ, జ్ఞానబలైశ్వర్యవీర్యశక్తి తేజస్సులనే ఆరు గుణాలతో వెలుగొందునదీ, శ్రీమన్నారాయణమూర్తికి జీవితేశ్వరి అయిన ఓ మహాలక్ష్మీ! నన్ను అనుగ్రహించు తల్లీ!

దిగ్ఘస్తిభిః కనక కుంభ ముఖావసృష్ట
స్వర్వాహినీ విమలచారుజలప్లుతాంగీమ్.
ప్రాత ర్నమామి జగతాం జననీ మశేష
లోకాధినాథగృహిణీ మమృతాబ్ధి పుత్రీమ్. 19

తాత్పర్యం: ఐరావతాది దిగ్గజాలు ఆకాశగంగానదీ జలాలను కనక కలశాలతో కొనివచ్చి తమ తొండాలతో అభిషేకించగా తడిసిన సకలావ యవములు గలదియూ, జగాలన్నింటికీ జననియూ, సమస్తలోకాలకు ప్రభువైన శ్రీమహావిష్ణువు యొక్క ఇల్లాలును, క్షీరసాగరపుత్రియూ అయిన శ్రీమహాలక్ష్మిని ఉదయాన్నే నమస్క రిస్తున్నాను.

కమలే కమలాక్షవల్లభే త్వం
కరుణాపూరతరంగితై రపాంగైః,
అవలోకయ మా మకించనానాం
ప్రథమం, పాత్ర మకృత్రిమం దయాయాః. 20

తాత్పర్యం: పద్మపత్రాలవంటి నేత్రాలుగల శ్రీమన్నారాయణమూర్తికి ప్రియురాలవైన ఓ కమలాంబికా! నా మనవి ఆలకించు. నేను దరిద్రులలో అగ్రేసరుణ్ణి. నీ కృపకు అన్ని విధాలా అర్హుణ్ణి. ఇట్టినన్ను దయారసం తొణికిసలాడే నీ కడగంటి చూపులతో నన్ను కనుగొని ధన్యుణ్ణి గావించు.

స్తువంతి యే స్తుతిభి రమూభి రన్వహం
త్రయీమయీం త్రిభువనమాతరం రమామ్,
గుణాధికా గురుతరభాగ్య భాజినో
భవంతి తే భువి బుధభావితాశయాః. 21

తాత్పర్యం: ఎవ్వరు ప్రతిదినం వేదస్వరూపిణి, ముజ్జగాలకు తల్లి అయిన లక్ష్మీదేవిని ఈ స్తోత్రంతో స్తుతిస్తున్నారో వారు అధిక సద్గుణ సంపన్నులు, పరమ భాగ్యోపేతులు అయి ఈ పుడమిలో పండితుల పశంసలకు పాత్రులౌతున్నారు.

సువర్ణధారాస్తోత్రం యచ్ఛంకరాచార్య నిర్మితమ్,
త్రిసంధ్యం యః పఠేన్నిత్యం స కుబేర సమో భవేత్. 22

తాత్పర్యం: ఎవరు శంకరభగవత్పాదాచార్యులచే రచించబడ్డ ఈ కనకధారా స్తోత్రాన్ని ఉదయ మధ్యాహ్నసాయం కాలాలందు చదువుతారో వారు నవనిధులకు నాయకుడైన కుబేరుడితో సమానులు కాగలరు.

## గద్యం

ఇతి శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య వర్యస్య శ్రీమచ్ఛంకర భగవతః కృతిషు కనకధారాస్తోత్రం సంపూర్ణమ్.

సంపద్యుక్తుడు, పరమహంస పరివ్రాజకాచార్యవర్యుడగు శ్రీశంకరభగవత్పాదుల రచనలందలి ఈ కనకధారాస్తోత్రం ముగిసింది-

శ్రీవావిళ్లవారు ప్రచురించిన కనకధారాస్తవంలో- తాళపత్ర లిఖిత గ్రంథాలలోనివని వారు సేకరించి ప్రచురించిన అధికపాఠ శ్లోకాలు ఈ క్రిందివి.

బిల్వాటవీ మధ్యలసత్సరోజే
సహస్రపత్రే సుఖసన్నివిష్టామ్,
అష్టాపదాంభోరుహ పాణిపద్మాం
సువర్ణవర్ణాం ప్రణమామి లక్ష్మీమ్. 1

తాత్పర్యం: బిల్వవనం నడుమ సహస్రదళ శోభితమైన పద్మంలో హాయిగ కూర్చుండి యున్నదియూ, కనక కమలం పద్మంవంటి తనచేత ధరించినదియూ, పసిడివంటి దేహకాంతిగలది అగు రమాదేవికి నమస్కరిస్తున్నాను.

కమలాసన పాణినా లలాటే
లిఖితా మక్షరపంక్తి మస్య జంతోః,
పరిమార్జయ మాత రంఘ్రిణా తే
ధనిక ద్వార నివాస దుఃఖ దోగ్ధ్రీమ్. 2

తాత్పర్యం: అమ్మా! ధనవంతుల వాకిళ్ల ముందు నిలబడి యాచిస్తూ వారిచ్చే డబ్బుతో బ్రతుకుమని ఈ ప్రాణి నొసట బ్రహ్మదేవుడు వ్రాసిన వ్రాతను నీ కాలితో తుడిచి ధన్యుణ్ణి చేయుము.

అంభోరుహం జన్మగృహం భవత్యా
వక్షస్థలం భర్తృగృహం మురారేః,
కారుణ్యతః కల్పయ పద్మవాసే
లీలాగృహం మే హృదయారవిందమ్. 3

తాత్పర్యం: అమ్మా! నీ పుట్టిల్లు పద్మం. మెట్టినిల్లు శ్రీమన్నారాయణుని వక్షఃప్రదేశం. ఆ విధంగానే కనికరంతో నా హృదయపద్మాన్ని నీవు క్రీడాగృహంగా చేసుకో తల్లీ!

# శ్రీగోవిందరాజస్వామివారి ఆలయం

– శ్రీ వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు

**ఈ నెల 16న బ్రహ్మోత్సవాలు ప్రారంభం...**

శ్రీగోవిందరాజస్వామివారు అచింత్య దివ్యయవ్వన స్వభావలావణ్యాతిశయంతో ఆదిశేషునిపై శయనించి ఉన్నట్లుగా గర్భాలయంలో ప్రకాశిస్తూ ఉంటారు. దక్షిణదిక్కున శిరస్సు, ఉత్తరదిక్కున పాదాలు ఉండి శంఖచక్రాది ఆయుధాలతో చతుర్భుజుడై నాభికమలం నుండి బ్రహ్మ బయటకు రాగా శిరస్సున కిరీటిధారియై స్వామిఉండగా, ఆదిశేషుడు ఛత్రంవలే ఉండి నీడనిస్తూ ఉండగా శ్రీభూదేవేరులు పాదసేవ చేస్తున్నట్లుగా ఉంటారు. మధుకైటభులు తమ రాక్షస భావం నుండి విముక్తులై స్వామిని ప్రార్థిస్తున్నట్లు ఉంటారు. **ఈ ఆలయం తిరుపతి రైల్వేస్టేషనుకు అతి సమీపం లోనూ, ఆర్.టి.సి. బస్టాండుకు ఒక కిలోమీటరు దూరంలోనూ ఉంది.**

## ఆలయచరిత్ర

విజయనగరకాలంనాటి వాస్తు శిల్పశైలి ఈ ఆలయంలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. సాళువ వంశరాజుకాలంలో ఆలయం బాగా అభివృద్ధి చెందింది. 1239 సంవత్సరంలో వీరనరసింగ యాదవరాయల భార్య ఈ ఆలయరథం మరమ్మతుల కోసం కొన్ని కానుకలు సమర్పించింది. 1506 సంవత్సరంలో ఈ ఆలయం సర్వాంగసుందరంగా తీర్చిదిద్దబడింది.

ఈ ఆలయానికి మూడు ప్రధాన గోపురాలు ఉన్నాయి. ప్రధానంగా బయట ఉన్న ఆలయగోపురం పెద్దది, ప్రాచీనమైంది కూడా. తర్వాత రెండుగోపురాలు పురాతనమైనవి. రామాయణ, భారత, భాగవత సన్నివేశాలు ఉన్న శిల్పాలు గోపురాలపై చెక్కబడ్డాయి.

చిదంబరక్షేత్రంలో గల శ్రీ గోవిందరాజస్వామిరూపంలో ఉన్న మహావిష్ణువు యొక్క ఆలయ విగ్రహాలు మత వైషమ్యాలలో ధ్వంసంకాగా అర్చకులు ప్రాణభయంతో పారిపోయి అతికష్టంపై ఉత్సవ విగ్రహాన్ని తీసుకొని తిరుపతిలో ఉన్న శ్రీరామానుజాచార్యులవద్దకు వచ్చి రక్షించమని ప్రార్థించారు. శ్రీరామానుజులు తిరుపతిలో గల శ్రీ పార్థసారథి ఆలయప్రాంతమే సరైన ప్రదేశమని భావించి అక్కడ ఆలయ నిర్మాణంచేసి శ్రీగోవిందరాజస్వామివిగ్రహాన్ని భద్రపరచి సుధావిగ్రహాన్ని తయారుచేసి ప్రతిష్ఠించారు.

తిరుపతిలో ముఖ్య అర్చకులు ఆచార్య పరిచారకులు, వర్తకులు నివాసం ఉండడం వల్ల, యాత్రికులకు భోజన సదుపాయం రామానుజకూటాలు, మఠాలు అన్నం విక్రయశాలలు శ్రీగోవిందరాజస్వామివారి ఆలయానికి అనుబంధంగా ఉండటం వల్ల, శ్రీగోవిందరాజస్వామివారిఆలయం కారణంగా తిరుపతినగరం ప్రాముఖ్యత సంతరించుకుంది.

శ్రీరామానుజులు చిదంబరంలో శ్రీమహావిష్ణువునకు ఏవిధంగా పూజలు జరిగేవో తిరుపతిలో శ్రీగోవిందరాజస్వామి వారికి కూడా అదే సంప్రదాయంతో అర్చనాదులు జరిగే విధంగా కొన్ని నియమాలు ఏర్పాటు చేశారు. ఫాల్గుణమాసంలో ఉత్తరఫల్గుణీ నక్షత్రంలో శ్రీగోవిందరాజస్వామివారివిగ్రహప్రతిష్ఠ జరిగినట్లు ఐతిహ్యం. వీరనరసింహరాయలరాణి శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో అఖండ దీపం వెల్గించుటకుగాను 32 గోవులను సమర్పిస్తూ ఒక దానశాసనం వేశారు.

1234 సంవత్సరంలో ఈ రాయలరాణి పైడిపల్లి గ్రామాన్ని ఆలయాలకు సమర్పిస్తూ ఆ గ్రామ ఆదాయం సగభాగం రాబడిని తిరుమల శ్రీవారి ఆలయ అభివృద్ధికి మిగిలిన సగభాగం గోవిందరాజస్వామివారికి సర్వమాన్యం క్రింద సమర్పించినట్లు శాసనం. 1219వ సంవత్సరంలోనే లోపలి గోపురం నిర్మాణం జరిగింది.



శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలోని జయ-విజయద్వారపాలకుల ప్రతిష్ఠ 1549 సంవత్సరంలో నంద్యాల నారాయణప్ప గావించాడు. వేదాంతదేశికుల సన్నిధికి సమీపంలో గల నాలుగుకాళ్లమంటపం 1494లో నిర్మించారు.

జయవిజయులకు ముందున్న మంటపమే చిత్రకూట మంటపం, దాన్ని 1493లో నిర్మించారు. ఈ ఆలయంలోనే తిరుమంగైఆళ్వార్ సన్నిధి 1234వ సంవత్సరంలో, గోదాదేవి సన్నిధి 1254వ సంవత్సరంలో నిర్మించారు. 1495వ సంవత్సరం నుండి గోదాదేవికి ప్రతి శుక్రవారం అభిషేకం జరిగేవిధంగా కట్టడి ఏర్పడింది. ఈ ఆలయంలోనే శ్రీ నమ్మాళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్, మధురకవి ఆళ్వార్, శ్రీరామానుజసన్నిధి, కూరత్తాళ్వాన్ సన్నిధి సాలై నాచ్చియార్ అనే పుండరీకవల్లీతాయారు సన్నిధి ఉన్నాయి.

## ఎత్తైన గాలిగోపురం

తూర్పుముఖంగా ఉన్న శ్రీగోవిందరాజస్వామివారి ఆలయానికి ముందు ఎత్తైన రాజగోపురం చక్కని శిల్ప సౌందర్యంతో నిర్మితమైంది. ఇది తిరుపతి నగరానికే ఒక శోభాయమానం. దీన్ని మట్ల అనంతరాజు నిర్మించినట్లు తెలుస్తోంది. గోపురం ఎత్తు సుమారు 100 అడుగులు ఉండవచ్చు. ఈ గోపురంపై 11 కలశాలు బంగారుతాపడంతో



ప్రతిష్ఠింపబడ్డాయి. భక్తులు ఈ గోపురం ద్వారా ప్రవేశించే ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది.

## భక్త ఆంజనేయస్వామి ఆలయం

శ్రీగోవిందరాజస్వామివారిఆలయం సన్నిధివీధి ఆరంభంలో అభిముఖంగా శ్రీభక్తఆంజనేయస్వామివారు శ్రీగోవిందరాజస్వామికి నమస్కరిస్తున్నట్లుగా ఏడడుగుల ఎత్తున విగ్రహం ఉంది. ఈ ఆంజనేయస్వామివారి ఆలయంలో మహామండపం, ముఖమండపం, గర్భగృహం, వేసరరూపంలో విమాన నిర్మాణం చేయబడింది. ఈ ఆంజనేయస్వామికి ప్రతి రోజు ఆరాధనలు, నివేదనలు శ్రీగోవిందరాజస్వామివారి అర్చన అనంతరం వైఖానసశాస్త్రరీత్యా జరుపబడతాయి.

## ఆలయవర్ణన

శ్రీగోవిందరాజస్వామివారి ఆలయం విశాల ప్రాంగణంలో ఉంది. 11 కలశాలతో ప్రతిష్ఠించబడిన మొదటి గోపురం దాటి రెండవగోపురం వద్దకు రాగానే ఒక చిన్న కోనేరు ఉంది. దీన్నే బుగ్గ అంటారు. ఈ బుగ్గమీద శ్రీగోవిందరాజ స్వామివారికి బుగ్గోత్సవాలు జరుగుతాయి.

ఆగ్నేయభాగంలో లక్ష్మీమండపం ఉంది. ఇక్కడే పూర్వం ఊంజల్‌సేవ జరుపబడేది. ఆ తరువాత తొమ్మిది కలశాలతో అలరారుతున్న రెండవగోపురం దాటి లోపలకు ప్రవేశించగానే ఉత్తరాభిముఖంగా పుండరీకవల్లీ తాయారు దర్శనమిస్తారు. ఆమె గోవిందరాజస్వామివారి పట్టపురాణి. ఈమెనే శాలినాచ్చియార్ అని కూడా అంటారు. ఆలయముఖ మండపముపై అష్టలక్ష్ములు దర్శనమిస్తారు.

ఏడు కలశాలతో అతి సుందరంగా నిర్మింపబడ్డ మూడవ రాజగోపురం దాటి లోపలికి ప్రవేశించగానే ఆలయానికి ఆగ్నేయభాగంలో ఆరోహణమంటపం, ఈశాన్యభాగంలో అవరోహణమంటపం దర్శనమిస్తాయి.

ఉత్తరభాగంలో శ్రీగోవిందరాజస్వామివారు జయ విజయద్వారపాలక సంరక్షకులుగా గరుత్మంతుడు అభిముఖంగా ఉండి దర్శనమిస్తారు. అటు బయట బంగారుతాపడంతో ధ్వజ స్తంభ బలిపీఠాలు ఉండగా, స్వామి గర్భాలయంలో శ్రీభూదేవేరులు పాదసేవ చేస్తుండగా నాభికమలంలో బ్రహ్మ, అలాగే పాదాలకు కాస్త అవతల మధుకైటభులు స్వామిని సేవిస్తూండగా



పట్టుపీతాంబరాలతో చక్కని సుగంధ పుష్పమాలలను ధరించి శయనమూర్తియై మనకు స్వామి దర్శనమిస్తారు. స్వామివారి ఆలయవిమానం చతురస్రంగా ద్వితలరూపంలో ఐదు కల శాలతో నాగరశైలి రూపంలో సుందరంగా నిర్మితమైంది.

గోపురాలకు అభిముఖంగా పార్థసారథిస్వామి ఆలయం, ఈ ఆలయానికి దక్షిణభాగంలో ఆండాళ్అమ్మవారిసన్నిధి ఆగ్నేయంలో పాకశాల దక్షిణంలో శ్రీవరదరాజస్వామి ఆలయం, తిరుమంగైయాళ్వార్ల సన్నిధి, చందనపు అర, శ్రీభూసమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దివ్య ఉపాలయం, నైఋతిలో యాగమంటపం దర్శనమిస్తాయి. శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారి ముఖమండపానికి కల్యాణమండపం అని ప్రసిద్ధి. ఈ కల్యాణమండపంలో ఆళ్వార్ ఆచార్యాదుల శాత్తుమొఱలు సకల వైదిక కార్యక్రమాలు, అభిషేకసేవలు వైభవంగా జరుగుతూ ఉంటాయి. వెనుక వైపు ఊంజల్ సేవామండపం సర్వాంగ సుందరంగా కనువిందు చేస్తుంది. శ్రీవారి పాదాలు ఉగ్రాణం ధ్వజస్తంభ అభి ముఖంగా వ్యాసాంజనేయస్వామి సన్నిధి ఉన్నాయి.

ఈశాన్యంలో పశ్చిమాభిముఖంగా మణవాళమహామునుల సన్నిధి, దక్షిణాభి ముఖంగా వేదాన్తదేశికుల సన్నిధి దర్శన మిస్తాయి.

## ఆలయ సేవలు, ఉత్సవాలు


ఆళ్వారాచార్యాదుల ఉత్సవాలు వారి జనన మాస తిరు నక్షత్రాల్లో పదిరోజులపాటు వైభవంగా శాత్తుమొఱలతో నిర్వహిస్తారు.

చైత్రమాసంలో(మార్చి, ఏప్రిల్) ఉగాదిఆస్థానం జరుగు తుంది. వృషభమాసంలో అనురాధనక్షత్రానికి ముగిసే విధంగా శ్రీగోవిందరాజస్వామివారికి బ్రహ్మోత్సవాలు వైభవంగా తొమ్మిది రోజులపాటు జరుగుతాయి.

తరువాత మాసంలో వచ్చే ఉత్తరఫల్గుణీ నక్షత్రం నాడు పుష్పయాగం జరుగుతుంది. భాద్రపదమాసంలో పవిత్రోత్సవాలు మూడురోజులపాటు వైభవంగా జరుగుతాయి.

మాఘమాసంలో పూర్ణిమకు పూర్తయ్యేవిధంగా ఏడు రోజులు తెప్పోత్సవాలు, మకరమాసంలో అధ్యయనోత్సవాలు జరుగుతాయి.

ఆషాఢమాసంలో మూడురోజుల పాటు జ్యేష్ఠాభిషేకం అష్టోత్తర శతకలశస్నపనంతో జరుపబడుతుంది. ఆండాళ్ అమ్మవారికి కటకమాసంలో పూర్వఫల్గుణినక్షత్రంరోజు పూర్తయ్యే విధంగా పదిరోజులపాటు తిరువాడిప్పూరం ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ధనుర్మాసంలో ఏడురోజులపాటు నీరాట్టోత్సవం వైభవంగా జరుగుతుంది. ఫాల్గుణమాసంలో ఉత్తర ఫల్గుణి నక్షత్రంనాడు పూర్తయ్యేవిధంగా ఏడురోజుల పాటు శాలినాచ్చియార్ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.





తిరుమలలో వలె రథసప్తమి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. సంవత్సరకాలంలో సుమారుగా 300 రోజుల పాటు అనేక ఉత్సవాలు గోవిందరాజస్వామివారి ఆలయంలో వైభవంగా జరుగుతాయి.

## ఊంజలసేవ

స్వామివారి ఆలయ ప్రాంగణంలో వెనుకభాగంలో ఉన్న అద్దాలమండపంలో ప్రతినిత్యం సాయంత్రం 5.30 నుండి 6.00 గంటల మధ్య ఊంజల్‌సేవ జరుపబడుతుంది.



## ఆలయంలో నిత్యపూజలు

ప్రతిరోజూ సుప్రభాతసేవ ఉ॥5-00 గం॥లకు, సర్వ దర్శనం ఉ॥5-30 గం॥లకు, తోమాల సేవ ఉ॥6-30 గం॥లకు, సహస్ర నామార్చన ఉ॥7-00 గం॥లకు, మొదటిగంట నివేదన శాత్తుమొర ఉ॥9-00 గం॥లకు, మధ్యాహ్న కాలార్చన, నివేదన మ॥12-30 గం॥లకు, సాయంఆరాధన, తోమాల, నివేదన సా॥5-00 గం॥లకు, ఏకాంతసేవ రా॥9-00 గం॥లకు జరుపబడతాయి.


## నైమిత్తికపూజలు

ఉత్తరానక్షత్రంరోజు శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు, ఏకాదశి తిథిన పరివార దేవతలకు, రోహిణీనక్షత్రంరోజు పార్థసారథిస్వామికి, శుక్రవారం రోజు ఆండాళ్ అమ్మవారికి, శ్రవణా నక్షత్రం రోజు కల్యాణవేంకటేశ్వరస్వామివారికి, శుక్ర వారం పుండరీకవల్లీ అమ్మవారికి, ఎదురు ఆంజనేయ స్వామివారికి ఆదివారం, గరుడాళ్వారుకు సోమవారం, మఠం ఆంజనేయస్వామివారికి శనివారం, అభయ ఆంజనేయస్వామివారికి మంగళవారం అభిషేకాలు జరుగుతాయి.

సంవత్సరానికి నాలుగురోజులు కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం జరుపబడుతుంది. ఫాల్గుణపూర్ణిమరోజున శ్రీగోవింద రాజస్వామివారికి వైభవంగా పూలంగిసేవ జరుగుతుంది.

## పుష్కరిణి

శ్రీగోవిందరాజస్వామివారి ఆలయానికి బయట కొద్ది దూరంగా ఈశాన్యంలో పుష్కరిణి నిర్మితమైంది. మధ్యలో నీరాళి మంటపం కూడా అత్యంతప్రాచీన పద్ధతిలో నిర్మింపబడింది. ఈ పుష్కరిణిలో మాఘపూర్ణిమకు పూర్తయ్యేవిధంగా ఏడురోజుల పాటు శ్రీకోదండరామస్వామికి, శ్రీపార్థసారథిస్వామికి, శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి, శ్రీగోదాకృష్ణులకు, శ్రీగోవిందరాజస్వామికి తెప్పోత్సవాలు వైభవంగా జరుగుతాయి.



ఈ పుష్కరిణీతీరంలో ప్రతిరోజూ సాయంత్రం తి.తి.దే. హిందూ ధర్మప్రచారపరిషత్ ద్వారా హరికథ, సంగీతకచేరి, ఉపన్యాస కార్యక్రమాలు జరుపబడతాయి. భక్తులు ఈ కార్య క్రమాలలో పాల్గొంటారు.

(ముఖచిత్ర కథనం)

గృహలక్ష్మి

# వెలుగును ప్రసాదించే వ్రతం

**- శ్రీ భక్తికా దేవిదాసి**

వైశాఖమాసంలోని శుక్లపక్షంలో వచ్చే మోహినీ ఏకాదశి మహిమను సూర్యపురాణం వివరించింది. ఈ ఏకాదశీ మాహాత్మ్యాన్ని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వివరించాడు.

ఒకసారి శ్రీరాముడు సీతాదేవి వియోగంతో మిక్కిలి వేదనకు గురై సమస్తపాపాలను, దుఃఖాలను పోగొట్టే ఒక వ్రతాన్ని గురించి తనకు వివరించమని వశిష్ఠుణ్ణి అడిగాడు. అప్పుడు వశిష్ఠుడు శ్రీరామునితో "రామచంద్రా! నీ ప్రశ్న సకల మానవాళికి లాభదాయకమైంది. కేవలం నీ మంగళకర నామాన్ని జపించడం చేతనే మానవులు పవిత్రులై సమస్తశుభాల్ని పొందగలుగుతారు. అయినా సాధారణ మానవుల లాభం కొరకు నేను ఒక మహావ్రతాన్ని వివరిస్తాను. శ్రీరామా! వైశాఖ శుక్లపక్ష ఏకాదశి, మోహినీ ఏకాదశిగా ప్రసిద్ధి చెందింది. అది ఎంతో మంగళకరమైంది. ఆ ఏకాదశిని పాటించడం ద్వారా మనుషుల సమస్తపాపాలు, దుఃఖాలు పటాపంచలవుతాయి. దానికి సంబంధించిన పరమ మంగళకరమైన కథను ఇపుడు విను" అన్నాడు.

పవిత్ర సరస్వతీనదీతీరంలో భద్రవతి అనే సుందరమైన నగరం ఉండేది. దాన్ని ద్యుతిమానుడనే చంద్రవంశపురాజు పాలించేవాడు. అతడు సత్యసంధుడు. అదే నగరంలో ధనపాలుడనే విష్ణుభక్తుడు కూడ జీవించేవాడు. ఆయన ఎన్నో సత్రాలను, విద్యాలయాలు, విష్ణుమందిరాలు, వైద్యశాలలు, విశాలమైన రహదారులు నిర్మింపజేశాడు, మంచినీటిబావులు త్రవ్వించాడు, ఉద్యానవనాలు ఏర్పాటు చేశాడు, ఆహారవసతి కల్పించాడు. ఈ విధంగా ధనాన్ని సద్వినియోగపరచి అతడు తన పేరు నిలబెట్టుకున్నాడు. ఈయనకు శమనుడు, ద్యుతిమానుడు, మేధావి, సుకృతి, ధృష్టబుద్ధి అనే ఐదుగురు పుత్రులు ఉన్నారు. వారిలో ధృష్టబుద్ధి పరమపాపి, చెడుప్రవర్తన కలిగినవాడు, వేశ్యాసాంగత్యం జూదం, మద్యపానం అతని అలవాట్లు. ఇతర ప్రాణులను హింసించడమంటే అతనికి ఎంతో ఆనందం. అతడు తండ్రి ధనాన్ని దుర్వినియోగం చేసేవాడు. ఇదంతా గమనించిన ధనపాలుడు కొడుకును ఇంటి నుండి తరిమేశాడు. ఇలా తల్లిదండ్రులు, బంధుమిత్రుల ప్రేమను, ఆదరణను కోల్పోయిన ధృష్టబుద్ధి తన వస్త్రాభరణాలు అమ్ముకుని కొంత కాలం తన పాపకార్యాలు కొనసాగించాడు. ఆ ధనం కూడా ఖర్చయిపోగానే కష్టాలు ఆరంభమైనాయి. ఆహారం కూడా కరువైంది.

ధృష్టబుద్ధి ఇక చేసేదిలేక చివరకు దొంగతనాలకు సిద్ధపడ్డాడు. ఒక్కొక్కసారి రక్షకభటులకు చిక్కినా అతని తండ్రి గొప్పతనాన్ని చూసి వారు అతణ్ణి వదలేసేవారు. ఒకసారి మాత్రం దొంగతనం చేసి పట్టుబడ్డాడు. రాజు అతనికి దేశ బహిష్కరణ శిక్ష విధించాడు. దేశబహిష్కరణ శిక్షకు గురియైన ధృష్టబుద్ధి ఒక కీకారణ్యంలో ప్రవేశించి ఆకలిదప్పులకులోనై విచక్షణారహితంగా పశువులను, పక్షులను చంపి పచ్చి మాంసాన్ని తింటూ ప్రాణిహింస అనే పాపం చేస్తూ అనేక సంవత్సరాలు గడిపాడు.

ఒకరోజు ధృష్టబుద్ధి కౌండిన్యఋషి ఆశ్రమంలో ప్రవేశించాడు. అది వైశాఖమాసం. ఆ ఋషి గంగానదిలో స్నానం చేసి అప్పుడే ఆశ్రమానికి తిరిగి వస్తున్నాడు. దైవవశంగా ఆ ఋషి వస్త్రం నుండి ఒక నీటిచుక్క ధృష్టబుద్ధి మీద పడింది. దాంతో అతని సమస్తపాపాలు నశించాయి. వెంటనే పరివర్తన కలిగిన ధృష్టబుద్ధి, ఆ మునికి నమస్కరించి తన పాపాలకు ప్రాయశ్చిత్తం తెల్పమని ప్రార్థించాడు. అతని మాటలు విన్న కౌండిన్యఋషి కరుణాంతరంగుడై–వైశాఖమాసం శుక్లపక్షంలో వచ్చే మోహినీఏకాదశి మేరుపర్వతమంత పాపరాశినైనా నశింపజేస్తుంది. కనుక ఆ ఏకాదశిని నీవు శ్రద్ధతో ఆచరించు అని చెప్పాడు.

ధృష్టబుద్ధి ఆ మహర్షి ఉపదేశించిన విధి ననుసరించి మోహినీఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించాడు. ఆ వ్రత పాలనంతో అతడు సమస్తపాపదూరుడై తదనంతరం దివ్య దేహాన్ని పొంది గరుడవాహనం మీద వైకుంఠానికి వెళ్లాడు.

ఈ ఏకాదశీవ్రతం మాయను తొలగించి అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తుంది. తీర్థస్నానం, దానం, యజ్ఞాచరణం వల్ల కలిగే పుణ్యరాశియైనా ఈ మోహినీఏకాదశి వ్రతం ఆచరించడం వల్ల కలిగే పుణ్యంతో సరిపోలదు.



# దండాలు పెడితే గండాలు కాచే తల్లి


– డా॥ ఆకెళ్ల విభీషణశర్మ

పౌరాణికప్రసిద్ధి, చారిత్రకప్రసిద్ధి గల తిరుపతిలో జరిగే ఉత్సవాలలో 'తాతయ్యగుంట గంగమ్మ జాతర' ఒకటి. ప్రతి సంవత్సరం మే నెలలో ఏడురోజులపాటు ఈ గంగమ్మ జాతర జరుగుతుంది. ఈ జాతర పౌరాణికప్రసిద్ధి అనడానికి ముఖ్యకారణం, గంగమ్మ తిరుమల వేంకటేశ్వరస్వామి చెల్లెలు. తిరుమలేశుని ఆలయం నుండి తిరుమల తిరుపతి దేవస్థానాల అధికారులు జాతరజరిగే రోజుల్లో, శనివారంనాడు గంగమ్మకు పుట్టింటి సారెగా పట్టుశేష వస్త్రాలు, పసుపుకుంకుమలు, గంపలు, చేట మొదలైన మంగళ ద్రవ్యాలు సమాదరంగా తెచ్చి బహూకరిస్తారు.

తాతయ్యగుంట గంగమ్మ ఆవిర్భావానికి పరంపరాగతమైన కథ ముడిపడి ఉంది. ఒకప్పుడు తిరుపతి చిన్నగ్రామం. ఈ గ్రామాన్ని ఒక పాలెగాడు పాలించేవాడు. తాను చెప్పేదే న్యాయమని, తాను ఆచరించిందే ధర్మమని విర్రవీగే మనస్తత్వం అతనిది. అధికారగర్వంతో, కామాంధకారంతో ప్రవర్తించేవాడు. తన ఏలుబడిలో ఏ అమ్మాయికి పెళ్లయినా భర్తతో సంసారం మొదలెట్టడానికి ముందు తనతో గడపాల్సిందే అని హుకుం జారీచేశాడు. పెదవి విప్పలేని, ఎదురు మాట్లాడ లేని నిస్సహాయులు లోలోన బాధపడి మనసార అమ్మలగన్నయమ్మకు మొక్కేవారు. ఈ ప్రార్థనల ఫలితంగా తిరుపతి సమీపంలోని అవిలాలగ్రామంలో అవతరించిన, 'ఆది పరాశక్తి' పాలెగాని పాపానికి భరతవాక్యం పలకాలనుకుంది. సాటి మహిళలకు జరిగే అన్యాయానికి తానే శిక్ష వేయాలనుకుంది. తానే ఒకరికి భార్య అయింది. పాలెగాని ఇంటికి వెళ్లింది. తన శక్తి స్వరూపాన్ని సాక్షాత్కరింపజేసింది. పాలెగాడు బెదరిపోయాడు. తన్ను రక్షించుకోవడానికి తక్షణం ఇల్లు వదలి పారిపోయాడు. అలా పారిపోయినవాణ్ణి వెదకి వెదకి చంపాలని శక్తి అనుకుంది. పాలెగాడు శక్తి కంటపడక పరుగెత్తాడు. అపుడా శక్తి ఒక వేషంతో గాక, రోజుకో వేషంతో అన్వేషణ కొనసాగించింది. లోకంలో తిట్లకు ఎవడయినా ఎదురు తిరుగుతాడని, తానే తిడుతూ అతని కోసం అన్వేషణ కొనసాగించింది. ఇలా ఏడు రోజులు గడిచాయి. చివరకు తాతయ్యగుంట దగ్గర పాలెగాణ్ణి పట్టుకొని సంహరించింది. అలా సంహరించిన కాలం తమిళమాసం చిత్తిరైనెల.

గ్రామానికి పట్టిన పీడ విరగడం కావడంతో గ్రామస్థులు అక్కడే ఉండి తమను కాపాడమని ప్రార్థిస్తే ఆ పరాశక్తి గంగమ్మగా



తాతయ్యగుంట దగ్గర వెలసింది. కనుక తాతయ్యగుంట గంగమ్మగా ప్రసిద్ధి ఏర్పడింది. ఈ వీరోచిత సంఘటనకు సాక్ష్యంగా తిరుపతిలో ఏడురోజులపాటు వివిధ వేషాలతో గ్రామీణసంస్కృతి ఉట్టిపడేలా జాతరలు జరుగుతున్నాయి. తిరుపతిలో జరిగే గంగమ్మ జాతరలాగా దేశంలో ఎక్కడగాని ఇతరత్రా ఎక్కడా జరగడం లేదు. రోజుకో వేషం, తిట్లతో వీథుల్లో తిరగడం, ఎవరికైనా వింత అనిపిస్తుంది. అయితే వీటికి అంతరార్థాలున్నాయి.


మొదటిరోజు **'బైరాగి'** వేషం. నాలుగుపురుషార్థాలలో చివరిదైన మోక్షం చివరిది. మోక్షం సిద్ధించాలంటే మనిషి విరాగి కావాలి. కనుకనే 'బైరాగి' వేషం. విరాగి సంసారంలో తామరాకుపై నీటిబొట్టులా ఉంటాడు. అలా ఉండాలని సందేశం.

రెండవరోజు **'బండ'** వేషం. బండ కదలిక లేనిది. 'ఎన్ని కష్టాలు వచ్చినా, నిందలుపడినా అవన్నీ శరీరానికే గాని మనస్సుకు కాదు'. అని భావించడం సహిష్ణుత్వం. ఇదే ఈ వేష ప్రయోజనం.

మూడవరోజు **'తోటి'** వేషం. ఈ వేషాన్ని కైకాల కులస్థులు స్త్రీ వేషధారణతో తమ భక్తిని ప్రదర్శిస్తారు. చాకలివాడు పురుషవేషధారణ చేస్తాడు. తోటివాడు వృత్తిధర్మంగా తన పనులు చేసినా అతనిది మానవ సేవ. ఈ సేవాభావం సాటి ప్రజలు అలవరచుకోవాలని సందేశం.

నాల్గవరోజు **'దొర'** వేషం. ఈ వేషాన్ని కూడా కైకాల, చాకలి కులస్థులే వంశపారంపర్యంగా వేస్తారు. కైకాలవారు దొరవేషం వేస్తే చాకలివాడు మంత్రి వేషం వేయడం ఆనవాయితి.

ఐదవరోజు **'సున్నంకుండలు మోసే వేషం'**. కైకాలవారు సున్నం కుండ నెత్తి మీద పెట్టుకుని సేవించడం జాతరలో ఆచారం. కుండ శరీరానికి సంకేతం. కుండకు చుట్టిన మల్లెపూలు సద్భావనలకు గుర్తు. పసుపుచీర కల్యాణప్రదత్వానికి, వాద్యఘోషలు మంగళవాక్కులకు సంకేతం.







చిత్రసౌజన్యం: గోపినాథ్ ఆర్ట్స్












ఆరవరోజు **'మాతంగి'**వేషం. మాతంగి వేయికళ్లదేవత. వేయికళ్ల విష్ణువులాగా గంగమ్మకూడా విశ్వరూపిణి అనే భావన.

ఏడవరోజు **'సప్పరాల'** వేషం. గోపురాల్లాంటి సప్పరాలను మోయడం. ఇది అద్వైతభావనకు సంకేతం. కామక్రోధాదులు తనలో రాకుండా, ప్రవేశించకుండా రక్షించమని అంతరార్థం. వీటితోబాటు **'పేరంటాల'** వేషం మంగళవారం నాడు. ఈ వేషాన్ని కైకాలవారు వేస్తారు.

చినగంగమ్మ, ఆపై పెదగంగమ్మ రూపాల చెంపలు నరకడంతో జాతరకు మంగళం. ఇలాంటి గంగమ్మ ఆకార నిర్మాణంలో రెడ్లు, ఆచారులు, రజక, కుమ్మరి, తోటివారు సహకరిస్తారు. గంగమ్మ బొమ్మ తయారీలో దళితులు, కుమ్మరి, కంసాలి, నాయీబ్రాహ్మణ, యాదవవంటి మిరాశిదార్లు కూడా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారు.




కైకాల కులస్థులు అమ్మవారి విశ్వరూపాన్ని భిన్నపరిచిన తరువాత ఆ మట్టిని భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వీకరిస్తారు. తరువాత తమ తమ స్వగృహాలకు తీసుకెళ్లి వారి వారికున్నటువంటి అనారోగ్యనివారణ కోసం, అభివృద్ధికోసం, అనేకసమస్యల నివృత్తి కోసం భద్రపరుస్తారు.



ఈ గంగజాతరవేళ అశేషప్రజానీకం రకరకాల మొక్కుబడులు చెల్లించుకోవడం ఆనవాయితీ.

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర జరిగే రోజుల్లో భక్తులు బండబూతులాడడమేమిటని చూచేవారు ముందు ఆశ్చర్యపోతారు. ఇందుకు కారణాలున్నాయి.

భారతంలో దుర్యోధనుడు తనవారందరు చనిపోయినా చివరకు ప్రాణభీతితో మడుగులో దాక్కున్నాడు. అతణ్ణి ఎలా పైకి రప్పించాలో తెలియకపోతే చివరకు అతని పౌరుషాన్ని అవహేళన చేసేలా ఎత్తిపొడిచారు. తిట్లకు ఓర్వలేని మానధనుడైన రారాజు మన్యుగుణంతో మడుగునుండి వచ్చాడు. భీముని చేతిలో దుర్గతిని పొందాడు. ఇది విరోధిపై ప్రయోగించే తిట్ల బాణం. తన కళ్లబడకుండా దాగిన పాలెగాణ్ణి ఉసిగొలిపి బయటికి రప్పించే ఒక ఉపాయం.

ఏది ఏమైనా గంగమ్మ తిరుపతి గ్రామాధిదేవత. ఈ ఆలయం క్రమక్రమంగా అభివృద్ధి అవుతున్నది.


ఇందులో భాగంగా భక్తుల కోరికపై తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం యంత్ర, విగ్రహ, శిఖర కలశ, స్థిర ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవం 01-05-2023 నుండి 05-05-2023 వరకు నిర్వహించింది. ఇందుకు తిరుమలేశుని సహకారం కొండంత. పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ కంచికామకోటి పీఠాధిపతులు, జగద్గురువులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్రసరస్వతీస్వామివారి అమృతహస్తాలచే ఈ మహా కుంభాభిషేకం పరిపూర్ణమైంది.

గ్రామసంరక్షణకూ, మశూచి మొదలగు వ్యాధుల నివారణకూ, దుష్టశక్తులను రానీయకుండడానికి, క్రిమికీటకాదుల వల్ల వింతవింత వ్యాధులనుండి సంరక్షించడానికి, వర్షాలు కురిసి పొలాలు పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండడానికీ, పంటలకు తెగుళ్ల సోకకుండా ఉండడానికి, ఇలా అనేకరకాల శుభ ఫలితాలకోసం ఈ గంగమ్మకు జాతర చేయడం ఆచారంగా ఏర్పడింది. కొలిచేవారికి కొంగుబంగారం- ఈ వరాల కల్పవల్లి, జాతరవేషాలు వేసే భక్తులకు- ఆనందమిచ్చే అమృతవల్లి.

తాతఅనంతళ్వాన్ల చెరువున వెలసిన- "కరుణా" రసవల్లి.

*ఈ తిరుపతి గంగమ్మతల్లిని సేవిద్దాం!*
*సుఖసంతోషాదులతో జీవిద్దాం!!*

నూతన ధారావాహిక ప్రారంభం......



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

శ్రీరంగం, తిరుమల, కాంచీపురం, తిరునారాయణపురం (మేల్కోటే), ఈ నాలుగు దివ్యక్షేత్రాలు యతిరాజు శ్రీరామానుజాచార్యుల ఉనికి, సాంగత్యంవల్ల మరింత విశిష్టతను సంతరించుకున్నాయి. మొదటి మూడు క్షేత్రాలు అనాదినుండి వెలసి ఉన్నా, నాల్గవదైన తిరునారాయణపురం(మేల్కోటే), యదుశైలం, రామానుజులకాలంలోనే వెలుగులోకి వచ్చింది.

1078లో మతాంధులైన చోళరాజులు శ్రీవైష్ణవులను పీడించినప్పుడు రామానుజులు హొయసలరాజ్యంలోని యదుశైలంవద్ద ఆశ్రయం పొందారు. శ్రీమన్నారాయణుని కల్యాణ గుణగానం చేస్తూ, ఆళ్వారుల, ఆచార్యుల జ్ఞానబోధలను అధ్యయనం చేస్తూ రామానుజులు మేల్కోటేలో పన్నెండు ఏళ్లు గడిపారు. ఈ సమయంలోనే వారు తమ స్వప్నదర్శనం కలిగించిన ప్రేరణతో, కొందరు ఆటవికులను కూడగట్టుకుని ఒక పుట్ట నుండి నారాయణమూర్తిని తవ్వి, వెలికి తీసి, పాంచరాత్రాగమ శాస్త్రానుసారం అక్కడ ఒక ఆలయంలో ప్రతిష్ఠ గావించారు. ఆ మూర్తిపట్ల శ్రీరామానుజులకున్న అమితమైన అనుబంధం వల్ల ఆ భగవానునిమూర్తికి రామానుజుల ముద్దుల కుమారుడని, 'చెలువనారాయణ' (సెల్వనారాయణ) లేక 'సంపత్కుమారు'లనే పేరు సార్థకమైందని చరిత్ర.

చెలువనారాయణమూర్తి పట్ల తమకున్న అనురాగానికి పరాకాష్ఠగా రామానుజులు తమ అంతిమకాలబోధలో శిష్యులనుద్దేశించి- 'శాస్త్రానుసారం శ్రీవైష్ణవునికి విధిగా నిర్దేశించిన నియమాలేవీ పాటించలేనినాడు కనీసం తిరునారాయణపురంలో ఒక పూరిగుడిసె వేసుకుని స్వామిని సేవించవలసింద'ని శిష్యుల్ని ఆదేశించారు. చోళరాజులు శ్రీవైష్ణవాచార్యులపట్ల చేస్తున్న అరాచకాల నుండి బయటపడటానికి శ్రీరామానుజాచార్యులు శ్రీరంగంనుండి మేల్నాడు (నేటి కర్ణాటక) వరకు చేసిన దివ్యయాత్రా వివరణ ఈ ధారావాహిక.

యతిరాజులయాత్ర శ్రీరంగం నుండి మొదలై, దివ్యక్షేత్రాలైన సాలిగ్రామం, రామనాథపురం, తొండనూరునుండి మేల్కొటే వద్ద ముగుస్తుంది.

రామానుజులు మొదటిసారి మేల్నాడు అడవులలో అడుగుపెట్టినప్పుడు వారిని శ్రీనల్లాన్ వంశజుల పూర్వీకుల ఆటవిక శిష్యబృందం స్వాగతించింది.

**ఈ యాత్రలో మనకు తారసపడే పాత్రలు**

1) సర్వజగద్రక్షకుడు, శ్రీమహాలక్ష్మి సమేత శ్రీమన్నారాయణుడు.

2) నారదమహాముని, హాహా, హూహూ తదితర గంధర్వులు, పుష్పకవిమానం.

3) పూజ్యులు శ్రీ శ్రీ రంగప్రియస్వామి: బెంగళూరు అష్టాంగ యోగ విజ్ఞానమందిర ఆచార్యసార్వభౌములు.

4) పూజ్యులు శ్రీ శ్రీ పరకాలజీయర్; మైసూర్ పరకాలమఠం మహాచార్యులు.

5) శ్రీవిల్లిపుత్తూరు శ్రీ శ్రీ శఠగోప రామానుజ జీయర్: వీరు ప్రస్తుతం మేల్కోటేలో వేంచేసి యున్నారు.

6) శ్రీ శ్రీకరస్వామి: శ్రీకరస్వామి ఉత్తముడైన శ్రీవైష్ణవుడు. తొండనూరు వాస్తవ్యులు. ఆయన పూర్వీకులు ఇదివరలో శ్రీరంగంలో పరంపరానుగతంగా గొప్ప ఆచార్యపదవులను అలంకరించారు.

**7)** విద్యావంతులై ఉండి, మంచిసంపాదన వచ్చే లౌకికవృత్తులను త్యజించిన 'భట్టర్'లు, అంటే భగవత్, భాగవతసేవ కోసం అర్చకవృత్తులను చేపట్టిన మహానుభావులైన సత్పురుషులు దివ్యక్షేత్రాలలో మనకు అడుగడుగునా తారసపడతారు.

## 2) శ్రీ వైకుంఠం

అసంఖ్యాకులైన దేవతలు నారాయణుని దర్శనార్థులై శ్రీవైకుంఠం వచ్చి ఉన్నారు. యక్ష, కిన్నర గంధర్వాదులతో వైకుంఠం మరింత దేదీప్యమానమై కళకళలాడుతోంది. ఇంతలో రావల్సిన భాగవతోత్తముడు, భక్తాగ్రేసరుడు నారదమహాముని గానకైంకర్యం చేస్తూ అక్కడికి వచ్చాడు.

అందరి వంక తేరిపారా చూస్తూ గంధర్వుల నుద్దేశించి, "ఈ మధ్య మీరేమైనా భూలోకానికి వెళ్లి వచ్చారా?" అనడిగాడు. అందరూ వెళ్లలేదని చెప్పగా ఇటీవలే తాను భూలోక సంచారం సలిపానని, భూప్రపంచమంతటా ఎన్నెన్నో మార్పులు సంభవించాయని, అక్కడి వాతావరణంలో తీవ్రత ఊహించ శక్యం కానంతగా హెచ్చిందని, పర్యావరణంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందని, పర్యవసానంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయని చెబుతూ– "అవన్నీ సరే గాని, మీరంతా తొండనూర్ నంబినారాయణస్వామి అర్చామూర్తిని ఎప్పుడైనా దర్శించారా?" బొద్దుగా, తేజోవంతంగా, పాలుగారే పసివాడిలా ముద్దుగారే ముఖం ఆయనది.

'మేల్నాట(కర్ణాటకలో) వేంచేసియున్న సుందర గంభీర యోగనరసింహుని, దరహాసపూరితవదనుడైన తిరునారాయణ స్వామిని ఒక్కసారైనా కన్నులారా చూచారా? అక్కడి ఉత్సవ మూర్తి 'శెల్వపిళ్ళై' అని ఆత్మీయంగా పిలువబడే సంపత్కుమారుని, అధిష్ఠానదేవియైన జగన్మాత యదుగిరినాచ్చియార్, పేశుమ్ యతిరాజులను సేవించారా? ఆయన మీదనే నారాయణుడు శయనించి యున్నాడు కదా!" అని అన్నాడు.

*(ఇంకా ఉంది)*

## గ్రంథసమీక్ష

**ఆదిత్యమండలోదిత-ఆకాశ రహస్యం**

# అరుణపాఠం

**సంకలనం–** తాడేపల్లి యజ్ఞసత్యనారాయణ; **పుటలు–** 144; **వెల–** అమూల్యం; **ప్రతులకు–** శ్రీమతి తాడేపల్లి గిరిజ, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్, వెంకటరామన్నగూడెం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరిజిల్లా–534 102; **ఫోన్–** 89854 50644.

మానవుడు నిత్యజీవితంలో అనుసరించాల్సిన సదాచారాలతో నిండిన ఈ గ్రంథం శ్రీకృష్ణయజుర్వేదీయ ఆరణ్యకభాగంలోని 'అరుణపాఠం' అనే విభాగాన్ని ఆధారం చేసుకొని కూర్చబడింది. పూజ్యశ్రీ విద్యారణ్యులవారి భాష్య గ్రంథం ఆధారంగా సరళ గ్రాంథికంలో సాధారణ పాఠకులకు సైతం అవగాహన కలిగించే రీతిలో ఈ గ్రంథం కూర్చబడింది.

'సూర్యోమరీచిమాధత్తే సర్వస్మాద్భువనాదధి' ఈ మంత్రానికి గ్రంథకర్త అద్భుతమైన వివరణ అందించారు. సూర్యుడు విశ్వానికి ముందే తన కిరణసముదాయాలను సమస్తవ్యాపారాలకు కారణం అయ్యే రీతిలో కాంతులను ప్రసాదించాడు. ప్రాణులు జన్మించిన తర్వాత రసం, వీర్యం, వికారాదులతో సర్వప్రాణులు గ్రహించే రీతిలో సూర్యుడు తన కిరణాలను అనుగ్రహించాడు. సృష్టిక్రమపరిణతికి సూర్యుడు బీజం అని నిరూపింపబడింది.

సూర్యసంబంధమైన అనేక వైజ్ఞానికాంశాలు కూడ ఈ గ్రంథంలో వివరింపబడ్డాయి. సూర్యశక్తి చేత సాగర జలాలు ఆవిరిరూపంలో మేఘాలుగా ఏర్పడి వర్షమై భూమిని చేరుతాయి. భూమిని సస్యశ్యామలం చేస్తాయి.

'సూర్యుడు విశ్వాత్మ. సూర్య ఆత్మా జగతః కర్మసాక్షీ జగచ్చక్షుః' ఇత్యాది వేదమంత్రాలను సోదాహరణంగా వివరించిన ఈ గ్రంథం సూర్యోపాసన విధానాన్ని చక్కగా బోధిస్తుంది. ఇంతటి విశిష్ట ప్రయోజనం కలిగించే అరుణకేతుని గురించి తెలిసికొని, నిత్యజీవితంలో సూర్యభగవానుని పూజించి ఆయురారోగ్యభాగ్యాలు సంపాదించే విధివిధానాలను బోధించిన గ్రంథం అత్యంత ప్రయోజనవంతం. భావితరాలవారికి సనాతనధర్మవిశిష్టత అనే సంపదను గ్రంథకర్త అందించారు.

*–సారస్వతకళానిధి ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి*




# నీ లీల నెన్న తరమా? భక్త పారిజాతమా...

– డా॥ గంగిశెట్టి శివకుమార్, 94418 95343

ఎం.ఏ., చదివేటప్పుడు తరచూ మిత్రులతో కాలినడకన తిరుమల వెళ్లడం, శనివారం తెల్లవారుఝామునే శ్రీనివాసమంగాపురం వెళ్లడం సర్వసాధారణమైంది. తిరుచానూరు, గోవిందరాజస్వామిగుడులలో సాయంత్రాలు గడపడం నాకెంతో ఇష్టంగా ఉండేది. చదువయ్యాక తిరుపతిలోనే ఉద్యోగంచేయాలని, అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకోవాలని గాఢంగా కోరిక ఉండేది. అది తీరలేదు. గూడూరులో ఉంటూ కూడా కచ్చితంగా నెలకొకసారన్నా తిరుపతి రావడం, ఆలయాల సందర్శన, మిత్రులతో కాలక్షేపం జరపుతూ ఉండటం స్వామివారు నాకిచ్చిన వరం.

ఉపాధ్యాయుడిగా స్థిరపడడంతో మే నెలలో కుటుంబంతో సహా తిరుమలకు రావడం అలవాటుగా మారింది. ఒకసారి మే నెలలో కొండమీద విపరీతంగా రద్దీ ఉందని దినపత్రికలలో చదివి, నిదానంగా జూన్, జూలై నెలల్లో వెళదాం అనుకున్నాను, ఆ రోజు రాత్రి కల వచ్చింది. ఆ కలలో కొండవాలులో అనేక అద్భుతశిల్పాలున్నాయి. వీటినుంచి జలపాతం జాలువారుతోంది. దోసిలితో ఆ జలపాతం నీళ్లను నేను తాగుతున్నాను. వెనక నుంచి గొంతువిన్పించింది.




“రద్దీ ఏం లేదు, నువు వచ్చేయ్” అని గొంతు వినిపించింది. కానీ మనిషి కన్పించలేదు. తక్షణమే బయలుదేరి కుటుంబంతో సహా తిరుమల చేరుకున్నాను. సులభంగా దర్శనం అయింది. అంతా భగవంతుని కృప అని ఇప్పటికీ అనుకుంటుంటాను. అప్పటినుంచి తిరుమలకు రావాలనుకుంటే రద్దీ గురించి ఆలోచించను. వచ్చేస్తుంటాను. తిరుపతికి ఏ పనిమీద వచ్చినా శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి దర్శనం తప్పనిసరి.

స్వామివారు నన్ను అనుగ్రహించిన విషయం మరొకటుంది. నాలుగయిదేళ్లకిందట తి.తి.దే. హిందూ ధర్మప్రచారపరిషత్‌లో ధార్మికపుస్తకాలు రాయడం, ప్రచారకులకు శిక్షణనివ్వటంలో నాకు అవకాశం వచ్చింది. ప్రతినెలా తి.తి.దే. శ్వేతభవనంలో సమావేశమై, ఆ విషయాలు చర్చిస్తూ ఉండేవాళ్లం. ఉద్దండులైన మహాపండితులతో కొంత సమయం గడిపే వీలు, గ్రంథరచనలో పాల్గొనే సదవకాశం స్వామివారు నాకనుగ్రహించారు. చివరిరోజు కొండపై స్వామివారి దర్శనం, ప్రసాదం లభించేవి. ఇంతకంటే ఏంకావాలి.

అంతేగాక స్వామివారి ‘సేవ’ కార్యక్రమాలలో పాల్గొనే అదృష్టం కూడా కలిగింది. ఒకసారి గర్భగుడి వద్ద వాలంటీర్‌గా పనిచేయడం నా జీవితంలో మరచిపోలేని అనుభవం. ఆ సందర్భంగా కొండమీద నాలుగయిదురోజులు గడిపే భాగ్యం కూడా కలిగింది.

స్వామివారి కొండ, తిరునామాలు నా హృదయంలో స్థిరపడిపోయాయి. నేను ఉద్యోగరీత్యా ఎక్కడ ఉన్నా, నా మనసు తిరుపతిలోనే ఉంటుంది. భగవంతుడు కూడా నాయందే ఉండి నన్ను కాపాడుతూ ఉంటాడన్న నమ్మకంతో ఎల్లవేళలా నా ధర్మాన్ని నేను నెరవేరుస్తుంటాను. విశ్రాంతజీవితంలో కూడా నిత్యం స్వామివారిని తలచుకుంటూ తరిస్తూ ఉంటాను, ఆయన లీలలు ఎన్నని చెప్పగలం? ఎంతని చెప్పగలం? ఆయన భక్తుల పాలిట కల్పతరువు. ఒక సామాన్యకుటుంబంలో పుట్టిన నేను ఆయన పాదాలచెంత చదువుకుని ‘డాక్టరేట్’ పొందడం కంటే ఉదాహరణ ‘ఏం కావాలి’.



# ఎవరికైనా ఎప్పటికైనా అవసరమే!

– ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు,
78939 82500

వ్యక్తికి సంబంధించిన స్వభావాన్ని 'వ్యక్తిత్వ'మంటారు. ఈ వ్యక్తిత్వం మానవులలో ఏకరూపంలో కనిపించదు. ఒక కుటుంబంలోని వారిలోనే భిన్నభిన్న వ్యక్తిత్వాలు కన్పిస్తాయి. ఈ వ్యక్తిత్వవిభేదం ఒకే వృత్తిలోని వారిలోనూ లేకపోలేదు. అలాగే పుట్టుకనుండి మరణం దాకా వ్యక్తిత్వం ఒకే రూపంలో కూడా ఉండడం లేదు. మరి నేటి సమాజంలో 'వ్యక్తిత్వం' కలవాడని ఎవరిని గట్టిగా నిర్దేశించలేకపోతున్నాం. వీటికి కారణాలు అనేకం. సామాజిక పరిస్థితుల కనుగుణంగా సర్దుబాటు నెపంతో తమ తమ స్వభావాలను మార్చుకునేవారే ఎక్కువ. జనజీవనంలో పరిస్థితులకు రాజీపడలేనివారు మనసా బాధపడుతూ కుంగిపోతుంటారు. అయినా బాల్యం మొదలు మరణం దాకా ఆటంకాలు ఎదురవుతున్నా ఎదురొడ్డి నిలబడిన వారు గతంలోను ఉన్నారు, నేడు కూడా కొందరు లేకపోలేదు. ఐతే వారి సంఖ్య వేళ్లమీద లెక్కపెట్టవలసిందే. తాను నమ్మిన సిద్ధాంతాలకు తిలోదకాలివ్వక, బాధల అలల అలజడికి లోనుగాక పర్వతంలా స్థిరంగా నిలబడి తమ నిజాయితిని నిలబెట్టుకున్న ప్రాచీనులలో కవులు, గాయకులు ఎందరో ఉన్నారు. తెలుగు సాహిత్యం వరకు పరిశీలిస్తే వారిలో బమ్మెరపోతన, అన్నమయ్య, త్యాగయ్యలు ప్రముఖులని చెప్పవచ్చు.

అన్నమయ్య పుట్టింది ఆ బ్రాహ్మణకులంలో, బాల్యమంతా తిరిగింది పల్లెటూళ్లలో, ఉమ్మడికుటుంబంలో. అయినా అతనిది ప్రత్యేక వ్యక్తిత్వం. పసితనంలో తల్లులు, పిల్లలకు అన్నం పెడుతుంటే హాయిగా తింటారు. కానీ అన్నమయ్య అలాంటి వాడు కాదు. తల్లి "తిరుమలప్పని ప్రసాదం..." అని అంటేగానీ అన్నమయ్య తినేవాడు కాదు. ఇదొక ప్రత్యేక చిత్తప్రవృత్తి, అలాగే తల్లులు పిల్లల్ని నిదురపుచ్చడానికి రకరకాల జోలపాటలు పాడతారు. కానీ అన్నమయ్య వేంకటపతి ప్రస్తావన గల జోలపాట పాడితేనే కునుకు తీస్తాడట. జేజేలకు మొక్కుమని తల్లి ఆదేశిస్తే, కొండలప్పనికి మాత్రం మొక్కేవాడట. ఈ సన్నివేశాలన్నీ అన్నమయ్య బాల్యదశలోనే పొడసూపిన వ్యక్తిత్వ కాంతికిరణాలని చెప్పవచ్చు.

వ్యవసాయం ప్రధానమైన కుటుంబాలలో అందరూ పనిపాటలలో భాగం పంచుకోవడం సుమారు 40, 50 సంవత్సరాల ముందు సర్వత్రా కనిపించే దృశ్యాలు. అన్నమయ్య శైశవం అల్లారుముద్దుగా గడిచినా, బాల్యం అలాగే గడవలేదు. ఇంట్లోని వారు పిల్లలకు పనిపాటలు చెబుతుంటే, అన్నమయ్య విసుక్కునే వాడు. ఒకసారి ఆయన వదినమ్మ అడవికి వెళ్లి, పశువులకు గడ్డి కోసుకురమ్మని పురమాయించింది. అన్నమయ్య కొడవలి చేతబట్టి, అడవికేసి నడిచాడు. పచ్చనిగడ్డిని చూచాడు. కొడవలితో గడ్డికోయడం మొదలెట్టాడు. అలవాటులేని పని, ఒడుపు తెలియని బాలుడు కావడంతో కొడవలి పదునుతో కడవేలికి గాయమైంది. రక్తం స్రవించింది. పసితనంలో ఎవరికైనాసరే రక్తం కళ్లబడితే కళ్లు తిరుగుతాయి. గాయం కారణంగా ఏర్పడ్డ బాధ ఏడుపురూపంలో బహిర్గతమౌతుంది. సామాన్యులైతే వెనువెంటనే 'అమ్మా' అని ఏడుపు లంకించుకుంటారు. కాని సామాన్యబాలురకు భిన్నంగా అన్నమయ్య నోట "శ్రీహరీ... శ్రీహరీ" అనే మాటలే వినబడ్డాయి. ఇవన్నీ హరిభక్తుడౌతాడన డానికి సంకేతాలు. భక్తిమార్గంలో ఎన్ని అవరోధాలు వచ్చినా తట్టుకొని నిలబడగలడనే వ్యక్తిత్వసూచన.

వ్యక్తిత్వగుణంలో తలమానికమైంది 'స్వతంత్ర నిర్ణయం', అన్నమయ్య జీవితంలో తీసుకున్న నిర్ణయాలన్నీ ఒకరు చెప్పగా, బోధించగా నిర్ణయించుకున్నవి కావు. తనకు తానుగ తీసుకున్న నిర్ణయాలు. వాటిలో మొదటిది గడ్డికోసేవేళ, గాయం తగిలినవేళ తీసుకున్న నిర్ణయం. గృహమనే బంధంలో ఇరుక్కోదలచుకోని అన్నమయ్య, ఆడబోయే తీర్థం ఎదురైనట్లు, తిరుమలకు వెళ్లే యాత్రికులతో తాను వెళ్లిపోవడం ఇలాంటిదే. ఇలా చెప్పాపట్టకుండా వెళ్లడానికి నేపథ్యం– లోగడ తిరుమలకు వెళ్లివచ్చిన వారు, అక్కడి విశేషాలను, అనుభూతులను చెబుతుంటే చెవి ఒగ్గి విని ఉండడం. కొందరి కుతూహలం దౌడు తీసే గుర్రంలా ఉంటుంది. ఈ సంఘటన అంతర్గతమైన అన్నమయ్య కోరికకు మార్గనిర్దేశకత్వం చూపించినట్లైంది.

బాలుడైన అన్నమయ్య ఆ రోజుల్లో నడకమార్గాన వెళ్లడానికి ముందడుగు వేయడమే సాహసం. యాత్రికుల గుంపులో కొందరు తమ పిల్లల్ని భుజాల కెక్కించుకుంటారు. తల్లులు చంటిపిల్లవాళ్ల నెత్తుకుని నడక సాగిస్తుంటారు. ఇవన్నీ చాలవరకు రక్తసంబంధీకుల మధ్యనే. కాని అన్నమయ్యకు ఎవరూ ఆసరాలేరు. ఉరకలు వేసే ఉత్సాహంతో గుంపునుండి ఎక్కడ విడిపోతానో! అని అన్నమయ్య బిరబిర నడిచాడు. ఒకవైపు అలసట, మరోవైపు ఆకలి, పైగా పసిపిల్లలు ఎక్కడానికి వీల్లేనట్లుగా మోకాలి మిట్ట. యాత్రికుల గుంపు కదులుతున్నా అన్నమయ్య వెనకబడ్డాడు. యాత్రికులు ఎవరూ పట్టించుకోలేదు. చివరకు అన్నమయ్య శోషతో మోకాలిమిట్ట దగ్గర తూలిపోయి నిద్రబోయాడు. ఎవరూ పట్టించుకోని బాలుడైన అన్నమయ్యను అలమేలుమంగమ్మ పట్టించుకుంది. పెద్ద ముత్తైదువులా చేత అన్నప్రసాదంతో సాక్షాత్కరించింది. పసివాని ఒంటిపై మెల్లగా చేయి వేసి లాలిస్తూ నిద్రనుండి లేపింది. ఆ స్పర్శకు, పిలుపుకు అన్నమయ్య ఆశ్చర్యపడ్డాడు. పలకరించేవారు లేనిచోట ఆప్యాయం ఒలకపోసే పిలుపు అన్నమయ్యను కదలించింది. తన బాధను ఆ తల్లితో చెప్పుకోవాలనిపించింది.

అమ్మా! ఆకలి, ఆకలి. చాలా దూరం నడిచాను. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఈ పరిసరాల్ని కూడా చూడలేక పోతున్నాను. అమ్మా! నాకేమీ అక్కర్లేదు, ఏడుకొండలవాడిని, కందర్పజనకుడిని చూడాలనే ఒకే కోరిక. "నా కోరిక తీరే మార్గం చెప్పవమ్మా" అని ప్రాధేయపడ్డాడు అన్నమయ్య.



అపుడు అలమేలుమంగమ్మ అన్నమయ్యా! నీవు చెప్పుల కాళ్లతో ఈ కొండమీద నడవడం సంప్రదాయం కాదు. ఈ కొండంతా సాలగ్రామమయం. ముందు చెప్పులు వదలిపెట్టు. సింగారరాయని కళ్లారా చూద్దువు గానీ అని ఆదేశించింది. అన్నమయ్య అలాగే చేశాడు.

అన్నమయ్య కళ్లముందు మహావిష్ణువు దశావతారాలు సాక్షాత్కరించాయి. తిరుమలేశుని వైభవం పులకరింపజేసింది. ఆపై అలమేలుమంగమ్మ అన్నమయ్య మురిసిపోవడాన్ని గుర్తించి, శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని ఆప్యాయతతో తినిపించింది. అయాచితం, అనితరసాధ్యమైన శ్రీవారి ప్రసాదం బాలునికి దక్కడం విశేషం. ఆ ప్రసాదఫలమే అతని నాలుక నుండి కవితలుగా వెలువడ్డాయి. అపుడే అమ్మ మాయమైంది. వెంటనే అన్నమయ్య తనకు కలిగిన అనుభూతిని దృష్టిలో పెట్టుకుని "శ్రీ వేంకటేశ్వరా!" అనే మకుటంతో శతకం చెప్పాడని తాళ్లపాక చిన్నన్న తన తాతగారి చరిత్రలో స్పష్టంచేశాడు. లోకంలో ఎవరికైనా అయాచితంగా ఏర్పడే మధురానుభూతి మహత్ఫలాన్ని ఆవిష్కరింపజేస్తుందనడం సత్యమైంది. ఈ శతకరచన ఎగజిమ్మే నీటి బుగ్గలాంటిది.

టంగుటూరును (పెనుగొండ) పాలించే సాళువ నరసింహరాయల ఆస్థానంలో అన్నమయ్య తీసుకున్న ఒక నిర్ణయం, ఆ హరిభక్తుని చిత్తశుద్ధిని దీపితం చేస్తుంది. నరహరిమీద పాడిన కీర్తనలాంటి కీర్తన శృంగారపరంగా తనమీద పాడమని రాజు కోరినా, అన్నమయ్య ***"పరుల నుతింపగ నోపదు జిహ్వ..."*** అని ఖరాఖండిగా చెప్పాడు. రాచరికపు వ్యవస్థ బలంగా ఉన్న రోజుల్లో ఇలా చెప్పడం సామాన్యునికి ఏమాత్రం సాధ్యంకాదు. తన ఆజ్ఞ పాటించని వ్యక్తిని ఆ రోజుల్లో శిక్షార్హునిగా చేయడం కూడా రాజు చేసిన నేరం కూడా కాదు. అందువల్ల అన్నమయ్యకు సంకెళ్లు వేయించాడు. కారాగారంలో బంధించాడు. సభలో ఏ ఒకడుగానీ, రాజాజ్ఞను తప్పు పట్టకపోవడం ఆనాటి బలమైన రాచరికపు వ్యవస్థకు నిదర్శనం. అన్నమయ్య ***"ఆకటి వేళల అలపైన వేళ తేకువ హరినామమే దిక్కు"*** అని కారాగారశిక్షను అనుభవించాడు. చివరకు స్వామి అన్నమయ్యను ఆదుకొన్నాడు. సంకెళ్లు తెగాయి. అప్పటిదాకా అన్నమయ్యకు స్వామి అండ దండలున్నాయని రాజు గుర్తించలేకపోయాడు. ఈ సంఘటన అన్నమయ్య 'రాజసేవావిముఖత్వానికి' ఒక బలమైన సంకేతం. హరిభక్తులైన వారి విశ్వాసానికి ఈ ఘటన పెనుబలం. ఈ సన్నివేశం అన్నమయ్య వ్యక్తిత్వపరీక్షకు కీర్తికిరీటం.

అన్నమయ్య ఆలయకవి, అనుభూతికవి, భక్తికవి. అంతేకాదు. తత్త్వోపదేశం చేసిన సామాజికకవి.

బాలనీతి

# నీటిని గౌరవించాలి


– శ్రీమతి నల్లాని రాజేశ్వరి,
99086 02443

"కర్దముడు ప్రజాపతులలో ఒకడు. అప్రమేయమైన ఆత్మశక్తి కలవాడు. అతని కొడుకు శుచిష్మంతుడు. బాల్యంలో తోడిబాలురతో కలిసి, 'అచ్ఛోదం' అనే సరసిలో జలక్రీడాలోలుడై ఉండగా, ఒక మొసలి పట్టుకుని, లోనికి ఈడ్చుకుని పోయింది. అదిచూచి, తోడిబాలురు బెదిరి పరుగెత్తిపోయి, దేవార్చనా సమయంలో ధ్యాననిష్ఠలో ఉన్న అతని తండ్రికి ఆ దుర్వార్త చెప్పారు. విన్నాడేకాని ఈశ్వరధ్యాననిష్ఠ నుంచి మనస్సును మళ్లించక, మరింత దృఢదీక్షలో మగ్నుడై కర్దముడు విచిత్ర దృశ్యాలు చూశాడు.

బ్రహ్మాండాలు, భువనాలు, భూతాలూ, సూర్య చంద్రులు, అంతర్ద్వీపాలు, నానాదేవజాతులు, వారిస్థానాలు, వాపీకూపతటాకాలూ, చెరువులూ, క్షేత్రాలూ స్పష్టంగా కనిపించాయి. ఒకసరస్సులో మునికుమారులతో మునిగి తేలుతూన్న కొడుకు, వాణ్ణి ఒకమొసలి చంద్రుణ్ణి రాహువు పట్టినట్టు పట్టుకున్నట్టు, పట్టుకున్నదేకాని, తనకోరలతో వాణ్ణి కరవకుండా అలాగే మ్రింగి సుగంధకుండజలాధిదేవత దగ్గరకు తెచ్చి, ఉమిసి అప్పగించినట్టు, ఆమె పిల్లవాణ్ణి సముద్రుని ఎదుట పెట్టినట్టు, కనిపించింది. అంతలో త్రిశూలపాణియై కన్నులవెంట నిప్పులు రువ్వుతూ ఒకదివ్యపురుషుడు సముద్రుని దగ్గరకు వచ్చి, ఆక్షేపించి, "ఏమయ్యా? ఈ బాలుడు ఎవరో తెలుసునా? కర్దమ ప్రజాపతి కొడుకు. శివభక్తుడు. ఈ బాలుణ్ణి మొసలిచే పట్టించి, తెప్పిస్తావా? ఫాలాక్షుని ప్రభావం తెలియదా నీకు! హుం....." అని జంకించి అన్నట్టి ఆ మాటలకు అదిరి, గుండె చెదిరి, నదీ పతి బాలుణ్ణి చక్కగా అలంకరించి, మొసలిని ఒక త్రాటితో కట్టించి, దాన్ని ఆ శూలపాణికి అప్పగించి, బాలుణ్ణి వెంట బెట్టుకుని పరమేశ్వరునివద్దకు వెళ్లి, పాదాభివందనం చేసి, అనేక విధాల ప్రార్థించి, "క్షమించండి ప్రభూ! ఏ ద్రోహమూ ఎరుగను" అని విన్నవింపగా, పరమశివుడు "సరే! పో!" అని సముద్రుణ్ణి పంపేసి, బాలుణ్ణి తనకు భద్రంగా ఆ కింకరుడి ద్వారా అప్పగించడం... ఏదో నాటకం చూచినట్టు ధ్యానయోగ ముద్రలో కర్దముడు చూచాడు. అంతలో ధ్యానం అయిపోయింది. కళ్లుతెరిచి చూశాడు. ఎట్టయెదుట దివ్యభూషణ భూషితుడైన కొడుకు!

మొసలికోరలతో నొక్కిపట్టినందువల్ల సుకుమారమైన శరీరం కంది, లేత గులాబిలా ఉంది. కళ్లు కెందామరల్లాగా నీళ్లు క్రమ్మి, నిగనిగలాడుతున్నాయి. ఇంకా కొంచెం వణకు కనిపిస్తోంది. కానీ ఏవేవో అలంకారాలు, ధగధగలాడు తున్నాయి– సముద్రుడు అలంకరించినవి. జులపాల కొసల నుంచి నీటిచుక్కలు బొట్లుబొట్లుగా పడుతున్నాయి. ఇంకా నిట్టూర్పులు విడుస్తున్నాడు. వానికి ప్రక్కనే గ్రుడ్లు ఉరిమిచూస్తూ, త్రాటికి కట్టబడి, శివకింకరుని చేతి ఆటవస్తువులాగా ఉన్న పెద్దమొసలి. ఆ సమయంలో కర్దముడి ముఖం చిరుకోపంతో వికారంగా మారి, వెంటనే శాంతించి, స్వస్వరూపానికి వచ్చింది.

శుచిష్మంతుడు తండ్రి పాదాలకు సాష్టాంగనమస్కారాలు చేశాడు. అదృష్టవశాత్తు చచ్చి బ్రతికిన కొడుకు వచ్చి, ముచ్చటగా పాదాభివందనం చెయ్యడంవల్ల కర్దమ ప్రజాపతి చెప్పలేని ఆనందంతో కదిలిపోయాడు. అలాగే రెండుచేతులతో కొడుకును లేవనెత్తి, గట్టిగా కౌగిలించుకున్నాడు. ఇక్కడ ఒక కాలమానం చెప్పాలి. కర్దమ ప్రజాపతి ధ్యానంలో కూర్చుని, కొడుకు పడినపాట్లు చూచి, కళ్లు తెరచి చూచేసరికి నూట అయిదేళ్లయింది. వీరవిశ్వేశ్వరోపాసనావిధిలో కర్దముడికి ఇంత కాలమూ ఒక గడియలాగా గడచిపోయింది.



తరువాత కర్దముడు శుచిష్మంతుణ్ణి చూచి, "నాయనా! ఈ మొసలిని సముద్రంలో కట్టువిప్పి, విడిచిపెట్టు. నువ్వు శివ సన్నిధికి వెళ్లు" అని లాలనగా పంపాడు. శుచిష్మంతుడు తండ్రి అనుమతితో వారణాసికి వెళ్లి, శివలింగ ప్రతిష్ఠచేసి, అయిదువేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆ దివ్యతపస్సుకు విశ్వేశ్వరుడు ప్రత్యక్షమై "వత్సా! నీ తపస్సుకు మెచ్చాను. నీకు వరుణపదం ఇచ్చాను. ఈ నాటినుంచి నువ్వు రత్నాలకు, రత్నాకరాలకు, నదీనదాలకు, సరస్సులకు, నీటిగుంటలకూ మొత్తంమీద ఎక్కడెక్కడ ఉన్న జలాలకూ, జలచరాలకూ అధిపతివి. అంతేకాదు– పశ్చిమదిక్పాలకుడవై వర్ధిల్లు"– అని వరమిచ్చాడు. మళ్లీ–


"వరుణా! ఈ క్షేత్రంలో నువ్వు ఇక్కడ మణికర్ణేశ్వర లింగానికి నైరృతిగా ప్రతిష్ఠించిన ఈ లింగానికి వరుణేశ్వర లింగం అని పేరు. ఈ లింగమూర్తిని భజించే భక్తులు నా దయవల్ల నిర్భయులై బ్రతుకుతారు. ఏ రోగాలూ రావు. అకాల మరణం సంభవించదు. ఏ పరిస్థితిలోనూ ముఖ్యంగా జలోదరవ్యాధి రాదు. ఉన్నవారికి పోతుంది. దుర్దాహం ఉండదు. అంతేకాదు– వరుణేశ్వరారాధకులకు నీరసాలైన అన్నపానాలు సరసాలౌతాయి"– అని వరమిచ్చి, ఈశ్వరుడు అంతర్హితుడైనాడు. తదుపరి శుచిష్మంతుడు వరుణనామంతో ఈ లోకానికి తన వారితో సహావచ్చి, పడమటిదిశకు దొర అయి ఉంటున్నాడు. ఇదీ వరుణలోకస్వరూపం. ఈ వరుణలోకవృత్తాంతం వినేవారికి జలగండం ఉండదు." కనుక ప్రతి ఒక్కరూ నీటిని గౌరవించాలి.

భూలోకంలో పరోపకారులుగా దిగుడు బావుల్నీ, నూతుల్నీ, చెరువుల్నీ త్రవ్వించేవారు, తామరచెరువులూ, బాటల ప్రక్కలో ఫలవృక్షాలూ, పూదోటలూ, తోటలూ కల్పించేవారూ, వరుణ లోకానికి వస్తారు. చంద్రశేఖరుని ఆలయంలో ఆయన శిరసుపై సంతతధారను స్రవించే పూర్ణకుంభం ఉంచినవారు, ఎండలో ఆపసోపాలుపడి, కుత్తుకలెండి, వచ్చినవారికి పంచదార, పానకం ఇచ్చి తాపోపశమనం చేసినవారు, చలిపందిళ్లు వేసి బాటసారులకు విశ్రాంతి కలిగించినవారు, తీర్థయాత్రలకై వెళ్లేవారికి పూర్ణకుంభాలూ, పాదరక్షలూ ఇచ్చినవారు, జలప్రవాహంలో కొట్టుకుపోతున్నవారిని, ప్రాణాలకు తెగించి నీటమునిగి, గట్టుకెక్కించినవారు, వరుణలోకానికి వచ్చి, నిండు వేడుకతో సుఖజీవనం చేస్తారు. దేవాలయాలలో దేవతా విగ్రహాలకు కంఠహారాలు చేయించినవారు, సంకెళ్లకు కట్టువడి, దోషానికి చెరశిక్ష అనుభవిస్తున్న దోషుల సంకెళ్లను విడిపించే దయాళువులు, చెరువులనుంచి నీళ్లు తెచ్చుకోవడానికి అనువుగా పావంచాలు మెట్లు నిర్మించేవారు, వేసవిలో ఇండ్లకు వచ్చిన అతిథులకు తాపశాంతి కలిగించిన పుణ్యాత్ములూ, వరుణలోకవాసులౌతారు. ఈ లోకపాలకుడు వరుణుడు. ఈ మహానుభావుడు సమస్త జలాశయాలకూ, జలచరాలకూ, నదీనదాలకూ, సముద్రాలకూ ప్రభువు. సర్వకర్మసాక్షి. ఇతని చరిత్రం పరమ పవిత్రం.

## శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు, తిరుపతి

**2024, మే 16 నుండి 24 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 16-05-2024 | గురు | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 17-05-2024 | శుక్ర | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 18-05-2024 | శని | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 19-05-2024 | ఆది | కల్పవృక్షవాహనం | సర్వభూపాల వాహనం |
| 20-05-2024 | సోమ | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 21-05-2024 | మంగళ | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం | గజవాహనం |
| 22-05-2024 | బుధ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 23-05-2024 | గురు | రథోత్సవం | అశ్వవాహనం |
| 24-05-2024 | శుక్ర | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ అవభృథం, చక్రతీర్థం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |



ఆయుర్వేదం

# స్వరమాధుర్యానికి సులభమార్గాలెన్నో

-డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ఉపన్యాసకులు, అధ్యాపకులు, గాయకులు, సభల్లో ప్రసంగించేవారు, గొంతును తరచుగా ఎక్కువగా ఉపయోగించటం వల్ల స్వరానికి కారణమయ్యే గొంతులోని స్వరపేటిక కండరాలు అలసటకు గురై స్వరంలో మార్పువచ్చి గొంతు బొంగురుపోయే పరిస్థితి ఏర్పడుతుంది. గాత్రమాధుర్యం దెబ్బ తింటుంది.

సాధారణంగా చాలామందిలో ఈ సమస్య త్వరగా తగ్గిపోతుంది. కొంతమందిలో మాత్రం దీర్ఘకాలికసమస్యగా పరిణమించే అవకాశముంది. ఆయుర్వేద వైద్యవిధానంలో గొంతు బొంగురు పోవటాన్ని స్వరభేదం, స్వరక్షయం, కంఠోధ్వంసం యిత్యాది పేర్లను, ఆధునికంగా లారింజైటిస్, హోర్స్‌నెస్ ఆఫ్ వాయిస్ లాంటి పేర్లతో వ్యవహరిస్తారు.

## చికిత్స

**గృహవైద్యం-** ఈక్రింది వాటిలో ఏదో ఒకటి వాడుకోవచ్చు.

**01)** 5మి.లీ. అల్లం రసం, 5మి.లీ. తేనె కలిపి మూడు పూటలా సేవించాలి.



**02)** రోజూ 2, 3సార్లు పూటకు 50మి.లీ. వేడిపాలలో 4, 5 మిరియాలను దంచి చేసిన పొడి, రెండు చిటికెల స్వచ్ఛమైన పసుపుపొడి కలిపి సేవించాలి.

**03)** లవంగాలు, ఏలకులు, మిరియాల చూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకుని మూడు పూటలా పూటకు 500 మి.గ్రా. చొప్పున తగినంత తేనె కలిపి చప్పరించాలి.

### ఆయుర్వేదం

**01)** రోజూ ఉదయం, సాయంత్రం పూటకు ఒక గ్రాము చొప్పున నాగకేసర చూర్ణం లేదా గంధకచోరాల చూర్ణం లేదా పుష్కరమూల చూర్ణం లేదా ఉసిరిక చూర్ణాన్ని తగినంత నీరు లేదా తేనెతో సేవించాలి.

**02)** రోజూ మూడు పూటలా పూటకు 500 మి.గ్రా. చొప్పున వచచూర్ణం లేదా పిప్పళ్ల చూర్ణాన్ని తగినంత తేనెతో కలిపి సేవించాలి.

ఆయుర్వేదౌషధ విక్రయశాలల్లో లభ్యమయ్యే లవంగాది వటి, ఏలాదివటి, ఖదిరాటివటివంటి ఔషధాల్లో ఏదేని ఒక దాన్ని మూడు పూటలా పూటకు ఒకట్రెండు మాత్రల చొప్పున చప్పరిస్తుంటే కూడా త్వరగా ప్రయోజనం కలుగుతుంది.



### జాగ్రత్తలు

స్వరమాధుర్యాన్ని కాపాడుకునేందుకు నీటిని కొద్ది కొద్దిగా ఎక్కువసార్లు సేవిస్తుండాలి. నీటి శాతం ఎక్కువగా ఉండే పళ్లు, కొబ్బరిబొండా నీరుకూడా స్వరపేటిక ఆరోగ్యానికి సహకరిస్తాయి. ప్రాణాయామప్రక్రియను ఒక అభ్యాసంగా కొనసాగించటం చాలామంచిది.

మరిగే నీటిలో కాస్త కర్పూరం పొడి లేదా 10-15 చుక్కల నీలగిరి తైలం వేసి ఆవిరి పీలిస్తే కూడా గొంతు బొంగురుకి తక్షణపరిష్కారం దొరుకుతుంది.

ఫ్రిజ్‌లో ఉంచిన పదార్థాలను ఫ్రిజ్ నుంచి తీసిన వెంటనే సేవించటం, ఐస్‌క్రీమ్స్, శీతలపానీయాలు, అధికంగా వేడి ఉండే ఘనద్రవ ఆహారాలు, బేకరి ఆహారఉత్పత్తులు, పెరుగు, పుల్లటి పదార్థాల సేవన మంచిది కాదు.

ఎక్కువగా నూనెలో వేయించి వండిన ఆహారాలు, అతిగా స్వీట్లు సేవించటం, నిల్వ ఉన్న ఆహార సేవన కూడా గాత్రసామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.

తాజా ఆహారంతో పాటు ప్రకృతి సిద్ధ ఆహారపదార్థాలను ఎక్కువగా తీసుకోవటం, వేళకి విశ్రాంతిలాంటి జాగ్రత్తల వల్ల స్వరపేటిక ఆరోగ్యం పదిలంగా ఉండి మధురమైన కంఠస్వరం మన స్వంతమౌతుంది.

# ఆధ్యాత్మిక కీర్తిపతాకం...

- డా॥ కప్పగంతు రామకృష్ణ, 90320 44115

శంకరులు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపం. ఆయన పుట్టుకతోనే మహావేదాంతి. బహుముఖప్రజ్ఞాశాలి. మహాయోగి. మహిమోపేతుడు. మహోన్నతమూర్తి. అద్భుతమైన కవి. మానవతామూర్తి. సంఘసంస్కర్త. సంఘనిర్మాణకర్త. గొప్ప తార్కికుడు.

బాల్యంనుంచి శంకరులు ఎన్నో మహిమల్ని చూపించారు. కానీ, ఎక్కడా తాను భగవంతుడి అవతారమని ప్రకటించలేదు. శ్రీకృష్ణపరమాత్మ తీరులో తాను లీలల్ని చూపిస్తున్నట్లు కాకుండా, తన అనుష్ఠానబలంతో దేవతల్ని ప్రసన్నం చేసుకుని, వారి ఆశీర్వాదబలంతోనే పనులన్నీ నడిపిస్తున్నట్లు చూపించారు. సర్వసంగపరిత్యాగియై, యావద్భారత దేశాన్ని నాలుగు సార్లు పాదయాత్ర చేసి, అఖండమైన హైందవ ధర్మాన్ని తన బోధనలద్వారా సుస్థిరం చేశారు.



## అనంత రచనాసాగరం

శంకరులు గొప్ప తత్త్వవేత్త. వేదాంత విరుద్ధ విషయాలను ఖండించటంతో పాటు సమన్వయ మార్గాన్ని చూపించారు. శంకరులు ఏ విషయం చెప్పినా, అందుకు ప్రమాణంగా శృతినో, స్మృతిలో, ఇతిహాసాన్నో, కావ్యాన్నో ఉదాహరణగా చూపించేవారు. అందుకే, ఆయన రచించిన భాష్యాలు ఇప్పటికీ ప్రమాణాలుగా నిలుస్తున్నాయి.

శంకరాచార్యులు పది ఉపనిషత్తులకు, బ్రహ్మసూత్రాలకు, భగవద్గీతకు భాష్యాన్ని రచించారు. వీటినే ప్రస్థానత్రయం అంటారు. శంకరుల రచనలో శివానందలహరి శివభక్తిగంగలో పాతకుల్ని మునకలు వేయిస్తుంది. సౌందర్యలహరి పూర్తిగా మంత్రమయం. బయటకు స్తోత్రంగా కనిపిస్తున్నప్పటికీ సౌందర్యలహరిలో ఎన్నో మంత్రాలను శంకరులు నిక్షిప్తం చేశారు. అద్వైతసిద్ధాంతాన్ని వివరిస్తూ మరొక 18 గ్రంథాలు, 74 లఘు గ్రంథాలు రచించారు.

ఇవన్నీ ఒక ఎత్తయితే, శంకరులు రచించిన స్తోత్ర సాహిత్యం ఒక్కటీ ఒక ఎత్తు. విష్ణుసహస్రనామం, కనకధారా స్తవం, మనీషాపంచకం, మాతృపంచకం, శివానందలహరి, సౌందర్యలహరి, వివేకచూడామణి, భజగోవిందం, గణేశ పంచరత్న స్తోత్రం, లక్ష్మీనృసింహ కరావలంబస్తోత్రం... ఈ పరంపరకు అంతులేదు. ఆదిశంకరుల స్తోత్రం చదవని భారతీయుడూ లేడు. ఇది సత్యం.

శంకరులు శివ, విష్ణు, దేవి, సూర్య, గణేశ, స్కంద, పూజావిధానాలను సంస్కరించి, ఆయా దేవతల ప్రార్థన శ్లోకాలు రచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరు ప్రార్థించి, తరించేలా అనంతమైన స్తోత్రాలను రచించి, తన వారసత్వ సంపదగా అందించారు. ఇవి కేవలం సాహితీవిన్యాసాలతో కూడిన స్తోత్రాలు కావు. భగవంతుడిని భక్తుల కళ్ళముందు నిలిపే జ్ఞానదీపాలు. శంకరుల స్తోత్రాలు చదువుతుంటే తెలియని అలౌకిక ఆనందానుభూతి కలుగుతుంది.

## మఠ నిర్వహణ విధానం


ఆదిశంకరులు దేశం నలుమూలలా పర్యటించి, నాలుగుమహాపీఠాలు నెలకొల్పారు. కేవలం పీఠాలు నెలకొల్పటంతోనే తన కర్తవ్యం పూర్తయినట్లు శంకరులు భావించలేదు. ప్రతి మఠం అత్యంత ధర్మబద్ధంగా నడుస్తూ, సమాజాన్ని ధర్మం, సదాచారాలవైపు నడిపించేలా సర్వోన్నతశక్తి కేంద్రాలుగా తీర్చిదిద్దారు. శంకరుల వ్యవస్థా నైపుణ్యానికి ఇప్పటికి 2500 సంవత్సరాలుగా అవిచ్ఛిన్నంగా నడుస్తున్న ఈ మఠాలే తార్కాణాలు. హిందూధర్మాన్ని పునరుజ్జీవింపజేసి, వ్యాప్తి చెయ్యటానికి ఈ నాలుగుమఠాలకు కొన్ని కర్తవ్యాలను శంకరులు నిర్దేశించారు. మఠామ్నాయం, మహానుశాసనం పేరుతో వీటిల్ని ఆయా మఠాలు అత్యంత భక్తిశ్రద్ధలతో అనుసరిస్తున్నాయి.


ఆదిశంకరుల జీవితమే ఓ సందేశం. మనిషిని అన్ని రకాలుగా తీర్చిదిద్ది, లోకప్రయోజకుడిగా తీర్చిదిద్దటం, అంతిమంగా మోక్షపదాన్ని అందుకోవటం శంకరుల జీవిత సారాంశంగా కనిపిస్తుంది. విజ్ఞానం కొంతమందికి మాత్రమే కాదని, సమాజంలో ప్రతి వ్యక్తి భగవంతుని చేరుకోవటానికి అది అందాలని కోరుకున్న వ్యక్తి శంకరాచార్యులు. అందుకనే, అనంతమైన స్తోత్రసాహిత్యాన్ని అందించారు. భౌతికంగా మన మధ్య ఉన్నది కేవలం 32 సంవత్సరాలే అయినా, ముప్పై యుగాలు గడిచినా తరగని ఆధ్యాత్మిక సంపదను మనకు అందించారు. మనం చేయవలసింది ఆ మహనీయుని అడుగు జాడల్లో నడవటమే.

చిత్ర కథ

# భక్తులను బాధిస్తే...

కథ- డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ




అక్కారాం శిష్యుడు ఇంట్లోంచి వచ్చి...
అయ్యా! మన ఇంట్లో పశువులన్నీ ఉన్నట్టుండి చచ్చిపోయాయి. ఇంట్లో అందరికీ వాంతులు, విరేచనాలు. ఇల్లంతా స్మశానంలాగా అయిపోయిందండీ..
అమ్మా తల్లీ నా తప్పులను క్షమించు...నన్ను కరుణించి కాపాడు. నీ గొప్పతనం తెలియక నిన్ను అవమానించాలనుకున్నాను. కానీ నేనే భంగపడ్డాను. నీ పాదాలే నాకిక దిక్కు..
ఇకమీద అయినా బుద్ధిగా ఉండు. భక్తులను ఇబ్బంది పెడితే భగవంతుడు మన్నించడు. భాగవతాపచారం మహాఘోరం. ఇక్కడికి వచ్చే భక్తులు తమ పాపాలను నివృత్తి చేసుకోవాలని వస్తారు. వాళ్లని బాధపెట్టి నీవెందుకు వాళ్ళ కర్మలని మూటగట్టుకుంటావు. తప్పు చేశావు. ఇకనైనా మారు....
స్వామీ వేంకటేశా!
పిలిచావా వెంగమాంబా!
స్వామీ! ఇకనేను ఇక్కడ ఉండలేను. నేను ప్రశాంతంగా తపస్సు చేసుకోవాలి. ఇక్కడ ధ్యానానికీ, భక్తికీ భంగం కలుగుతోంది. ఏదైనా ఒక ప్రశాంత ప్రదేశాన్ని నిర్దేశించండి.
వెంగమ్మా! తుంబురతీర్థానికి వెళ్లి యోగ సాధన సాగించు. అక్కడికి ఎవ్వరూ రారు.
ధన్యురాలను స్వామీ! ధన్యురాలను. ఆపదమొక్కులవాడా! అనాథరక్షకా! గోవిందా... గోవిందా...!
లోకా: సమస్తా: సుఖినో భవంతు!


## తెలుసుకుందాం!


పిల్లలూ! మనకు 26 ఏకాదశులున్నాయి.
వాటి పేర్లు తెలుసుకుందాం!

| | |
|---|---|
| చైత్రశుద్ధ ఏకాదశి | - కామదైకాదశి |
| చైత్ర బహుళ ఏకాదశి | - వరూధిన్నైకాదశి |
| వైశాఖ శుద్ధ ఏకాదశి | - మోహిన్యేకాదశి |
| వైశాఖ బహుళ ఏకాదశి | - అపరైకాదశి |
| జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి | - నిర్జలైకాదశి |
| జ్యేష్ఠ బహుళ ఏకాదశి | - యోగిన్యేకాదశి |
| ఆషాఢశుద్ధ ఏకాదశి | - పద్మైకాదశి |
| ఆషాఢ బహుళ ఏకాదశి | - కామికైకాదశి |
| శ్రావణ శుద్ధ ఏకాదశి | - పుత్రదైకాదశి |
| శ్రావణ బహుళ ఏకాదశి | - అజైకాదశి |
| భాద్రపద శుద్ధ ఏకాదశి | - వామనైకాదశి |
| భాద్రపద బహుళ ఏకాదశి | - ఇందిరైకాదశి |
| ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి | - పాశాంకుశైకాదశి |
| ఆశ్వయుజ బహుళ ఏకాదశి | - రమైకాదశి |
| కార్తిక శుద్ధ ఏకాదశి | - ప్రబోధన్నైకాదశి |
| కార్తిక బహుళ ఏకాదశి | - ఉత్పన్నైకాదశి |
| మార్గశిర శుద్ధ ఏకాదశి | - మోక్షదైకాదశి |
| మార్గశిర బహుళ ఏకాదశి | - సఫలైకాదశి |
| పుష్య శుద్ధ ఏకాదశి | - సఫలైకాదశి |
| పుష్య బహుళ ఏకాదశి | - షట్తిలైకాదశి |
| మాఘ శుద్ధ ఏకాదశి | - జయైకాదశి |
| మాఘ బహుళ ఏకాదశి | - విజయైకాదశి |
| ఫాల్గుణ శుద్ధ ఏకాదశి | - ఆలమలక్యేకాదశి |
| ఫాల్గుణ బహుళ ఏకాదశి | - పాపమోచిన్యేకాదశి |
| అధిక మాసం శుద్ధ ఏకాదశి | - సుభద్ర |
| అధిక మాసం బహుళ ఏకాదశి | - కమల |

## బొమ్మల్లో ఏముంది?


క్రింద ఇచ్చిన బొమ్మల ఆధారంగా వాటి పేర్లను ఖాళీ గడుల్లో పూరించండి.







జవాబులు:
1)పర్వతాలు 2)తాబేలు
3)కాగితాలు 4)తాళంచెవి
5)విసనకర్ర 6)కలం

## పిల్లలూ..! అంకెలు కలిపి, రంగులు వేయండి!!




## రంగులు వేద్దాం..!!





పై చిత్రాన్ని
చూసి
రంగులు
వేయండి

మే, 2024

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** సమాజంలో ఉన్నతస్థాయి వ్యక్తులవల్ల సన్మానం, విద్యార్థులు శ్రమించి విద్యావిషయాల్లో రాణించడం, వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయం, వాహనసౌఖ్యం కలిగియుందురు. కుటుంబసభ్యుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తారు. ప్రయత్నించినపనులు అనుకూలమౌతాయి.



**వృషభం–** అనేకమార్గాలనుండి ఆదాయం వస్తుంది. పెట్టుబడులు, వ్యాపారాలు, వృత్తి విషయాలలో ఆర్థికంగా ముందంజ వేస్తారు. ఆరోగ్యం, అన్నింటా జయం. కుటుంబసభ్యులతో అవగాహన కల్గి యుంటారు.



**మిథునం–** ఊహించని లాభాలు వస్తాయి. ప్రశంసలు పొందుతారు. వ్యాపారం కూడా లాభ దాయకంగా ఉంటుంది. ఆదాయఅవకాశాలు పెరుగుతాయి. పదోన్నతి లేదా వేతనాలు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి.



**కర్కాటకం–** గత ఏడాది చేసిన అప్పులను చాలా వరకు తీర్చగల్గుతారు. అష్టమస్థానంలో శని సంచారం వల్ల ప్రతిబంధకాలు. ఇష్టం లేని పనులు చేయవలసి వచ్చినా అన్నిటినీ అధిగమిస్తారు.



**సింహం–** అజీర్ణం, రక్తప్రసరణ సమస్యలు, ఫైల్స్ ఇబ్బంది పెట్టొచ్చు. నిరుత్సాహం లేదా అసౌకర్య భావనను తొలగించుకోవడానికి యోగాభ్యాసం వంటివి చేయడం మంచిది.



**కన్య–** అన్ని ప్రయత్నాలలో విజయం వరిస్తుంది. వ్యాపారం పెరుగుతుంది, జ్ఞానం వృద్ధి చెందుతుంది. చదువులో పురోగతి, వాహనం, సంపద మరియు విలాసవంతమైన జీవితంవంటి సౌకర్యాలతో జీవన శైలి సంపన్నమౌతుంది.



**తుల–** తండ్రికి అనారోగ్య సూచన, స్వస్థానం విడిచి వేరేచోట ఉండాల్సి వస్తుంది. కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కలహాలు నివారిస్తారు. కుటుంబఆశయాలకు కృషి చేస్తారు. ఆర్థిక లాభాలు వస్తాయి.



**వృశ్చికం–** ఆరోగ్యం సామాన్యం. పిల్లలతో సమస్యలు, కుటుంబ సభ్యులతో వాదనలకు దిగవద్దు. చెడుసావాసాలకు దూరంగా ఉండండి. విద్యార్థుల ప్రయత్నాలు కార్యరూపం కాకపోవచ్చు.



**ధనుస్సు–**సంపదలు, స్థిరాస్తులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. ధనవస్త్రలాభాలు, ఇష్టకార్య సిద్ధి కల్గుతాయి. కృషి, శ్రమకు తగ్గ ఫలిత మొస్తుంది. ఉద్యోగం వస్తుంది. వృత్తివిషయాలు అనుకూలంగా ఉంటాయి.



**మకరం–** ఉద్యోగాలలో పూర్తి సంతృప్తి. ఆర్థిక పరిపుష్టి, కొత్త పథకాలకు శ్రీకారం చుడతారు. ధైర్యసాహసాలను ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందుతారు. అంటువ్యాధులు, అగ్ని సంబంధ వ్రణాలతో అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంది.




**కుంభం–** క్రమేపీ స్వీయవృద్ధిని సాధిస్తూ స్థిరత్వాన్ని పొందుతారు. గతం నుంచి గుణపాఠాలు నేర్చుకుని విశ్రాంతిగా యోగాభ్యాసం చేస్తూ ఏకాగ్రత సాధిస్తూ, సుఖజీవనం చేస్తారు.



**మీనం–** దూరప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. గురుబలం లేకపోయినా అద్భుతమైన వాగ్ధోరణితో ఇతరులను ప్రభావితం చేయగలరు. అధిక ధన వ్యయం.

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# చదువు - సంస్కారం

ఎంత చదువు చదివి, ఎన్ని విన్నను గాని,
హీను డవగుణంబు మానలేడు;
బొగ్గు పాల గడుగ పోవునా మలినంబు
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** హీనుడు= నీచుడు; అవగుణంబు= చెడుగుణం; మలినము= కల్మషం.

**భావం:** ఎంత చదువు చదివినా, పెద్దలవల్ల ఎన్ని విన్నా, నీచుడు తనకున్న చెడ్డగుణం వదలి పెట్టడు. బొగ్గును పాలతో శుభ్రం చేసినా మలినం పోదు గదా!.

**వివరణ:** సహజంగా దుర్గుణాలు కలిగినవాడు ఎన్ని శాస్త్రాలు చదివినా, మహాత్ములవద్ద ఎంతకాలం మంచిమాటలు విన్నా, వాడిలో మార్పు రాదు. పుట్టుకతో వచ్చిన చెడుగుణాలు పోవు. చదువులు వేరు. సంస్కారం వేరు. చదువువల్ల సంస్కారం రాదు. అది వ్యక్తిలో సహజంగా ఉండాల్సిన లక్షణం. బొగ్గు సహజంగా నల్లగా, మలినంగా ఉంటుంది. దాన్ని పోగొట్టాలని స్వచ్ఛమైనపాలతో కడిగితే తెల్లబడుతుందా? పాలను ఇంకోదానితో శుద్ధి చేయక్కర్లేదు. సంస్కారం ఉన్నవాడు చదువులేకపోయినా, గౌర వార్హుడే. సంస్కారం లేకపోతే ఎంత చదువు కున్నా మంచివాడు కాలేదు. పాండిత్యంకంటే సద్గుణాలు కలిగిఉండడం ముఖ్యం.

*- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు*

భాస్కరశతకం

# ధర్మాధర్మాలు

చ. వలనుగఁగానలందుఁ బ్రతివర్షమునం బులి నాలుగైదు పి
ల్లలఁగను దూడనొక్కటి నిలంగను ధేనువు రెండుమూడునేఁ
డుల కటులైన బెబ్బులికుటుంబము లల్పము లాయెనాలమం
దలు గడువృద్ధిఁజెందవె యధర్మము ధర్మము దెల్ప భాస్కరా!



**తాత్పర్యం**

భాస్కరా! అడవులలో పులి ప్రతిసంవత్సరం నాలుగైదు పిల్లలను పెడుతుంది. గ్రామాల్లో ఆవు రెండుమూడేళ్లకు ఒక్కదూడకు జన్మనిస్తుంది. విశేషమే మంటే అధర్మాన్ని, ధర్మాన్ని ప్రకటించునట్లుగా పులుల కుటుంబాలు అల్పసంఖ్యాకంగా ఉంటున్నాయి. ఆవుల మందలు మిక్కిలిగా వృద్ధిచెందుతున్నాయి.

శతకకవి ఈపద్యంలో ధర్మం యొక్క, అధర్మం యొక్క పరిస్థితిని అపురూపంగా చిత్రించాడు. నిజానికి ఏడాదికి నాలుగైదు పిల్లలను పెట్టే పులిజాతి ఇబ్బడి ముబ్బడిగా వృద్ధి చెందాలి, కానీ అలా జరగడం లేదు. క్రూరమృగమైన పులి అధర్మానికి ప్రతీక. ఆవులు రెండు మూడేళ్లకు ఒక్కదూడను ప్రసవించినా వాటి మందలు తామరతంపరగా వృద్ధి చెందుతున్నాయి. సాధుజంతువైన ఆవు ధర్మానికి ప్రతీక.

అధర్మానికి వృద్ధి లేదని,ధర్మానికే ఉన్నతి అన్న విషయాన్ని శతక కవి ప్రత్యక్షంగా కనిపిస్తున్న పులిజాతి, గోజాతి దృష్టాంతంగా వివరించిన వైనం అత్యద్భుతం.

*- డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు*

# క్విజ్ 22

01) శ్రీగోవిందరాజస్వామి విగ్రహప్రతిష్ఠ జరిగిన నక్షత్రం? జ)......

02) శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో శాలినాచ్చియార్ ఉత్సవాలు ఏ నక్షత్రం నాడు పూర్తవుతాయి? జ)......

03) పురుషార్థాలలో చివరిది? జ)......

04) స్వర్గంలో మొదటి ప్రవేశం ఎవరికి లభిస్తుంది?? జ)......

05) రామానుజ కూటాలు పర్యవేక్షణ చేసిన వారు? జ)......

06) ఏరువాక పూర్ణిమ ఈ సంవత్సరం ఏతేదీన వస్తుంది? జ)......

07) నర్మదానది పొడవు ఎంత? జ)......

08) నర్మదా జయంతి ఏ రోజున జరుపుతారు? జ)......

09) నర్మదానది రెండుగా చీలే ప్రాంతం? జ)......

10) పరుల నుతింపగా నోపదు జిహ్వ అన్నదెవరు? జ)......

11) క్షీరసాగరమథనంలో వినియోగింపబడ్డ సర్పం పేరు? ? జ)......

12) ద్యుతిమానుడు ఏ వంశానికి చెందిన వాడు? జ)......

13) శుచిష్మంతుడు ఎవరి కొడుకు? జ)......

14) సౌందర్య లహరి కర్త? జ)......

15) వెంగమాంబ ను ఇబ్బంది పెట్టిన వారు? జ)......

16) గరుత్మంతునకు అనుసంధించే శ్లోకం? జ)......

17) అక్కన్న, మాదన్న ఎవరి మంత్రులు? జ)......

18) నారాపురంలో స్వామివారి ఆలయప్రాకారాన్ని నిర్మించిందెవరు? జ)......

19) వ్యక్తిత్వగుణంలో తలమానికమైంది? జ)......

20) జలగండం ఎవరికుండదు? జ)......

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-05-2024.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ...... వయస్సు: ......

పాఠశాల: ...... తరగతి: ......

పేరు: ......

చిరునామా: ......

......

......

...... పిన్‌కోడ్: ......

ఫోన్ సంఖ్య: ......

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

............................................................. తేది : ..................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 100



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)విశ్వామిత్రుని నూర్గురు కొడుకులలో ఏబదిఒకటవ వాడు(5); 3)మహిషాసురుని మంత్రి(4); 6)కామాన్ని వదలి మోక్షాన్ని పొందిన బ్రాహ్మణుడు(2); 7)దశార్ణదేశమందలి ఒక నది(4); 8)విదూరథుడను రాజు కుమార్తె(4) 9)విశ్వామిత్రునకు మాధవియందు పుట్టిన కుమారుడు(4); 12)మాంధాత కుమారుడు. ఒక రాజు(5); 14)హనుమంతుని చేతిలో ఉన్న ఆయుధము(2); 15)కోరిక కల్గినప్పుడల్లా రాజులు ఈ పని చేస్తుంటారు(2); 16)శివుడు(7); 19)ముత్యాలహారము(4); 20)స్ఫోటకము వస్తే ఇలా పిలుస్తారు(4)

### నిలువు

1)వింధ్యపర్వతము దగ్గర దండు అనువాడు నిర్మించిన నగరం(5); 2)భారతంలో నల్గురు దుర్మార్గులను ఏమని పిలుస్తారు(7); 4)అమృతము(2); 5)శ్రీకృష్ణుని మేనత్త(3); 8)భర్మ్యాశ్వుని కుమారుడు(4); 10)సోమకులను వారి మానసపుత్రిక. ఇది ఒక సరస్సు(4); 11)కృష్ణుడు(4); 13)కైకసి తోబుట్టువు(4); 13)కైకసి తోబుట్టువు(4); 16)తాతతండ్రి(3); 17)ఒక పండు(3); 18)ప్రాణులకు జీవనాధారము(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

తిరుమల తిరుపతి దేవస్థానములు



హృషీకేశ్



నారాయణవనం

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవం

**2024 మే 21 నుండి 29 వరకు**

**21-05-2024 మంగళవారం**
పగలు: ధ్వజారోహణం - రాత్రి: పెద్దశేషవాహనం.

**22-05-2024 బుధవారం**
పగలు: చిన్నశేషవాహనం - రాత్రి: హంసవాహనం.

**23-05-2024 గురువారం**
పగలు: సింహవాహనం - రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**24-05-2024 శుక్రవారం**
పగలు: కల్పవృక్షవాహనం - రాత్రి: సర్వభూపాలవాహనం.

**25-05-2024 శనివారం**
పగలు: పల్లకీలో మోహినీ అవతారోత్సవం - రాత్రి: గరుడవాహనం.

**26-05-2024 ఆదివారం**
పగలు: హనుమద్వాహనం - రాత్రి: గజవాహనం.

**27-05-2024 సోమవారం**
పగలు: సూర్యప్రభవాహనం - రాత్రి: చంద్రప్రభవాహనం.

**28-05-2024 మంగళవారం**
పగలు: రథోత్సవం - రాత్రి: అశ్వవాహనం.

**29-05-2024 బుధవారం**
పగలు: చక్రస్నానం - రాత్రి: ధ్వజావరోహణం.



జమ్మలమడుగు

## జమ్మలమడుగు శ్రీ భూ సమేత నారాపుర వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవం

**2024 మే 21 నుండి 29 వరకు**

**21-05-2024 మంగళవారం**
పగలు: ధ్వజారోహణం - రాత్రి: పెద్దశేషవాహనం.

**22-05-2024 బుధవారం**
పగలు: చిన్నశేషవాహనం - రాత్రి: హంసవాహనం.

**23-05-2024 గురువారం**
పగలు: ముత్యపుపందిరివాహనం - రాత్రి: సింహవాహనం.

**24-05-2024 శుక్రవారం**
పగలు: కల్పవృక్షవాహనం - రాత్రి: హనుమద్వాహనం.

**25-05-2024 శనివారం**
పగలు: మోహినీ అవతారోత్సవం - రాత్రి: గరుడవాహనం.

**26-05-2024 ఆదివారం**
పగలు: సర్వభూపాలవాహనం - రాత్రి: గజవాహనం.

**27-05-2024 సోమవారం**
పగలు: రథోత్సవం - రాత్రి: అశ్వవాహనం.

**28-05-2024 మంగళవారం**
పగలు: సూర్యప్రభవాహనం - రాత్రి: చంద్రప్రభవాహనం.

**29-05-2024 బుధవారం**
పగలు: చక్రస్నానం - రాత్రి: ధ్వజావరోహణం.

**SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-04-2024 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2024-2026 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" posting on 5th of Every Month.**



## నారాయణవనం

# శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

## 2024 మే 21 నుండి 29 వరకు